అనుదినం... జనస్వరం


నవతెలంగాణ

బుధవారం 3-1-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 6 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12+16 పేజీలు వెల : 5.00

మహా మంటలు

- దళితులపై పేట్రేగిన అగ్రవర్ణాలు
- ఒకరి మృతి..పలువురికి గాయాలు
- ముంబయిని తాకిన నిరసనలు
- నేడు మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన దళిత సంఘాలు
- పుకార్లు నమ్మొద్దు : ముఖ్యమంత్రి ఫడ్నవీస్


ఔరంగాబాద్‌లో..


ముంబయిలో దళితుల నిరసన ప్రదర్శన..

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు,మైనార్టీలపై దాడులు గణనీయంగా పెరిగిపోతున్నాయని నేషనల్ క్రైం బ్యూరో రికార్డులు ధ్రువీకరిస్తూనే ఉన్నాయి.కానీ హిందుత్వశక్తుల ఆగడాలు ఎక్కడా ఆగటంలేదు. తాజాగా పూణేలో ఏండ్ల తరబడి దళితులు నిర్వహిస్తున్న శాంతియుత ప్రదర్శనపై మాటు వేసి అగ్రవర్ణాలు తెగబడ్డాయి. దొరికిన వారిని దొరికినట్టు దళిత యువకులపై జులుం ప్రదర్శించారు. ప్రదర్శనంతా రక్తసిక్తంగా కాగా..ఈ దాడి ఘటనలో ఓ దళిత యువకుడు చనిపోయాడు. దీనికి నిరసనగా దళితులంతా ఏకమై చేస్తున్న నిరసన ప్రదర్శనలతో మహారాష్ట్ర మండుతోంది. దేశ ఆర్థిక నగరమైన ముంబయితో సహా 13 మహానగరాల్లో అల్లర్లు విస్తరించాయి. అసలింతకీ పూణేలో ఏం జరిగింది..?

ముంబై : దళితుల నిరసనతో మహారాష్ట్ర అట్టుడుకుతోంది. పూణెలో శాంతియుతంగా ప్రదర్శన జరుపుతున్న దళితులపై మరాఠా కమ్యూనిటీకి చెందిన కొందరు సోమవారం దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో రాహుల్ ఫతంగలే మృతిచెందారు. దీంతో ఆగ్రహానికి గురైన దళితులు నిరసనలకు దిగారు. మహారాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. ముంబయి, పూణె నగరాలు నిరసనలతో అట్టుడికాయి. 1818, జనవరి 1న పీష్వా బాజీరావ్-2 సేనలపై బ్రిటిష్ సేనలు సాధించిన విజయానికి చిహ్నంగా దళితులు ప్రతీ ఏడాదీ సంబరాలు జరుపుతారు. బ్రిటిష్ దళంలో అత్యధిక మంది దళితులే. బ్రిటిష్ సేనల్లో వారు భాగంగా ఉన్నారు. ఈ విజయాన్ని అగ్రవర్ణాలపై గెలుపుగా దళితులు భావిస్తారు. కాగా వారి ఉత్సవాలు అగ్రవర్ణాలకు కంటగింపుగా మారాయి. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాలు ఉండటంతో.. దళితులను కట్టడి చేయటానికి అగ్రకులాలు వ్యూహం పన్నారు. వారు తిరగబడితే ఖతం చేద్దామనేలా హిందూత్వశక్తులు కాపుకాశాయి. కానీ ఇవేమీ తెలియని దళితులు యధావిధిగా తమ కార్యక్రమానికి సిద్ధమయ్యారు. భారీ ప్రదర్శనకు దిగారు. బ్రిటీష్ వారి గెలుపుపై దళితులు ఉత్సవాలు చేసుకోవడమేంటంటూ అగ్రవర్ణాలు దాడికి దిగాయి. దీనికి నిరసనగా దళితులు ముంబయి సహా పలు నగరాల్లో మంగళవారం ...9లో


ఎగుమతుల్లోనూ చిట్టచివరే !

- చిన్న దేశాలే దూసుకుపోతున్నాయ్
- ఉపాధి కల్పనలో వైఫల్యాలే కారణం

న్యూఢిల్లీ : దేశం నుంచి ఎగుమతులు గత ఏడాది ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో అంతకుముందు ఏడాదితో పోలిస్తే 12 శాతం పెరుగుదలను సూచిస్తున్నాయి. అయితే మనకన్నా చాలా చిన్న దేశాలైన వియత్నాం, ఇండొనేసియా మనకంటే ఎక్కువ పురోగతిని నమోదు చేయడం గమనిస్తే మనం అడుగు దూరం వెళ్లే సరికి ఆ దేశాలు గజాల దూరం వెళ్లిపోతున్నాయి. వియత్నాం ఎగుమతులు 24 శాతం పెరిగిపోగా, ఇండోనేషియా ఎగుమతులు 16 శాతం పెరగడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా వ్యాపార రంగం కోలుకుంటున్న మాట వాస్తవం. బహుశా వచ్చే ఏడాది ఇదే ధోరణి మరింత చురుగ్గా కొనసాగవచ్చు. వాతావరణం ఇలా అనుకూలంగా కనిపిస్తున్నప్పటికీ మనదేశం ఎగుమతుల రంగంలో సంతృప్తికరమైన పురోగతి సాధించలేకపోతోంది. ఎగుమతులకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలిస్తే, పెట్రోలియం ఉత్పత్తులు, ఇనుము, స్టీల్ రంగాలు మాత్రమే దాదాపు ఎగుమతుల్లో సగం వాటాను సొంతం చేసుకున్నాయి. అన్నిటికన్నా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, కార్మిక భాగస్వామ్యం ఎక్కువగా ఉన్న రంగాలు ఆశించిన స్థాయిలో ఎగుమతుల్లో పాల్గొనలేకపోతున్నాయి. టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్



వస్తువులు, విలువైన రాళ్లు, ఆభరణాల తయారీ, తలు పరిశ్రమ, వ్యవసాయోత్పత్తుల కార్మిక రంగ భాగస్వామ్యం అధికంగా ఉంటుంది. వీటి ఎగుమతులు కూడా చాలా అధ్వానంగా ఉన్నాయి. ఇటీవలే ఈ రంగం నుంచి కూడా ఎగుమతులు మెల్లిగా పుంజుకుంటున్నాయి. ఈ వివరాలు మరో కోణాన్ని కూడా సూచిస్తున్నాయి. ఉపాధి కల్పన రంగంలో నెలకొన్న మాంద్యం లేదా వైఫల్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితికి జీఎస్టీ ...9లో



వృద్ధ దంపతుల హత్య

ఆస్తి వివాదాలే కారణం..?

నవతెలంగాణ కాజీపేట

వరంగల్ అర్బన్‌జిల్లా కాజీపేట సమీపంలోని సోమిడిలో వృద్ధ దంపతులను గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేశారు. హత్యకు ఆస్తి వివాదాలు కారణమా? ఇంకేమైనా? అనే కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు. కాజీపేట పోలీసుల వివరాల ప్రకారం చుంచు ఎల్లయ్య (70), చుంచు పూలమ్మ (55) దంపతులు. వారు సోమిడిలో ఉంటున్నారు. ఎల్లయ్య గతంలో రైల్వేలో పనిచేసేవాడు. పదేండ్ల కింద ఉద్యోగ విరమణ చేశారు. మొదటి భార్య చనిపోగా పదేండ్ల కింద పూలమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. భార్యాభర్తలిద్దరూ సోమవారం రాత్రి ...9లో

జైలుకు గజల్ శ్రీనివాస్

- లైంగిక వేధింపుల కేసులో 12 రోజుల రిమాండ్

వివరాలు 9లో

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యదర్శిగా బిఆర్ మీనా
- రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్‌గా రాజేశ్వర్ తివారీ
- పురపాలక శాఖ కార్యదర్శిగా అరవింద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులు భారీ సంఖ్యలో బదిలీ అయ్యారు. మొత్తం 29 మందికి స్థానచలనం కలిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సీనియర్ ఐఏఎస్‌లతోపాటు పలు జిల్లాల కలెక్టర్లను కూడా మార్చారు. మరికొంత మందికి అదనపు బాధ్యతలు అప్పజెబుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ జీవో జారీ చేశారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా సురేష్ చందా, ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యదర్శిగా బీఆర్ మీనా, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్ తివారి నియమితులయ్యారు. వైద్య, ...9లో

ఎట్టకేలకు ఎస్సీ,ఎస్టీ కమిషన్

- చైర్మెన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్‌తోపాటు ఐదుగురు సభ్యుల నియామకం
- ఫైలు పై సీఎం సంతకం

వివరాలు 9లో



కొక్కొరోకో..



వరించేదెవరిని..!

- వచ్చే ఎన్నికల్లో స్థానాలు మార్పు కోరుతున్న అభ్యర్థులు
- ఎమ్మెల్యేగా వచ్చేందుకు పలువురు ఎంపీల ఆసక్తి
- లోక్‌సభకు వెళ్లేందుకు ఎమ్మెల్యేల చూపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజకీయ చదరంగంలో తమ స్థానాలను సుస్థిరం చేసుకోవాలని కొందరు వ్యూహాలు పన్నుతుంటే..మరి కొందరు తమ స్థానాలను వదిలి మరో చోటికి మారాలనుకుంటున్నారు. కానీ అటు నుంచి ఇటు మారుదామని.. ఎన్ని అనుకున్నా గులాబీబాస్ కరుణిస్తేనే..అన్న భావన టీఆర్ఎస్‌వర్గాల్లో వినిపిస్తోంది. ఇలా వచ్చే ఎన్నికల్లో అధికారపార్టీతో సహా ప్రతిపక్షపార్టీలూ కొన్ని మార్పులు చేర్పులు చేయాలని భావిస్తున్నాయి. గులాబీ కండువా కప్పుకున్న చాలా మంది ఇప్పటి నుంచే క్యూకడుతుంటే.. పలువురు అభ్యర్థులు స్థానం మార్పుకోసం ప్రయత్నిస్తున్నారు. ఎంపీలుగా ఉన్న వారు ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్యేలుగా



ఉన్న వారు ఎంపీలుగా పోటీ చేసేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు. ఒకేచోట నుండి రెండు మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులు లోక్‌సభకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యేగా ఉంటే నిత్యం ప్రజల్లో ఉండొచ్చని ఎంపీలు కొందరు ఆశిస్తున్నారు. ఇది నిజం కావాలంటే ఆయా పార్టీల అధిష్టానం ఆమోదముద్ర ...9లో

నవ తెలంగాణపై స్పందన ఫోన్ : 9490099016

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటి కప్పుడు మా దృష్టికి తీసుకువచ్చి మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99016 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ **మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల** మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పదల్చుకున్నది సూటిగా పద్ధతిగా వుండాలి. **ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.** ఉత్తరాల ద్వారా మీ అభిప్రాయాలు పంపదలిస్తే చిరునామా: **స్పందన, నవ తెలంగాణ దినపత్రిక, ఎంహెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, 1-8-664, అజామాబాద్, హైదరాబాద్ - 500020.** లేదా s p n a k మెయిల్ చేయొచ్చు.

పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికలు

సీపీఐ(ఎం) అభ్యర్థి సబిరుద్దీన్ మొల్లా ప్రచారం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరగనున్న ఉలుబెరియా నియోజక వర్గ ఉప ఎన్నికలకు సీపీఐ(ఎం) ప్రచార కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నియోజకవర్గం నుంచి లెఫ్ట్‌ఫ్రంట్ నామినేట్ చేసిన సీపీఐ(ఎం) అభ్యర్థి కామ్రేడ్ సబిరుద్దీన్ మొల్లా పోటీ చేస్తున్నారు. ఆయన తరుపున క్షేత్ర స్థాయిలో ప్రచార కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ నియోజక వర్గానికి ఈ నెల 29న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న అవినీతి తృణమూల్ కాంగ్రెస్, కేంద్రంలో కొనసాగుతున్న మతతత్వ బీజేపీలను తిరస్కరించాలని, సీపీఐ(ఎం) అభ్యర్థి సబీరుద్దీన్ మొల్లాకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఆందోళనలతో వైద్య బిల్లు వెనక్కి..!

- విపక్షాల అభ్యంతరాలతో పార్లమెంటు స్టాండింగ్ కమిటీకి..
- కేంద్ర మంత్రి ప్రకటనతో నిరసనలు విరమించిన వైద్యులు

న్యూఢిల్లీ : వైద్యరంగాన్ని ప్రయివేటు పరం చేసే విధంగా కేంద్రం జాతీయ మెడికల్ కమిషన్ బిల్లును తెచ్చేందుకు మోడీ సర్కారు శత విధాలుగా ప్రయత్నించింది. మంగళవారం లోక్‌సభలో విపక్షాల అభ్యంతరాలతో ఆ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి నివేదిస్తామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ వెల్లడించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు కమిటీ నివేదిక ఇవ్వాలని కోరుతామని చెప్పారు. వైద్యవృత్తిని దెబ్బతీసేలా జాతీయ మెడికల్ కమిషన్ బిల్లు ఉందంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మంగళవారం ఉదయం నుంచి సమ్మెకు పిలుపు నిచ్చిన విషయం విదితమే. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి జేపీ నడ్డా రాజ్యసభలో మాట్లాడుతూ వైద్య వృత్తికి,దేశానికి ఈబిల్లుతో ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. వాస్తవానికి ఈ బిల్లుతో రోగులకు అందకుండా పోయే ప్రమాదం ఉన్నద ని వైద్యుల ఆందోళన. ఇక్కడి వైద్యవృత్తిని నాశనం చేసి విదేశీ వైద్యానికి పట్టం కట్టాలనే మోడీ సర్కారు ఈ బిల్లు తీసుకురావాలని ప్రయత్నిస్తున్న దని విపక్షాలు ఆగ్రహంవ్యక్తం చేశాయి. ఎట్టకేలకు ఈబిల్లు స్టాండింగ్ కమిటీకి సిఫారసు చేయటంతో.. వైద్యులు తమ ఆందోళనను విరమించారు.

భర్త వైద్య ఖర్చుల కోసం పసికందును విక్రయించిన తల్లి

- ఉత్తరప్రదేశ్‌లో విషాద ఘటన

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. తన భర్త వైద్య ఖర్చుల నిమిత్తం 15రోజుల కన్న బిడ్డను రూ.42 వేలకు విక్రయించింది. బరేలీ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. మౌర్యా రోజు కూలీ పనిచేసుకొని కుటుంబాన్ని పోషించేవాడు. అక్టోబర్ 9వరకూ వారి కుటుంబం కాస్తసాఫీగానే సాగిపోయింది. తనపని ప్రదేశంలో గోడ కూలడంతో మౌర్యా అనారోగ్యం పాలయ్యాడు. అక్కడి నుంచి ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. 'వెన్నెముక గాయమైన నన్ను నాభార్య ఆస్పత్రిలో చేర్చింది. కొద్దో గొప్పో దాచుకున్న మొత్తం చికిత్సకు ఖర్చయిపోయింది. కొద్ది రోజులకు కాళ్లు చచ్చుబడిపోయాయి. మరింత మెరుగైన చికిత్స కోసం వైద్యులు ఢిల్లీ తీసుకెళ్ళమన్నారు' అనిమౌర్య వాపోయాడు. అప్పటికే గర్భవతి అయిన మౌర్య భార్య సంజు డిసెంబరు 14నమగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు. భర్త వైద్య ఖర్చుల కోసం బిడ్డను అమ్మేందుకు ఆకుటుంబం సిద్ధమైంది. దాంతో డిసెంబరు 29న పిల్లలులేని ఓ జంటకు 15రోజుల కన్నబిడ్డను రూ.42వేలకు అమ్మింది. 'నేను మంచానపడ్డాను. కదలలేని స్థితిలో ఉన్నాను. ఎలాంటి సహాయం ముట్టలేదు. చేసేదిలేక తన మూడో బిడ్డను అమ్మేందుకు ఒప్పుకున్నాను' అని మౌర్య చెప్పారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కలవారు వారి దీన గాథను జిల్లా మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన వారికి సహాయం చేసేందుకు అంగీకరించారు.

కార్గిల్ అమరవీరుడి భార్య మృతి కేసు

- మాజీ సైనికుల సంక్షేమ శాఖకు కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ: హర్యానాలోని సోనిపట్‌లో కార్గిల్ అమరవీరుడి భార్య శకుంతలా దేవి ఇటీవల చనిపోయిన ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మాజీ సైనికుల సంక్షేమ శాఖను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశించింది. కార్గిల్ యుద్ధంలో మరణించిన అమర జవాను భార్య శకుంతలా దేవి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను గత గురువారం ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. కానీ, ఆధార్ కార్డు ఆస్పత్రికి తీసుకెళ్లకపోవడంతో చికిత్స అందించేందుకు వైద్యులు నిరాకరించారు. దీంతో కొద్దిసేపటి తర్వాత పరిస్థితి విషమించి ఆమె చనిపోయారు. కాగా ఈ విషయమై నేవి మాజీ దళాధిపతి లోకేశ్ బత్రా.. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద లేఖ రాశారు. అన్ని సేవలకు ఆధార్ గడువు ఈ యేడాది మార్చి వరకు పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసినప్పటికీ దాన్ని అమలు ఎందుకు చేయడం లేదని ఆయన తన లేఖలో ప్రశ్నించారు. అంతేకాక ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్(ఈసీహెచ్ఎస్) స్టేటస్‌ను కూడా కోరారు. దీంతో ఈ వ్యవహారంపై కేంద్రం చర్యలు ప్రారంభించింది.

ఎన్ఆర్ఐ పెండ్లిండ్లకు వెబ్‌సైట్

- రికార్డులు ఉంచేలా కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ : ఎన్ఆర్ఐ పెండ్లిండ్ల రికార్డులు నిర్వహించేలా వెబ్‌సైట్ తీసుకొచ్చేందుకు కేంద్రం కసరత్తు చేస్తున్నది. భారతీయ మహిళలు ప్రవాస వరుడితో జరుగుతున్న అక్రమాలను కట్టడిచేసే విధంగా వెబ్‌సైట్‌ను అందుబాటులో తీసుకురానున్నది. దేశవ్యాప్తంగా ఎన్ఆర్ఐ పెండ్లికొడుకుల వరకట్న వేధింపులు ఎక్కువవుతున్నాయి. వధువును ఇక్కడే వదలి వెళ్లటమో.. లేక అక్కడ ఆమెకు పాస్‌పోర్టు ఇవ్వకుండా సతాయిస్తున్న కేసులు బోలేడు. వీటన్నింటికి కట్టడి చేసేలా మహిళాశిశు సంక్షేమశాఖ కొత్తగా ఓ వెబ్‌సైట్‌ను రూపకల్పన చేస్తున్నది. ఇందులో ఎన్ఆర్ఐ పురుషుల జాబితాను సమకూరుస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎన్ఆర్ఐలు చేసుకునే వివాహాలు రిజిస్ట్రేషన్స్ అప్‌లోడ్ చేయాల్సిఉంటుంది. కాగా ఇప్పటికే ఇంటి గ్రేటెడ్ నోడల్ ఏజెన్సీని కూడా ఏర్పాటు చేసింది. 2015 నుంచి 3,328 వరకట్న వేధింపులకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. ఈ విషయాన్ని కేంద్రమంత్రి వీకేసింగ్ పార్లమెంటులో వెల్లడించారు.

పోర్టుఫోలియోపై పొగలు

- శాఖను మార్చాలంటూ రూపానీకి అల్టిమేటం
- గుజరాత్‌లో మరో మంత్రి అసమ్మతి గళం


అహ్మదాబాద్ : విజయ్ రూపానీకి మరో అసమ్మతి సెగ తాకింది. తనకు గతంలో కేటాయించిన శాఖలు మార్చాలనీ, లేదంటూ పార్టీ నుంచి వైదొలుగుతానంటూ ఇటీవల గుజరాత్ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ అల్టిమేటం జారీ చేయగా.. ఆయన కోరిన శాఖలను కేటాయించారు. ఈ నేపథ్యంలో మరో మంత్రి పురుషోత్తం సోలంకీ తనకు కేటాయించిన మత్స్యశాఖను మార్చాలంటూ అసమ్మతి రాగం ఎత్తుకున్నారు. 'ఎమ్మెల్యేగా నేను గెలుపొందటం ఇది ఐదోసారి. మత్స్య శాఖ కేటాయించడం ఇది మూడోసారి. సముద్రతీరంలో కూర్చొని చేపలు పట్టుకోవాలా? 'నితిన్ పటేల్‌కు ఆ ప్రత్యేకత ఎందుకు? నన్ను ఎందుకు విస్మరిస్తున్నారు?' అని పురుషోత్తం ప్రశ్నించారు. కాగా సమస్య పరిష్కారానికి అధిష్టానం కృషిచేస్తోందని భూపేంద్ర సింగ్ చెప్పారు.

దేశాన్ని ఆక్రమించుకునేందుకు ముస్లింల భారీ కుట్ర

- బీజేపీ ఎమ్మెల్యే విద్వేషపూరిత వ్యాఖ్యలు



జైపూర్: బీజేపీ ఎమ్మెల్యే విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. 2030 నాటికి దేశాన్ని ఆక్రమించు కునేందుకు ముస్లింలు కుట్రపన్నారని ఆరోపించారు. అందుకే ఒక్కొక్కరు 10 నుంచి 14 మంది పిల్లలను కంటున్నారని రాజస్థాన్ అల్వార్ అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే బన్వరీ లాల్ సింఘాల్ అన్నారు. హిందూ జంట ఒకరు లేదా ఇద్దరు పిల్లలను మాత్రమే కంటుంటే.. వారి జనాభాను పెంచు కొని 2030 కల్లా దేశాన్ని ఆక్రమించుకుంటారని అన్నారు. అందుకే ముస్లింల జనాభా విపరీతంగా పెరుగుతోందని, తద్వారా హిందువుల ఉనికి ప్రమాదంలో పడబోతు న్నదని ఆరోపించారు. రాజస్థాన్‌లోని అల్వార్ లోక్ సభ స్థానానికి జనవరి 29న ఉపఎన్నిక జరగనుంది. స్థానిక ఎమ్మెల్యే అయిన బన్వరీలాల్ పార్టీ తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం తన ఫేస్‌బుక్ లో ముస్లింలపై విద్వేషాన్ని రెచ్చగొడుతూ పోస్టులు చేశారు. 'ముస్లిం జనాభా మరింత పెరగడంవల్ల వారే ముఖ్యమంత్రు లవుతారు, ప్రధానమంత్రి, రాష్ట్ర పతి కూడా ముస్లింలే అవుతారు. ఆ తర్వాత వారిక 'సుగుణం' చట్టాలు చేస్తారు. హిందువుల ఉనికే ప్రమాదంలో పడుతుంది. హిందువులను జైళ్లలో పెడతారు. హిందువుల వనరులన్నింటినీ వారు వాడుకుంటారు' అన్నారు. 'ముస్లిం జనాభా 30శాతం కంటే ఎక్కువగా ఉన్న ఏదేశంలోనైనా ముస్లిం పాలనే సాగుతోంది, ఆ దేశం వారి ఆధీనంలోనే ఉంటున్నది. ఇందుకు మన దేశంలోని గతమే ఉదాహరణ. ప్రస్తుత పరిస్థితులు కూడా వారికి అనుకూలంగా ఉన్నాయి. ఎందుకంటే హిందువులు ఒకరు లేదా ఇద్దరినే కంటున్నారు. అంతేకాదు, బీహార్, బెంగాల్ నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి రెండో పెండ్లిండ్లు చేసుకుంటున్నారు. వారితో పిల్లలను కని ముస్లిం జనాభాను విపరీతంగా పెంచుతున్నారు' అన్నారు. 'ముస్లిం కమ్యూనిటీకి విద్య, అభివృద్ధి పట్టదు. వారి ప్రధాన ఉద్దేశం జనాభాను పెంచడమే' అని బీజేపీ ఎమ్మెల్యే బన్వరీలాల్ తెలిపారు. కాగా బన్వరీ లాల్ వ్యాఖ్యలపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీ అధిష్టానం మాత్రం మౌనం వీడటంలేదు.



ట్రిపుల్ తలాక్‌కు తిప్పలు

అధికార, విపక్షాల మధ్య కుదరని ఏకాభిప్రాయం

- బిల్లు ఆమోదానికి సహకరించండి : కేంద్రం
- సెలక్ట్ కమిటీకి ప్రతిపాదించాలి : విపక్షాలు
- 'క్రిమినల్' నిబంధన తొలగింపునకు డిమాండ్
- నేడు రాజ్యసభ ముందుకు బిల్లు
- కాంగ్రెస్ వైఖరిపై బిల్లు భవిష్యత్తు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ట్రిపుల్ తలాక్ బిల్లుకు తిప్పలు తప్పేటట్టు లేదు. లోక్‌సభలో సంఖ్యా బలంతో సునాయాసంగా బిల్లును ఆమోదించుకున్న ఎన్డీయే ప్రభుత్వం... పెద్దలసభలో మాత్రం సందిగ్ధంలో పడింది. కీలక బిల్లుల ఆమోదానికి సహకరించిన బీజేడీ, అన్నాడీఎంకే సైతం ట్రిపుల్ తలాక్ బిల్లులోని నిబంధనలు వ్యతిరేకిస్తుండటంతో కేంద్రం పాలుపోని పరిస్థితిలో ఉంది. బిల్లుపై ఏకాభిప్రాయం సాధించేందుకు రాజ్యసభ చైర్మెన్ సమక్షంలో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఫలితంగా మంగళవారమే సభ ముందుకు రావాల్సిన బిల్లు వాయిదా పడింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల గడువు మరో రెండు రోజుల మాత్రమే ఉండటంతో ఎట్టిపరిస్థితుల్లో ఈ బిల్లుకు చట్టరూపం తేవాలని కేంద్రం పట్టుదలగా ఉంది. కాగా ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి ప్రతిపాదించాలని కాంగ్రెస్, సీపీఐ(ఎం)తో సహా విపక్షాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. అయితే బిల్లును సెలక్ట్ కమిటీకి ప్రతిపాదించకుండానే గట్టెక్కించాలని బీజేపీ యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రిపుల్ తలాక్ బిల్లు భవితవ్యం నేడు రాజ్యసభలో తేలనుంది. అయితే ఈ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ అవలంబించే వైఖరి కీలకంగా మారనుంది. గతంలోనూ కీలక బిల్లుల సమయంలో యూటర్న్ తీసుకుని బీజేపీకి జై కొట్టిన కాంగ్రెస్ పార్టీ... ట్రిపుల్ తలాక్‌పై ఏం చేస్తోందో చూడాలి.

ట్రిపుల్ తలాక్ పాటించే వారికి మూడేండ్ల శిక్ష, జరిమానా విధిస్తూ ముస్లిం మహిళ(వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది.



లోక్‌సభలో మెజార్టీలో ఉన్న ఎన్డీయే సర్కారు.. విపక్షాల సవరణలను తోసిరాజనని గత గురువారం సునాయాసంగా బిల్లును ఆమోదించుకుంది. ఈ బిల్లు చట్టరూపం దాల్చాలంటే రాజ్యసభ కూడా ఆమోదించాల్సి ఉంది. ప్రస్తుతం రాజ్యసభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారుకు తగినంత సంఖ్యాబలం లేదు. ఒకవేళ కాంగ్రెస్ మద్దతు ఇవ్వకున్నా ఎఐడీఎంకే, బీజేడీ తదితర పార్టీలతో గట్టెక్కించాలని భావించినప్పటికీ.. సివిల్ అంశాల్లో పరిగణించే విడాకుల్లో 'క్రిమినల్' నిబంధనను పొందుపరచడాన్ని అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తున్నాయి. లోక్‌సభలో జరిగిన చర్చ సమయంలోనూ సీపీఐ(ఎం), బీజేడీ, శివసేన, టీడీపీ తదితర పార్టీలు ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి ప్రతిపాదించాలని సూచించాయి. అయినప్పటికీ లోక్‌సభలో ఉన్న సంఖ్యాబలంతో కేంద్రం బిల్లును ఆమోదించుకుంది. అయితే ప్రస్తుత రూపంలో బిల్లు ఆమోదానికి సహకరించేది లేదని ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు మిగితా విపక్షాలు స్పష్టం చేశాయి. ఈ బిల్లు ఆమోదంపై రాజ్యసభ చైర్మెన్ ఛాంబర్‌లో మంగళవారం ఉదయం అన్ని పార్టీల ప్రతినిధులతో వెంకయ్య నాయుడు సమావేశమయ్యారు. కేంద్రం నుంచి పార్లమెంట్ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్‌గోయల్ హాజరయ్యారు. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలక్ట్ కమిటీకి ప్రతిపాదించాలని విపక్ష పార్టీలన్నీ స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ సమావేశంలో అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అయితే ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి ప్రతిపాదించే విషయంలో బీజేపీ అయిష్టంగా ఉంది. దీంతో బుధవారం సభలో ప్రవేశపెట్టి ఎలాగైనా ఆమోదించుకోవాలన్న పట్టుదలతో ఉంది. లోక్‌సభలో సహకరించినట్టుగా రాజ్యసభలోనూ కాంగ్రెస్ సహకరిస్తుందనే ఆశాభావంతో బీజేపీ నేతలున్నారు. గతంలోనూ కీలక బిల్లుల సమయంలో విపక్షాల తోడు వదిలి బీజేపీకి కాంగ్రెస్ పార్టీ వంతపాడింది. ఈ నేపథ్యంలో ఈ బిల్లు విషయంలోనూ అదే జరుగుతుందన్న ఆశతో బీజేపీ నేతలున్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉన్నప్పటికీ మూడేండ్ల శిక్ష విధించాలన్న క్రిమినల్ నిబంధనను ఆ పార్టీ వ్యతిరేకిస్తోంది.

కొన్ని నెలలుగా వేతనాలు అందక దీనస్థితిలో..

ఢిల్లీ కళాశాలల అధ్యాపకులు..!

- ఖాళీ జేబులతో నూతన సంవత్సరంలోకి..
- పాలక మండళ్ల ఏర్పాటుపై వివాదం వల్లే...

న్యూఢిల్లీ: ఢిల్లీ యూనివర్సిటీ(డీయూ) పరిధిలోని కళాశాలల అధ్యాపకులు నెలసరి వేతనాలు లేకుండానే నూతన సంవత్సరాన్ని జరుపుకోవాల్సి వచ్చింది. గతేడాది జులైలో కళాశాలలకు నిధులు నిలిపివేస్తూ ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో అధ్యాపకుల జేబుల ఖాళీ అయ్యాయి. డీయూ పరిధిలో మొత్తం 28కళాశాలలున్నాయి. నిధుల విషయంలో 12కళాశాలలు పూర్తిగానూ, 16కళాశాలలు పాక్షికంగానూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడుతున్నాయి. 16 కళాశాలలకు యూజీసీ నిధులు అందిస్తోంది. డీయూ అధ్యాపకుల సంఘం ఆందోళనతో మధ్యలో ఓనెల వేతనాలను ఢిల్లీ ప్రభుత్వం అందించింది. అది కూడా పూర్తిగా తమపై ఆధారపడిన 12 కళాశాలలకు మాత్రమే.

పాలక మండళ్ల ఏర్పాటుపై ఢిల్లీ యూనివర్సిటీకీ, ఆ రాష్ట్రంలోని ఆమ్‌ఆద్మీ ప్రభుత్వానికి మధ్య వివాదమే అధ్యాపకుల ఆవేదనకు కారణమైంది. కళాశాలల్లో పాలకమండళ్లు ఏర్పాటు చేసే వరకూ నిధులు అందించేదిలేదని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి (విద్యామంత్రి కూడా ఆయనే) గతేడాది జులైలో ప్రకటించారు. 'సొంతంగా తాము అధ్యాపకులకు వేతనాలు అందించలేకపోతున్నాం, కనీసం కరెంట్, టెలిఫోన్ బిల్లులు కూడా చెల్లించలేకపోతున్నాం, సెక్యూరిటీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బందికి కూడా వేతనాలు అందించలేని స్థితికి తమ ఆర్థిక పరిస్థితి దిగజారిందని' దీన్‌దయాల్ ఉపాధ్యాయ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ఆర్ గార్గ్ ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అందకపోవడంతో ఇంటి అద్దెలు, తమ పిల్లల చదువు కోసం ఫీజులు కూడా చెల్లించలేకపోతున్నామని అధ్యాపకులు తెలిపారు. అయితే, పాలక మండళ్ల జాబితా తమకు అందిన వెంటనే నిధులు విడుదల చేస్తామని ఢిల్లీ విద్యాశాఖలోని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కొన్ని కళాశాలలు మాత్రం ఇతర కార్యక్రమాలకు వినియోగించాల్సిన నిధుల్ని అధ్యాపకుల వేతనాల కోసం కొంతమేర ఉపయోగించాయి.

రాజ్యసభ నూతన రికార్డు

- మొదటిసారి జీరోఅవర్ ఎజెండా పూర్తి : చైర్మెన్ వెంకయ్య నాయుడు

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో




రాజ్యసభ జీరో అవర్ ఎజెండాను మొట్టమొదటిసారి పూర్తి చేసి రాజ్యసభ నూతన రికార్డు సృష్టించింది. ఈ మేరకు చైర్మెన్ వెంకయ్యనాయుడు మంగళవారం సభలో ప్రకటించారు. సభ్యులందరూ సహకరించడంతో ఇది సాధ్యమైందని, భవిష్యత్తులోనూ ఇలాంటి సహకారమే అందిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. సాధారణంగా రాజ్యసభలో జీరో అవర్, ప్రశ్నోత్తరాల అజెండాను ముందుస్తుగా ఖరారు చేసినప్పటికీ సమయాభావం వల్ల అన్ని అంశాలు లేవనెత్తే అవకాశం దక్కదు. అయితే మంగళవారం జీరో అవర్ అజెండాలో పొందుపరిచిన పది అంశాలతో పాటు మరో అదనపు అంశాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. 'రాజ్యసభ ఈ రోజు చరిత్ర సృష్టించింది. మొట్టమొదటిసారి జీరో అవర్‌తో పాటు ప్రత్యేక ప్రస్తావనలన్నీ పూర్తయ్యాయి' అని సభలో ప్రకటించారు. సభ్యుల 'కోపరేషన్' మంచిగా ఉండటంతో తన 'ఆపరేషన్' సాఫీగా సాగిందని, అందువల్లే సభ ఈ రికార్డు సృష్టించగలిగిందని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులోనూ సభ్యులు సమయం వృథా చేయకుండా తమ షెడ్యూల్ ప్రకారం నడుచుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ప్రశ్నోత్తరాల్లోనూ సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సంక్షిప్తంగా సమాధానం ఇవ్వాలని, ఫలితంగా సభ ఉత్పాదకత పెరుగుతుందని అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచీ వివిధ అంశాలపై సభలో ఆందోళనలు, నిరసనలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఇక మంగళవారం నాటి జీరో అవర్‌లో ఎస్పీ ఎంపీ నరేష్ అగర్వాల్ జర్నలిస్టుల స్థితిగతుల అంశాన్ని లేవనెత్తారు. ముఖ్యంగా జిల్లాస్థాయిల్లో రిపోర్టర్ల పరిస్థితి అధ్వాన్నంగా మారిందని చెప్పారు. పీఎఫ్‌తో సహా వివిధ సౌకర్యాలు లభించడం లేదని వాపోయారు. పైగా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జర్నలిస్టులు వార్తలు రాస్తే బలవంతగా ఉద్యోగంలో నుంచి తొలగించే విధంగా యాజమాన్యాలపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. అలాగే గౌరీలంకేశ్, నవీన్ గుప్తాతో సహా తొమ్మిది మంది ప్రముఖ జర్నలిస్టులు హత్యకు గురయ్యారని చెప్పారు.

ప్రభుత్వ ముద్రణా సంస్థలు మూసేయొద్దు

రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ తపన్‌సేన్ డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ, రైల్వే ముద్రణా సంస్థలను మూసివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ(ఎం) ఎంపీ, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఊదరగొడుతున్న 'మేకిన్ ఇండియా' నినాదానికి ఇది విరుద్ధమైన నిర్ణయమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ముద్రణ సంస్థలను మూసివేస్తే భారత తయారీరంగ సామర్థ్యాన్ని ధ్వంసం చేయడమేనని పేర్కొన్నారు. మంగళవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఎంపీ తపన్‌సేన్ ఈ అంశాన్ని లేవనెత్తారు. కేంద్ర ప్రభుత్వ 17 ముద్రణ సంస్థల్లో 12 సంస్థలను, అలాగే దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న రైల్వే ముద్రణసంస్థలను మూసివేయాలిన కేంద్రప్రభుత్వం విపత్కర నిర్ణయం తీసుకుందని విమర్శించారు. భారత రైల్వేతో పాటు వివిధ మంత్రిత్వశాఖల ప్రింటింగ్ అవసరాలను తీర్చుకునేందుకు ఈ రెండు విభాగాల్లో ముద్రణ సంస్థలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తప్పు పట్టిందని వివరించారు. పైగా ఈ సంస్థల్లో తగినంత సిబ్బంది లేనప్పటికీ కేంద్ర ప్రభుత్వ అవసరాలను తీర్చేందుకు కష్టపడి పని చేస్తున్నాయని, తమ ఆర్థిక అవసరాలను తీర్చుకుంటున్నాయని స్టాండింగ్ కమిటీ నివేదికలో పొందుపరిచిందని తెలిపారు. వివిధ మంత్రిత్వశాఖలు ఈముద్రణ సంస్థలకు ఇప్పటి వరకు రూ.390 కోట్లు బాకీ పడ్డాయని... అయినప్పటికీ ఈ సంస్థలు ఉత్తమ పనితీరును కనబరుస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ముద్రణా సంస్థలన్నింటినీ ఆధునీకరించాలని, అభివృద్ధి చేయాలని స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవంగా ప్రతిపాదించిందని సభకు తెలియజేశారు. రైల్వే శాఖకు చెందిన ముద్రణ సంస్థలపై గురించి కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేపడుతున్నారని తెలిపారు. కాబట్టి ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.



జమ్మూకాశ్మీర్‌లో పరిస్థితులు చక్కదిద్దాలి

- గవర్నర్‌కు నేషనల్ కాన్ఫరెన్స్ వినతి

జమ్మూ: జమ్మూకాశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దాలని గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రాకు నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించింది. రాష్ట్రానికున్న రాజ్యాంగ ప్రత్యేక ప్రతిపత్తికి ఆటంకం కలిగించేలా పీడీపీ-బీజేపీ ప్రభుత్వ పనితీరు ఉందని ఆరోపించారు. రాజకీయ శూన్యత కొనసాగుతుండటం, అధ్వాన్నమైన పరిస్థితులుండటంతో మానవహక్కులపై, ఆర్థికరంగం అభివృద్ధిపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. పౌరులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ మధ్య కాలంలో జరిగిన ఓ కౌంటర్ తిరుగుబాటు ఆపరేషన్‌లో ఇద్దరు మహిళలు మరణించారని, ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయని వీటిని నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. తనిఖీల కోసం పోలీసులు గ్రామాల్లోకి వచ్చి ప్రజలను వేధింపులకు, అవమానాలకు గురి చేస్తున్నారని వీటిని వెంటనే ఆపాలని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని, స్థిరత్వాన్ని కొనసాగించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

ఈ పరిస్థితులతో పర్యాటక, విద్యుత్ రంగాలు సంక్షోభంలోకి వెళ్లాయని అన్నారు. నిరుద్యోగం, నిరుద్యోగితల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమవడంతో యువత ప్రమాదకరమైన పరిణామాలను ఎదుర్కొంటున్నదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అన్ని విభాగాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

'సైనికులు చావాల్సిందే'

- నోరు పారేసుకున్న బీజేపీ ఎంపీ, క్షమాపణ



న్యూఢిల్లీ: దేశ సరిహద్దుల రక్షణ కోసం ప్రాణాలొడ్డుతూ అనుక్షణం అప్రమత్తంగా వుండే సైనికులపై నోరుపారేసుకున్న బీజేపీ ఎంపీ నేపాల్ సింగ్ తరువాత తీరిగ్గా క్షమాపణ చెప్పారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని తప్పును మీడియాపైకి నెట్టే ప్రయత్నం చేశారు. రాంపూర్ నుండి లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఘనత వహించిన ఈ ఎంపీ మాట్లాడుతూ 'సైనికులు చావాల్సిందే' నంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే తరువాత నాలుక్కరుచుకుంటూ తనకు సైనికులంటే అమిత గౌరవం వుందని, వారిని కించపర్చే వ్యాఖ్యలు తాను చేయబోనని అన్నారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెబుతున్నానని, శత్రు సైన్యాల బుల్లెట్ల బారి నుండి సైనికులను కాపాడే కవచాలను శాస్త్ర వేత్తలు రూపొందించే వరకూ సైనికులు యుద్ధరంగంలో వీరమరణం చెందాల్సి వుంటుందన్నదని తన ఉద్దేశమని ఆయన వివరణ ఇచ్చారు. అంతకు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఆర్‌పి శిబిరంపై పాక్ సైనికుల కాల్పుల ఘటనను ప్రస్తావిస్తూ సైన్యంలో వున్న వారూ రోజూ మరణిస్తూనే వుంటారని, పోరాటంలో సైనికులు మరణించని దేశం ఏదీ లేదని అన్నారు. అందులో కొత్తేముందీ.. ఈ పోరులో మధ్యలో వున్న గ్రామస్తుల్లో కనీసం ఒక్కరైనా గాయపడుతుంటారన్నారు.

ఒకేసారి రూ.15 లక్షల నష్ట పరిహారం

- లైంగికదాడి బాధితురాలికి సుప్రీం కోర్టు అండ

న్యూఢిల్లీ: హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒక వికలాంగురాలైన లైంగికదాడి బాధితురాలికి రూ. 15లక్షల నష్టపరిహారం ఒకేసారి చెల్లించాలని సుప్రీం కోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ సంజయ్ కృష్ణ కౌల్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ తీర్పునిచ్చింది. ఇదే కేసులో ఆ రాష్ట్ర హైకోర్టు బాధితురాలికి ప్రతినెలా రూ. 30 వేలను జీవితాంతం చెల్లించాలని గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తీర్పునిస్తూ.. బాధితురాలి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఒకేసారి రూ.15 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. బాధితురాలు ఇప్పటికే ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో ఇబ్బందిపడుతోందనీ, పరిహారం మొత్తం ఒకేసారి ఇవ్వడం ప్రయోజనకరమని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ మొత్తాన్ని ఏదైనా జాతీయ బ్యాంకులో జమచేసి దానిపై వచ్చే వడ్డీని ఆమెకు అందజేయాలని ఆదేశించింది. 2013 డిసెంబర్ 23న రజినీశ్ అనే వ్యక్తి ఆ మహిళపై లైంగికదాడికి పాల్పడ్డాడు. 2015లో హర్మీపూర్ సెషన్స్ కోర్టు నిందితునికి పదేండ్ల కఠిన కారాగార శిక్ష రూ. 20,000 జరిమానా విధించింది. దీనిపై రజినీశ్ హైకోర్టును ఆశ్రయించారు. 2016 జూన్ 29న అతన్ని దోషిగా తేల్చిన హైకోర్టు, ప్రతినెలా బాధితురాలికి రూ. 30 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం

- దర్యాప్తులో ఆలస్యంతో విసిగిన లైంగికదాడి బాధితురాలు

లక్నో: దర్యాప్తులో పోలీసుల అలసత్వం.. నిందితుల అరెస్టులో జాప్యం తనకు న్యాయం చేయాలని పోలీసుల చుట్టూ తిరిగి.. విసిగిపోయిన ఓ లైంగికదాడి బాధితురాలు చివరకు పోలీస్ స్టేషన్‌లోనే కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో వెలుగులోకి వచ్చింది. గత నెలలో ఇచ్చిన లైంగికదాడి ఫిర్యాదు తర్వాత కేసు వెనక్కి తీసుకోవాల్సిందిగా నిందితులు తనను బెదిరిస్తున్నారంటూ ఆమె పోలీసులకు మరో ఫిర్యాదుకూడా ఇచ్చింది. అయినా పోలీసుల నిర్లక్ష్యం వహించారు. నిందితులు పరారీలో ఉన్నారనీ, ఫిర్యాదు అందిన నాటి నుంచి వారి కోసం గాలిస్తున్నామని కోసి కలన్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఉదయ్‌వీర సింగ్ మాలిక్ చెబుతున్నారు. మంగళవారం ఉదయం కోసి కలన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆమె తనతో తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుంది. నిప్పంచుకునేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకుని, ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు.



అంటార్కిటికాలో అద్భుత యాత్ర

అంటార్కిటికా భూమికి దక్షిణాన ఉన్న ధ్రువ ఖండం. దీని విస్తీర్ణం కోటి నలభై నాలుగు లక్షల చ.కి.మీ. ఆసియా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా ల తర్వాత ఐదవ అది పెద్ద ఖండం. యూరప్, ఆస్ట్రేలియా దీని కంటే చిన్నవి. ఈ ఖండం 98 శాతం మంచుతో కప్పబడి ఉంది. ప్రపంచంలో కల్లా అతి చల్లని ప్రాంతం కావడం వల్ల ఇక్కడ ప్రజలు శాశ్వత నివాసాలను ఏర్పాటు చేసుకోలేరు. కేవలం చలికి తట్టుకొనే జంతువులు, మొక్కలు మాత్రమే ఉంటాయి. ఉదాహరణకు సీల్ చేపలు, పెంగ్విన్ పక్షులు, ఆల్గే జాతికి చెందిన మొక్కలు మాత్రమే. అలాంటి మంచు ప్రపంచంలోకి అడుగు పెట్టడం ఒక సాహస యాత్ర. అయితే పర్యటనను ఇష్టపడే వారు మాత్రమే ఇలాంటి అరుదైన ప్రదేశాలను ఎంచుకుంటారు. ఆ మంచు ప్రపంచంలోకి నేను, మావారు అడుగు పెట్టడం ఇదే తొలిసారి. మా ప్రయాణంలో ఎదురైనా కొన్ని అనుభవాలు మీ కోసం...











అంటార్కిటికా వెళ్లడం ఇదే మొదటిసారి కావడం వల్ల మేం తిరిగి వస్తామో.. రామో... అని, అన్ని అప్పగింతలు చేసి మా ప్రయాణానికి శ్రీకారం చుట్టాం. ఈ ప్రయాణం చేసే ముందు మాకు టైటానిక్ సినిమా గుర్తుకు వచ్చింది. ఇది ప్రపంచంలో కెల్లా అతి చల్లనైనా, గాలిలో తేమ లేని ప్రదేశం. శీతోష్ణస్థితి (–89.2 సి నుండి – 128.6). ఇక్కడి శీతోష్ణస్థితి ఎప్పుడు ఎలా మారుతుందో ఎవ్వరికీ తెలియదు. ఇక మేం హైదరాబాద్ నుంచి ఫ్రాన్స్ కు, ఫ్రాన్స్ నుంచి అర్జెంటీనాకు వెళ్ళాం. అర్జెంటీనాలో మూడు రోజులు గడిపి అక్కడి నుండి ఈ ఎక్స్‌పెడిషన్‌కు వెళ్ళేవాళ్ళందరినీ ఒక హోటల్‌లోనే వుండమని చెప్పారు. మేం సాయంత్రం ఐదు గంటలకు ఆ హోటల్‌కు చేరుకున్నాం. మర్నాడు ఉదయం నాలుగు గంటలకు చార్టర్ విమానంలో తీసుకొని వెళ్లారు. అక్కడి నుంచి సుమారుగా 80 మంది వరకు ఒక షటిల్ బస్సులో ఎయిర్‌పోర్ట్ కు తీసుకొనివెళ్ళారు. ఆ విమానం మీద లాన్ అని రాసి వుంది. అక్కడే మాకు ఏమేమి తీసుకెళ్లాలో అన్నీ ముందుగానే వివరించారు. గ్లౌసెస్, థర్మల్స్, ఉలెన్ కోటు, కాళ్లకి ఉలెన్ సాక్స్, టార్చిలైటు, తలకు స్కార్ఫ్, టోపీలు తీసుకొని ఉషయ అనే స్థలానికి వెళ్లాం. ఇది భూమండల చివరి భాగం. అక్కడికి వెళ్లిన వెంటనే తలా ఒక పాకెట్ ఇచ్చారు. దాంట్లో బ్రెడ్, సాండ్‌విచ్, కూల్ డ్రింక్ ఉన్నాయి. ఈ ప్రదేశంలో సరస్సులు, మంచుకొండలు ఉన్నాయి. అక్కడి ప్రకృతి అందాలను చూడడానికి ఒక గంట సమయం పట్టింది.

సరస్సులో కనిపించే మంచుకొండల ప్రతిబింబాలు స్వచ్ఛమైన నీటితో మిల మిల మెరుస్తూ ఉన్నాయి. ఈ అందమైన దృశ్యం వర్ణనాతీతం. మంచు కరిగిన నీలిరంగు చుట్టూ తెల్లటి మంచుతో కప్పబడిన మంచు అందాలు ఊహకు అందని అద్భుత దృశ్యకావ్యాలు. ఇవన్నీ చూస్తూ రెండు కిలో మీటర్లు నడిచి ఫొటోస్ తీసుకున్నాం. ఇక అక్కడి నుంచి వణుకుతూ త్వరత్వరగా బస్సులో కూర్చున్నాం. అక్కడి నుండి సాయంత్రం ఐదు గంటలకు ఉషయ సముద్ర తీరానికి హర్టిగ్రూటన్ అనే క్రూజ్ లో వెళ్ళాం. ఉషయ నుండి డ్రేక్ పాసేజ్ కు బయలు దేరాం. ఇది రెండు రోజుల ప్రయాణం. ఈ డ్రేక్ ప్యాసేజ్‌లో అలలు 12 అంతస్థుల ఎత్తు వరకు ఎగిసెగిసి పడుతుంటాయి. ప్రయాణంలో తీసు కోవాల్సిన జాగ్రత్తల గురించి మాకు చెప్పారు. ఇక్కడ బాక్టీరియా ఎక్కువ కాబట్టి ప్రతి గంటకు చేతులకు సానిటైజర్ రాసు కోవాలి. ఈ పడవలో అలలతా కిడికి చాల మంది అనారోగ్యం పాలవు తుంటారు. మర్నాడు ఉదయం ఏడు గంటలకు లేచి జిమ్ కు వెళ్ళి అరగంట పాటు వ్యాయామం చేశాం. అక్కడ టేబుల్ టెన్నిస్ కొంచెం సేపు ఆడి బ్రేక్‌ఫాస్ట్ చేశాం. 10 గంటల నుండి 12.30 వరకు క్లాస్ వుంది. ఈ క్లాసులో అక్కడి జంతు వులు పక్షుల గురించి సీల్స్, పెంగ్వీన్స్ గురించి చెప్పారు. ఆ రోజు మద్యాహ్నం ఒక గంట సేపు మళ్ళీ క్లాస్ అది గ్లోబల్ వార్మ్ గురించి. ఈ ప్రయాణంలో 95 శాతం అందరూ శాస్త్రజ్ఞులు. 5 శాతం మాత్రమే మాలాంటి టూరిస్టులు.

యాంకీ హార్బర్ : యాంకీ హర్బర్‌కు మేం సాయంత్రం నాలుగు గంటలకు బయలు దేరాం. అక్కడ ఐదు రకాల దుస్తులు ధరించాలి. ఒకదాని మీద ఒకటి వేసుకోవాలి. చలి కోసం పొడవైన రబ్బర్ బూట్లు ధరించి రోబోట్‌లాగ నడవాలి. ఇక అక్కడి నుంచి చిన్న బోటులో ఒడ్డుకు తీసుకొని వెళ్ళారు. అక్కడ పెంగ్విన్స్, సీల్ చేపలను చూసి ఆ మంచుమీద నడుస్తూ అంటార్కిటికాలో అడుగు పెట్టాం. అప్పుడే ఈదురు గాలి ఎడాపెడా ముఖం మీద మంచుతుంపరలతో ముద్దులాడుతుంది. ఆ మంచుగాలికి ముఖమంత రెండు నిమిషాల్లో ఎర్రగా మారిపోయింది. ఆ వాతవరణానికి తట్టుకోలేక పోయాం. వెంటనే నేను వెళ్ళి పోతానని వారికి చెబితే నన్ను ఒక్కదానిని ఒక పడవలో క్రూజ్‌లో దించేసారు. మళ్లీ తెల్లవారేసరికి ఒక దీవికి చేరుకున్నాం.

డిసెప్షన్ ఐలాండ్: నాలుగవ రోజు డిసెప్షన్ ఐలాండ్‌లో వున్నాం. ఇక్కడ కొంతమంది ఇండ్లు కట్టుకున్నారు. కాని అగ్ని ప్రమాదంలో లావా ప్రభావంతో ఇండ్లు కొద్ది భాగం కాలిపోయి వున్నాయి. ఈ భాగమంతా నల్లటి లావా అంటే ఇసుకలాగ వుంది. ఈ ప్రాంతంలో మూడు కిలో మీటర్లు నడిచాం. సముద్రం నీలంగా ఈ దీవి మాత్రం నల్లగా వుంది. మొత్తంగా ఈ దీవి అద్భుతంగా అనిర్వచనీయంగా వుంది. ఈ లావా ఉప్పొంగిన చోట వలయాకారంగా వుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పెంగ్విన్స్ చక్కగా స్నానం చేస్తూ మమ్మల్ని అబ్బురపరిచాయి.

కార్‌విల్లా దీవి: మధ్యాహ్నం రెండు గంటలకు ఈ దీవిలో ఒక ప్రకటన చేశారు. ఎవరైతే చావుకి భయపడరో వారు ఈ దీవిని చూడడానికి వెళ్ళవచ్చు అని చెప్పారు. ఆరు "కిల్లర్ వేల్స్" తిమింగలాలు వున్నాయి. అవి చూడడానికి వెళ్ళవచ్చని అని చెప్పారు. 150 మంది ప్రయాణికులలో ఒక 10మంది మాత్రమే ఈ పడవలో ప్రయాణం చేశారు.

అందులో నేను వున్నాను. ఈ తిమింగలాలు 60 అడుగుల పొడవుతో వున్నాయి. మాకు ఫైర్‌మాన్ వేసుకునే డ్రెస్‌లాంటిది ఇచ్చారు. అది వేసుకొని ఆ రబ్బర్ పడవలో వెళ్ళాం. ఐదు అడుగుల దూరంలో వుండి ఈ తిమింగలాలని చూశాం. ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. ఆ తిమింగలం గట్టిగా శ్వాస తీసి ఉఫ్ అని ఊదితే కూడ ఈ పడవ తలకిందులు కావచ్చును. అంత భయంకరంగా తిరుగుతుంది. అప్పుడప్పుడు దాని తలభాగం, తోక కనిపిస్తున్నాయి. మా పడవ నడిపే అతను చాలా ఎక్స్‌పర్ట్ అతను ఈ కిల్లర్ వేల్స్ దగ్గరివరకు తీసుకెళ్ళి రెండు నిముషాలు నిశ్శబ్దంగా ఆగి వాటిని తిలకించి వెంటనే రయ్యిన వేరే చోటుకి తీసుకెళ్తున్నాడు. నా జీవితంలో మొదటిసారి నేను చాలా పెద్ద అడ్వెంచర్ చేశానని భావించాను. మా వెంబడి వచ్చిన శాస్త్రవేత్త ఏడు సార్లు అంటార్కిటికా వచ్చానని చెప్పారు. కిల్ వేల్స్‌ను చూడటం మాత్రం మొదటి సారి అని చెప్పారు. నిజంగా నేనెంత అదృష్టవంతురాల్ని అని అనుకున్నాను.

పోర్ట్‌లాక్‌రాయ్: ఆ తర్వాత రోజు పోర్ట్‌లాక్‌రాయ్ దీవికి వెళ్లాం. ఇది 30 అడుగుల ఎత్తు వరకు మంచుతో పేరుకొని పోయి ఉంది. సముద్రపు అంచున మొత్తం మంచు గడ్డ కట్టడంతో పడవ నుండి సముద్రం అంచున దిగి ఒక నిచ్చెన సాయంతో ఈ 30 అడుగుల మంచు కొండపై ఎక్కవలసి వచ్చింది. మంచుతో నిచ్చెన జారినా, ఏమైన ప్రమాదమైనా మన బాధ్యత. అందుకని మైకు ద్వారా "ప్రయాణికులు ఎవరైతే ధైర్యంగా ఉంటారో వారే వెళ్ళవచ్చు" అని ప్రకటించారు. నేను మా వారు వెళ్ళాం. చల్లటి నీళ్ళలో దిగి 20 అడుగులు నడిచి ఆ నిచ్చెన మీద ఎక్కి ఒక రెండు గంటలు నడిచాం.

ఇస్పరాంజా దీవి: 1903లో ఏడుగురు శాస్త్రవేత్తలు ఈ దీవిలో నివసించారు. పెద్ద తుఫాను వచ్చి అండర్‌సన్, డూర్, గ్రూడన్ మాత్రం ఆ దీవిలోనే ప్రాణాన్ని వదిలారు. అందుకని వీరిస్మారక చిహ్నంగా వీరి పేరు మీద ఆ దీవిలో ఒక కట్టడం కట్టారు. అక్కడ రేకులతో కట్టెతో కట్టిన ఇండ్లు ఉన్నాయి.

నికో హార్బరు: ఇక్కడ నాలుగు కిలోమీటర్ల దూరంలో చల్లటి మంచు కొండల దగ్గరకు నడిచి మంచుకొండలపై నుండి జారుతూ కిందికి వచ్చాం. పెద్ద మంచుకొండల మధ్య పాల నురగలాంటి మంచు పర్వతాల మధ్య పెంగ్విన్ పక్షుల లాగ నడుస్తూ, చలికి వణుకుతూ కాళ్ళు కొంకర్లు పోతున్నా ఒక తెలియని ఆనందం. అంత అందమైన మంచుకొండలలో ఒక చిత్రకారుడు బొమ్మలు గీసినట్టుగా ప్రకృతి అందాల్ని చూచి మైమరచి పోయాం. నేను మా వారు కొండ పైకి ఎక్కి జారుడు బండ పై జారినట్లుగా జారుతూ కిందికి వస్తుంటే అబ్బా కేరింతలు కొడుతూ, మంచు బంతులతో ఆడుతూ తడుస్తూ వచ్చాం. పెంగ్విన్స్ పిల్లల్ని పెట్టడం చూచాం. అది గుడ్లు ఆడది పెడితే, ఆ గుడ్లను మగపక్షి పొదుగుతుంది. దూరంలో వున్న చిన్న చిన్న రాళ్ళని ఒక్కొక్కటి ఏరి అన్నీ ఒక చోట చేర్చి దానిలో గుడ్లు పెట్టి అవి పొదుగుతున్నాయి. ఈ అద్భుతాన్ని చూసి అవి పిల్లల్ని పొదగడానికి ఎంతకష్టపడుతు న్నాయో అని అనిపించింది. తెల్లని, నల్లని సీల్స్ సముద్రం పక్కగా మత్తున పడుకున్నాయి.

ఈ ప్రదేశంలో బ్రిటీష్‌కు చెందిన దేశస్థులు నాలుగు ఇండ్లు కట్టుకొని నివసిస్తున్నారు. వారి దేశభక్తిని కొనియాడవలసిందే. ఎప్పుడో వచ్చి పడవల వారి దగ్గర కొద్దిగా సరుకులు తీసు కుంటూ అక్కడే 30 ఏండ్ల నుండి జీవిస్తున్నారంటే చాలా ఆశ్చర్యం అనిపించింది. ఇక్కడ చనిపోయిన వారు వాడిన ఆహారపు డబ్బాలు, వారు వాడిన బట్టలు, వస్తువులు, అన్నీ మ్యూజియంలాగ పెట్టారు. అక్కడ బ్రిటీష్ వారి జెండా వుంది. మేం ఆ జెండా దగ్గర ఫొటోదిగి క్రూజ్‌లో తిరిగి వచ్చాం. మాతో పాటు ఒక ప్రయాణికుడు కాళ్ళు చేతులు పడిపోయినా కూడా చక్రాల బండిలో కూర్చుని ఒక అస్టిసెంట్‌ను తీసుకొని ఈ పదిరోజులు ప్రయాణం చేశారు. అతనిని చూసి చాలా ఆశ్చర్యపోయాను. అతని పట్టుదల ఆసక్తి ఎంతో ఉత్సుకతను పెంచాయి.

జీవిత చరమదశలో కూడా అతని ఆశలు ఆ ప్రోత్సాహం ఎంతో ఆశ్చర్యం అనిపించింది. జీవితంలో ప్రతి ఒక్కరు ఇలాగ నిరాశ నిస్పృహలు లేకుండ ఎంతో ఆసక్తితో జీవితాన్ని జీవించాలని మేమిద్దరం కోరుకున్నాం. ఒక నార్వే దేశస్థుడు, ఒక రచయిత మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. మీకు అంటార్కిటికా చూడాలని ఎందుకు అనిపించింది? శాస్త్రవేత్తలు కూడా అంటార్కిటికా ఉచితంగా వెళ్ళమన్నా వెళ్ళరు. మీరు ఎందుకు వచ్చారు? మా ఇద్దరి సాహస యాత్రని గురించి నార్వే మ్యాగజైన్‌లో ముద్రించారు. ఇది నా జీవితంలో మరిచిపోలేని మధురజ్ఞాపకం. దేశం కాని దేశం మాకు పరిచయంలేని వ్యక్తి మా గురించి రాయటం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇక తిరిగి మా పాస్‌పోర్ట్ మీద అంటార్కిటికాకు వచ్చినట్టుగా ముద్ర వేయించుకొని అర్జెంటీనాకు బయలు దేరాం. మళ్లీ మరోసారి అర్జెంటీనా అనుభవాలను మీతో పంచుకుంటాను.

జీవిత చరమదశలో కూడా అతని ఆశలు ఆ ప్రోత్సాహంఎంతో ఆశ్చర్యం అనిపించింది. జీవితంలో ప్రతి ఒక్కరు ఇలాగ నిరాశ నిస్పృహలు లేకుండ ఎంతో ఆసక్తితో జీవితాన్ని జీవించాలని మేమిద్దరం కోరుకున్నాం. ఒక నార్వే దేశస్థుడు, ఒక రచయిత మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. మీకు అంటార్కిటికా చూడాలని ఎందుకు అనిపించింది? శాస్త్రవేత్తలు కూడా అంటార్కిటికా ఉచితంగా వెళ్ళమన్నా వెళ్ళరు. మీరు ఎందుకు వచ్చారు? మా ఇద్దరి సాహస యాత్రని గురించి నార్వే మ్యాగజైన్‌లో ముద్రించారు. ఇది నా జీవితంలో మరిచిపోలేని మధురజ్ఞాపకం.

- నర్మదా రెడ్డి
9849018510

ఈ శీర్షిక మీదే..

మీరు ఎన్నో ప్రదేశాలు చూసి ఉంటారు. మీ అనుభూతులను, ప్రయాణంలో ఎదురైన అనుభవాలను జరదేఖో పాఠకులతో పంచుకోండి..

jaradekhont
@gmail.com

మా చిరునామా..
నవ తెలంగాణ తెలుగు దినపత్రిక,
ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1,
ఆజమాబాద్,
ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020

**ఈ ప్రపంచం పుస్తకంలాంటిది..
దాన్ని మొత్తం చుట్టేయని వాళ్ళు
కనీసం ఒక్క పేజీనైన చదవాలి.
- సెయింట్ అగస్టీన్**

హిమ సోయగాల సిమ్లా...


ఎటుచూసినా తెలుపు తివాచీ పరిచినట్లుండే దట్టమైన హిమం, ఆ మంచును కుప్పలుతెప్పలుగా పోసినట్లుండే పర్వతాలపై సూర్యకిరణాలు పడి బంగారు వర్ణంలో మెరిసిపోయే చూడచక్కని దృశ్యాలు, పచ్చని పచ్చికబయళ్ళు, ఆపిల్ తోటల అందాలు, లోయలు, పైన్... ఓక్ చెట్ల సోయగాలు ఇవన్నీ సిమ్లాను భూతల స్వరంగా తీర్చిదిద్దాయి. ప్రతి సంవత్సరం సిమ్లాలో జరిగే వింటర్ స్పోర్ట్స్ అంగరంగ వైభవంగా జరుగుతాయి. వింటర్ స్పోర్ట్స్ సిమ్లాకు ప్రత్యేక ఆకర్షణ. సిమ్లా మంచుకొండల్లో అడ్వెంచర్ టూర్ ఓ మరుపురాని అనుభూతి.

మంచుపై స్కేటింగ్ చేస్తూ దూసుకుపోవడంలో ఉన్న ఆనందం మాటల్లో చెప్పరానిది. సిమ్లా నుంచి కుఫ్రి వెళ్లేదారి అంతా ఒకవైపు ఆకాశాన్నంటే పర్వతాలు, మరోవైపు లోతైన లోయలు. ఈ పర్వత శ్రేణులన్నీ మంచుదుప్పటి కప్పుకున్నట్లుగా ఉంటే, లోయలన్నీ రంగు రంగుల సీతాకోక చిలుకల్లా కనిపిస్తుంటాయి. సిమ్లా పట్టణం మొత్తం కొండల్లోనే అమరి ఉంది. అర్ధచంద్రాకారపు పర్వతాల పై భాగంలో ఉండే ఈ పట్టణంలో ఎటుచూసినా పైన్, దేవదారు చెట్లు ఒకదాన్ని మించి మరొకటి ఆకాశాన్నంటుతున్నాయా! అన్నట్టుగా ఉంటాయి. అయితే శీతాకాలంలో మాత్రం ఈ చెట్లు మంచుదుప్పటి కప్పుకొని శ్వేతవర్ణంలో కనువిందు చేస్తాయి. ఇక్కడి ఇండ్లన్నీ దూరం నుంచి చూస్తే ఒకదానిపై ఒకటి పేర్చినట్టుగా ఉంటాయి.

హాట్ వాటర్ స్ప్రింగ్: సిమ్లా విహారంలో ప్రత్యేక ఆకర్షణ వేడి నీటి గుండం. ఈ వేడినీటి గుండంలో స్నానం చేయడం ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుంది. ఈ నీటి గుండంలో తప్ప దాని చుట్టుపక్కల పరిసరాలన్నీ రక్తం గడ్డకట్టించేంత చల్లగా ఉంటాయి. కానీ, ఈ వేడినీటి గుండంలోని నీరు మాత్రం మరుగుతూ ఉంటుంది. ఈ నీటిలో సల్ఫర్ ఉన్న కారణంగా రసాయనిక చర్య జరిగి అలా జరుగుతూఉంటుందట.

లక్కడ్ బజార్: సిమ్లా వెళ్లిన పర్యాటకులు మొట్టమొదటగా దర్శించేది మాల్ రోడ్డు. మాల్ సెంటర్ ఇక్కడ ఓ ప్రత్యేక ఆకర్షణ. ఈ మాల్ రోడ్డులో విహరించ డానికి పర్యాటకులు ఎక్కువగా ఇష్టపడతారు. గుర్రమెక్కి మాల్ అంతా చుట్టి, కావాల్సినవన్నీ కొనుక్కోవచ్చు. సిమ్లా, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆపిల్ తోటలు ఎక్కువగా ఉంటాయి. పర్యాటకులు ఈ పండ్లను కోసుకుంటున్నా స్థానికులు అభ్యంతరం చెప్పారు. అయితే కేవలం పండ్లను మాత్రమే కోసుకోవాలి. అలా కాకుండా పచ్చికాయలను ముట్టుకుంటే మాత్రం ఊరుకోరు. సిమ్లాలో ముఖ్యంగా దర్శించాల్సిన వాటిలో హిమాలయ పర్వతాలు ముఖ్యమైనవి. అత్యద్భుతంగా కనిపించే స్కాండర్ పాయింట్, చర్చి, లైబ్రరీ, లక్కడ్ బజార్... తదితరాలు ఇక్కడ ముఖ్యమైన ప్రదేశాలు. లక్కడ్ బజార్ లో కొయ్యలతో చేసిన హస్త కళల వస్తువులు విరివిగా దొరుకుతాయి.

స్టేట్ మ్యూజియం: ఇక ఇక్కడి స్టేట్ మ్యూజియంలో హిమాచల్ ప్రదేశ్ కు చెందిన పురాతన, చారిత్రక ప్రాధాన్యం ఉన్న శిల్పాలు, పెయింటింగ్స్ చాలా ఉంటాయి. భారతీయ సంస్కృతిని కండ్లకు కట్టినట్టు చూపించే ఈ మ్యూజియంలో ఆసక్తి కలవారికి సమయం ఎలా గడిచిపోతుందో కూడా తెలిదు. అలాగే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్



కూడా చూడదగ్గ ప్రాంతం. అక్కడి నుంచి 15 నిమిషాలు నడిస్తే ప్రాస్పెక్ట్ హిల్‌కు చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి ఏడు కిలో మీటర్ల దూరంలో సమ్మర్ హిల్ చూడవచ్చు.



అక్కడ ఉండే జార్జియన్ హౌస్‌లోనే మహాత్మా గాంధీ విడిది చేసేవారు. హిమాచల్‌ప్రదేశ్ యూనివర్సిటీ కూడా ఇక్కడే ఉంది.సిమ్లా నుంచి బయలు దేరినప్పటి నుంచి ప్రతి ఐదు లేక ఆరు కిలోమీటర్లకు ఒక టూరిస్ట్ ప్లేస్ దర్శన మిస్తుంది. అలాంటి వాటిలో తత్తపాని, హాట్ వాటర్ స్ప్రింగ్ తప్పకుండా దర్శించాలి. సిమ్లాకు చేరుకో వాలంటే... ఢిల్లీ నుంచి చండీగఢ్, కల్కాల మీదుగా వెళ్లాలి. కల్కా నుంచి సిమ్లా వెళ్లే టాయ్ ట్రైన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌కు కనెక్టింగ్ ట్రైన్‌లో వెళ్లవచ్చు.

నిజానికి సిమ్లా ప్రయాణం కల్కా నుంచి మొదలవుతుంది. అక్కడి నుంచి నారోగేజ్ రూట్‌లో టాయ్ ట్రైన్‌లో ప్రయాణించడం పర్యాటకులకు మరపురాని అనుభూతులను మిగుల్చుతుంది. ఎటుచూసినా హిమాలయ పర్వతశ్రేణులు, లోయలు, పైన్, ఓక్ చెట్లతో నిండి ఉంటుంది. సిమ్లా, కల్కాల మధ్య 103 సొరంగాలు, 87 బ్రిడ్జిలు ఉన్నాయి. టాయ్ ట్రైన్‌లో వెళ్లేటప్పుడు వీటన్నింటినీ చూస్తూ, అంతులేని ఉద్వేగాన్ని పొందవచ్చు. గ్రేటెస్ట్ నారో గేజ్ ఇంజనీరింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియాగా గిన్నిస్ బుక్‌లో ఈ మార్గం రికార్డు అయింది.

సమ్మర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా: వింటర్ స్పోర్ట్స్ సంరంభం తర్వాత ఫిబ్రవరి చివరి మాసం నుంచి వేసవి విడిదికి వచ్చే పర్యాటకుల సందడి పెరుగుతుంది. భారతదేశంలోని ప్రముఖ పర్యాటక స్థలాలలో ఒకటిగా, వేసవి విడిదిగా పేరుగాంచింది సిమ్లా. 1819 లో బ్రిటీష్ వారిచే కనుగొనబడిన సిమ్లా, ఆ తర్వాత 1864 వ సంవత్సరంలో సమ్మర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ప్రకటించారు. బ్రిటీష్ వారి కాలంలో సిమ్లాను వేసవి విడిది గా ఉపయోగించుకునే వారు. దేశ విభజన సమయంలో కాశ్మీరుకు సంబంధించిన చర్చలు ఇక్కడి వైశ్రాయ్ భవనంలోనే జరగడం విశేషంగా చెప్పవచ్చు. అందుకే సిమ్లాను సందర్శించే పర్యాటకులు తప్పకుండా వైశ్రాయ్ భవనాన్ని కూడా దర్శిస్తుంటారు.

దూర ప్రాంతాల నుంచి విమానయానం ద్వారా సిమ్లా చేరుకోవాలనుకునే పర్యాటకులకు దగ్గరి విమానాశ్రయం సిమ్లా ఎయిర్‌పోర్ట్. దాదాపు అన్ని ప్రధాన నగరాల నుండి ఇక్కడికి విమాన సదుపాయం ఉన్నది. ఈ ఎయిర్‌పోర్ట్.. కులుమనాలి, ఢిల్లీ నగరాల ఎయిర్‌పోర్ట్‌లతో సంబంధం కలిగి ఉంటుంది. వివిధ నగరాల నుంచి వచ్చే పర్యాటకులు ఢిల్లీ ఎయిర్ పోర్టులో వారికి ఏది అనువుగా ఉంటే ఆ ఎయిర్‌పోర్ట్ ద్వారా సిమ్లాకు చేరుకోవచ్చు.

- సంహిత

గడువు మూడు నెలలే



- బడ్జెట్ కేటాయింపుల్లో సగం కూడా ఖర్చు పెట్టని నీటిపారుదల శాఖ
- కాంట్రాక్టర్ల బకాయిలు రూ. 5,657 కోట్లు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

నీటిపారుదల శాఖకు కేటాయించిన బడ్జెట్‌లో డిసెంబర్ నెలాఖరు వరకూ కేటాయించిన బడ్జెట్‌లో సగం కూడా ఖర్చు కాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే తొమ్మిది నెలల కాలం గడచి పోగా కేవలం మరో మూడు నెలల కాలం మాత్రమే మిగిలి ఉన్నది. రీడిజైన్‌లో భాగంగా భారీ బడ్జెట్‌తో రూపొందించిన ప్రధాన ప్రాజెక్టుల్లో కూడా పనులు ఆశించినంత వేగంగా జరగక పోవడమే దీనికి కారణమని స్పష్టమవుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి రెండు బడ్జెట్లలో నీటిపారుదల రంగానికి తక్కువగా నిధులు కేటాయించగా మొదటిసారి 2016-17 బడ్జెట్‌లో రూ. 25,000 కోట్లు కేటాయించారు. అయినప్పటికీ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి కేవలం రూ. 16,200 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ, మధ్యతరహా, చిన్న నీటి వనరులకు కలిపి రూ. 24,575.60 కోట్లు కేటాయించారు. అధికారిక లెక్కల ప్రకారం డిసెంబర్ నెలాఖరుకు రూ. 13,124.92 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. కాంట్రాక్టర్లకు మరో రూ. 5,657.13 కోట్లు చెల్లించాల్సి ఉన్నదని అధికారులు తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లో భారీ ప్రాజెక్టులకు రూ. 21,488.84 కోట్లు కేటాయించగా దీనిలో డిసెంబర్ నెలాఖరుకు రూ. 12,106.20 కోట్లు ఖర్చు పెట్టారు. భారీ ప్రాజెక్టులకు సంబంధించిన పనులు పూర్తయిన మేరకు కాంట్రాక్టర్లకు రూ. 5,059.74 చెల్లించాల్సి ఉన్నది. ఈ మొత్తంలో రూ. 3,420 కోట్లు చెల్లింపుల కోసం ఇప్పటికే బిల్లులు ప్రభుత్వానికి అందాయి. మధ్యతరహా ప్రాజెక్టుల కోసం ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 812.28 కోట్లు కేటాయించగా డిసెంబర్ నెలాఖరుకు రూ. 129.82 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు.

ఈ ప్రాజెక్టులకు సంబంధించి కాంట్రాక్టర్లకు రూ. 67.87 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. మిషన్ కాకతీయ సహా చిన్న తరహా సేద్యపు నీటి పనుల కోసం ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 2,268.49 కోట్లు కేటాయించగా డిసెబర్ నెలాఖరుకు రూ. 888.90 కోట్లు ఖర్చు పెట్టారు. వివిధ పనులకు సంబంధించిన కాంట్రాక్టర్లకు రూ. 529.52 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. రాష్ట్రంలో అతి పెద్ద ప్రాజెక్టుగా పరిగణిస్తున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 7,105.52 కోట్లు కేటాయించగా బ్యాంకుల వద్ద తీసుకుంటున్న రుణంలో రూ. 4,568.41 కోట్లు ఖర్చు పెట్టాలని నిర్ణయించారు. డిసెంబర్ నెలాఖరు వరకూ ఈ ప్రాజెక్టు కోసం రూ. 3,443.99 కోట్లు ఖర్చు పెట్టగా కాంట్రాక్టర్ల బకాయిలు రూ. 1,694.70 కోట్లుగా ఉన్నది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 4,0007.64 కోట్లు కేటాయించగా మూడు త్రైమాసికాల తర్వాత 1,173.83 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ఈ ప్రాజెక్టు పనులకు సంబంధించిన కాంట్రాక్టర్ల బకాయిలు రూ. 1,029.83 కోట్లుగా ఉన్నది. అతి ముఖ్యమైన ప్రాజెక్టుల్లో సీతారామ, కంతనపల్లి, ప్రాణహిత, డిండి, కల్వకుర్తి దేవాదుల ప్రాజెక్టుల పనులు నత్తనడక నడుస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల పనులకు సంబంధించి మూడవ వంతు నిధులు కూడా ఇప్పటి వరకూ ఖర్చు కాలేదు.

2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు, డిసెంబర్ వరకు ఖర్చుల వివరాలు (రూ. కోట్లలో)

ప్రాజెక్టు పేరు	బడ్జెట్ కేటాయింపులు	పెట్టిన ఖర్చు మొత్తం	ఖర్చు పెట్టాల్సినది	పెండింగ్ బిల్లులు
ఎస్సారెస్పీ	328.20	149.81	178.39	39.50
కడెం	5.86	0.47	5.39	1.51
నిజాంసాగర్	107.19	20.90	86.29	37.36
రాజోలిబండ	65.00	7.22	57.78	26.93
సింగూరు	55.32	18.76	36.56	16.11
జూరాల	68.45	14.24	54.21	4.19
ఏఎమ్మార్ ఎస్సెల్బీసీ	854.70	438.27	416.43	321.12
నాగార్జునసాగర్	537.63	183.25	354.37	77.12
ఎస్సారెస్పీ 2 వ దశ	150.24	29.46	120.78	1.46
నెట్టెంపాడు	179.32	48.97	130.35	74.58
కల్వకుర్తి	1,000.00	240.53	760.47	281.30
కోయిల్‌సాగర్	138.36	11.52	186.84	30.55
ఎస్సారెస్పీ వరదకాల్వ	861.40	620.17	241.23	323.07
బీమా	216.89	60.17	156.71	70.05
ఎల్లంపల్లి	346.47	94.08	252.39	114.04
దేవాదుల	1,510.64	333.59	1,117.05	388.78
ప్రాణహిత	769.50	100.01	669.49	115.70
కాళేశ్వరం	7,105.52	3,443.99	3,661.54	1,694.70
సీతారామ	997.00	144.22	852.79	90.73
డిండి	542.05	96.58	445.47	254.22
కంతనపల్లి	475.00	31.67	443.33	00
పాలమూరు	4,007.64	1,173.83	2,833.81	1,029.83

మందకృష్ణ అరెస్ట్

- దీక్షకు అనుమతి నిరాకరణ
- పోలీస్ కమిషనరేట్ ముందు హైడ్రామా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చేపట్టాలని కోరుతూ 48 గంటల ఉపవాస దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్టు చేశారు. పార్శీగుట్టలో ఎమ్మార్పీ ఎస్ కేంద్ర కార్యాలయంలో ఆయన దీక్షను ప్రారంభిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. అప్పటికే ఎమార్పీఎస్ కార్యాలయం ముందు భారీగా మోహరించిన పోలీసులు మందకృష్ణ దీక్షకు కూర్చోగానే పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కార్యాలయం ముందు పోలీసులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది.

రెండుగంటలపాటు ఉత్కంఠ

ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన ఉపవాస దీక్షకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంద కృష్ణ పోలీస్ కమిషనరేట్‌కు చేరుకున్నారు. సుమారు రెండు గంటల పాటు సీటీ పోలీస్ కమిషనరేట్ ఎదురుగా హైడ్రామా చోటు చేసుకుంది. చివరికి దీక్షకు అనుమతి ఇవ్వడం లేదంటూ సిటీ పోలీస్ కమిషనర్ మంద కృష్ణకు తెలిపారు. దీంతో ఆయన పార్శీగుట్టలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం చేరుకుని కార్యకర్తలతో సమావేశమయ్యారు. కొద్ది సేపటి తర్వాత తన కార్యాలయంలోనే దీక్ష చేపడుతున్నట్టు ప్రకటించడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేసి ముషిరాబాద్ జైలుకు తరలించారు. తర్వాత అక్కడి నుంచి ఆయనను కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోలీస్ స్టేషన్‌లోనే దీక్ష ?

48 గంటల ఉపవాసదీక్షకు అనుమతించకపోవడంతో మందకృష్ణ కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లోనే దీక్ష చేపట్టారు. వర్గీకరణకు సంబంధించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఈనెల 4వరకు గడువు ఇస్తున్నామన్నారు. లేని పక్షంలో ఈ నెల 5న అన్ని బీజేపీ కార్యాలయాల ముందు శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తామని మందకృష్ణ చెప్పారు.

'ప్రాధాన్యతా క్రమంలో భూసేకరణ'

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టుల కోసం చేస్తున్న భూసేకరణ ప్రక్రియ ప్రాధాన్యతా క్రమంలో జరగాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి ఆదేశించారు. భూసేకరణ పురోగతి, నిధుల ఖర్చుకు సంబంధించి మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కానారేన్సు నిర్వహించారు. నిధులను ఖర్చు చేసే సమయంలో ప్రాధాన్యతలను ముందుగానే గుర్తించాలన్నారు. వచ్చే మార్చి 31 లోగా ప్రాజెక్టుల భూసేకరణకు అవసరమయ్యే నిధుల వివరాలు కూడా ఇప్పుడే సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూసేకరణ విషయంలో సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించాలని జోషి సూచించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడం వల్ల ఎంత మేరకు ఆయకట్టుకు సాగు నీరందుతుందో తనిఖీ చేసి తగిన నిధులను వెచ్చించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో రైతాంగం ప్రయోజనాలను ద ష్టిలో పెట్టుకోవాలన్నారు. జిల్లాలు, ప్రాజెక్టులు, మండలాలు, గ్రామాలు, సర్వే నెంబర్ల వారీగా భూసేకరణ ప్రగతి, నిధుల వినియోగంపై బుధవారం నాటికి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపాలని జిల్లా కలెక్టర్లను ఆయన ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి వివిధ సాగునీటి ప్రాజెక్టుల కోసం జరిగిన భూసేకరణ, నిధుల వినియోగంపై సమీక్షించారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాలకు నిధులు బదిలీ చేసిన వివరాలు కూడా పంపాలని జిల్లా కలెక్టర్లను కోరారు. దీనికి చెందిన ప్రోఫార్మాలను ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపించినట్టు జోషి చెప్పారు. వాటిని పూర్తి చేసి వెంటనే పంపాలని జోషి కోరారు. గడచిన మూడున్నరేండ్లలో జిల్లాలకు భూసేకరణ కింద అందిన నిధులు, ప్రాజెక్టుల వారీగా వినియోగించిన నిధుల వివరాలను క్రోడీకరించాలని కోరారు. భూసేకరణ ప్రక్రియ కోసం విస్తతంగా పత్రికల్లో ప్రచారం జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో భూసేకరణకు అయ్యే వ్యయం కన్నా పత్రికా ప్రకటనలకు ఎక్కువ ఖర్చు పెట్టే పరిస్థితికి స్వస్తి చెప్పాలని కోరారు. ఆచి తూచి పత్రికా ప్రకటనలు ఇవ్వాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్‌రాజ్, ఈఎన్సీలు మురళీధరరావు, నాగేందర్‌రావు, సీఈలు భగవంతరావు, హరేరాం, శ్యాంసుందర్, సురేష్, ఖగేందర్‌రావు, లింగరాజు, శంకర్, సునీల్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఒక నెల వేతనం ఇవ్వాలి

- 10న సమావేశానికి హాజరు కావాలి
- సీఈఓకు మంత్రుల హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భూపాలపల్లి జిల్లా కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీ (బిల్ట్ బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్) కంపెనీ యాజమాన్యం ఈ నెల 9 లోపు ఒక నెల వేతనం కార్మికులకు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, గిరిజన శాఖ మంత్రి చందూలాల్ ఆదేశించారు. కంపెనీ యూనియన్ల జేఏసీ ప్రతినిధులతో మంగళవారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ యాజమాన్య ధోరణిని మంత్రులకు వివరించారు. కార్మికుల ఇబ్బందులను వివరించారు. దీనిపై స్పందించిన మంత్రులు కంపెనీ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీఎం కేసీఆర్ వద్ద జరిగిన సమావేశంలో ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చి కూడా ఎందుకు అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని చెప్పిన తర్వాత కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్యాక్టరీ మూతపడడం వల్ల 750 మంది కార్మికులు రోడ్డున పడ్డారని, తక్షణమే నెల రోజుల జీతం ఇవ్వడంతోపాటు కార్మికులకు బాకీ పడిన 32 నెలల జీతం వెంటనే చెల్లించాలని వారు ఆదేశించారు. ఈ నెల 10 సచివాలయంలో జరిగే సమావేశానికి కంపెనీ సీఈవో హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్‌నదీమ్, జాయింట్ కమిషనర్ భాగ్యనాయక్, డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, బిల్ట్ ఇండస్ట్రీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

అప్పులబాధతో పత్తిరైతు ఆత్మహత్య

నవతెలంగాణ-నల్లబెల్లి

అప్పులబాధతో పత్తిరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కన్నారావుపేటలో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం....పల్నాటి నారాయణ (38) అనే రైతు గ్రామంలో రెండున్నరెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇందుకోసం పెట్టుబడికి రూ. 1.30 ఖర్చయింది. ఈ క్రమంలో పత్తి పంటకు గులాబీ తెగులు సోకి దిగుబడి పూర్తిగా పడిపోయింది. దీనికి తోడు రెండేండ్లుగా పంటలపై పెట్టుబడుల కోసం చేసిన అప్పు రూ.ఐదు లక్షలు అయింది. దీంతో కొన్ని రోజులుగా అప్పు ఎలా తీర్చాలో తెలియక నారాయణ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అప్పు విషయంలో భార్యాభర్తల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. తర్వాత ఈదులకుంట సమీపంలోని తన పొలం వద్దకు వెళ్లాడు. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న రైతులు నారాయణను చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

నేరేళ్ల ఘటనపై 6న పాదయాత్ర

సిద్ధిపేట నుంచి ప్రారంభం ..వామపక్షాలు, టీజేఏసీ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేరేళ్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న సిద్ధిపేట నుంచి నేరేళ్ల వరకూ పాదయాత్ర నిర్వహించాలని వామపక్షాలు, టీజేఏసీ, టీపీఎఫ్, ప్రజా సంఘాలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఆయా పార్టీల నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, చలపతిరావు (సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ), తాండ్రకుమార్ (ఎంసీపీఐ-యు), సీహెచ్ మురహరి (ఎస్‌యుసీఐ-సీ), గోవర్ధన్ (సీపీఐ ఎంఎల్- న్యూడెమోక్రసీ), గోవింద్ (ఆరెస్పీ), బండ సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), పురుషోత్తం (టీజేఏసీ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ.. ఇసుక మాఫియా ఒకే లైసెన్సుపై 20 నుంచి 30 లారీలు నడుపుతూ యదేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నదని విమర్శించారు. లారీలను తగలబెట్టారనే నెపంతో పోలీసులు అణగారిన వర్గాల వారిని అరెస్టు చేసి, చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే పోలీసులు అనేక మంది మరణానికి కారణమైన లారీ డ్రైవర్లు, యజమానులను ఎందుకు అరెస్టు చేయటం లేదని ప్రశ్నించారు. కోదండరామ్ మాట్లాడుతూ.. నేరెళ్ల బాధితులపట్ల ప్రభుత్వం ఇప్పటికీ కక్ష పూరితంగానే వ్యవహరిస్తున్నదని విమర్శించారు. వారిని లొంగదీసుకునేందుకే సర్కారు ప్రయత్నిస్తున్నది తప్ప వారికి న్యాయం చేసే ఆలోచన ఏ కోశానా లేదని చెప్పారు. ఇసుక మాఫియా ప్రయోజనాలు, లాభాల కోసమే టీఆర్ఎస్ సర్కారు పని చేస్తున్నదని విమర్శించారు. డిజి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నించాలని కోరారు. లేదంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నేరెళ్ల సంఘటన జరిగి 200 రోజులైనా లారీ యాజమాన్యాలపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. దళితులు, ఇతర అణగారిన వర్గాలంటే ప్రభుత్వానికి చిన్న చూపని విమర్శించారు. సిద్ధిపేట నుంచి నిర్వహించే పాదయాత్రలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతోపాటు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోదండరామ్, చాడ, డీజీ, గోవర్ధన్ తదితరులు

కార్పొరేట్ చేతుల్లో మీడియా

- వ్యవసాయం, విద్యా, వైద్యం..అంశాలకు తక్కువ ప్రాధాన్యత : జర్నలిస్టు అరుణ్‌సాగర్ స్మారకోపన్యాసంలో పాలగుమ్మి సాయినాథ్
- నెగెటివ్ వార్తలే ముందు చదువుతాం: మంత్రి హరీశ్‌రావు
- గోరటి వెంకన్నకు సాహిత్య పురస్కారం ప్రదానం
- ఉత్తమ జర్నలిస్టుగా నవతెలంగాణ ప్రతినిధి శివరామకృష్ణయ్య

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రస్తుతం దేశంలో జరుగుతున్న హత్యలు యాధృచ్ఛికమైనవి కాదనీ, సైద్ధాంతికపరంగా సాగుతున్నవని ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ తెలిపారు. 1992 నుంచి 2016 వరకు సుమారు 50 మందికి పైగా జర్నలిస్టులు హత్యకు గురయ్యారని అన్నారు. గౌరీలంకేశ్, నరేంద్ర దబోల్కర్, కల్బుర్గి, గోవింద్ పన్సారేలు సైద్ధాంతికంగా విభేధించారనే కారణంతో మతోన్మాదులు దారుణంగా హత్య చేశారని చెప్పారు. మంగళవారం నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో అరుణ్‌సాగర్ జర్నలిస్టు అవార్డులు, సాహితీ పురస్కారం ప్రదానోత్సవం మీడియా అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాలు- ప్రధాన స్రవంతి ప్రసార మాధ్యమాలు అనే అంశంపై ఆయన స్మారకోపాన్యాసం చేశారు. పెద్ద పత్రికలు, ఛానల్స్ వ్యవసాయం, విద్య, వైద్యం, పర్యావరణం తదితర అంశాలకు సంబంధించిన వార్తలకు కవరేజి సరిగా ఇవ్వడం లేదనీ, కేవలం సినిమాలు, వినోదం లాంటి వాటికే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. వ్యవసాయ కార్మికులు, కార్మికులు, రైతులు, పేదలు, దళితుల సమస్యల గురించి మీడియా దృష్టిసారించడం లేదని, కేవలం కార్పొరేట్లకు సంబంధించిన వార్తలే ఎక్కువ రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రివర్గంలో ఎవరు ఏశాఖ నిర్వహించాలనే దాన్ని కూడా కార్పొరేట్ శక్తులే నిర్ణయిస్తున్నాయని చెప్పారు. ప్రపంచంలో ఏడు సంస్థలే ఇంటర్నెట్‌ను నియంత్రిస్తున్నాయన్నారు. నోట్లరద్దు, జీఎస్టీతో ప్రజల కష్టాలు పడ్డారనీ, వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయారనీ అయినా మీడియా దీన్ని చూపించలేదని చెప్పారు. మీడియా మొత్తం కార్పొరేట్ శక్తుల్లో కీలుబొమ్మగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.


నెగెటివ్ వార్తలే ముందు చదువుతాం: మంత్రి హరీశ్‌రావు

పత్రికల్లో వచ్చే నెగెటివ్ వార్తలనే ముందుగా చదువుతామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వాటిలో వాస్తవాలను ఆయా శాఖల అధికారులకు తెలియజేస్తామని చెప్పారు. పత్రికల్లో వచ్చే వార్తలను సోషల్ ఆడిట్‌గా తీసుకుంటామన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్నారని కొనియాడారు. ప్రస్తుతమున్న పోటీ ప్రపంచంలో జర్నలిస్టులకు పనిఒత్తిడి పెరిగిందనీ, దీంతో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు వృత్తితో పాటు కుటుంబం, ఆరోగ్యం గురించీ ఆలోచించాలని సూచించారు. అరుణ్‌సాగర్ డబ్బు కంటే సంస్కారాన్ని, మంచి పేరును సంపాదించుకున్నారని కొనియాడారు. అరుణ్‌సాగర్ వార్తలు, రచనల్లో సామాజిక బాధ్యత కనిపించేదని గుర్తుచేశారు. కొంతమంది గొప్పతనం బతికున్నప్పటి కంటే చనిపోయిన తర్వాతే తెలుస్తుందనీ, అలాగే అరుణ్‌సాగర్ గురించి తనకూ తెలిసిందని చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... మాటలో, చేతల్లో వామపక్ష భావాలు, గిరిజనుల పక్షపాతిగా అరుణ్‌సాగర్‌లో కనిపించేవని అన్నారు. ఆయన మరణం జర్నలిజానికి తీరనిలోటని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీ బల్కా సుమన్, జ్యూరీ సభ్యులు రాంచంద్రమూర్తి, కె శ్రీనివాస్, కట్టా శేఖర్‌రెడ్డి, శివారెడ్డి, పద్మ, టీవీ5 ప్రతినిధి వసంత్ తదితరులు పాల్గొన్నారు.



గోరటి వెంకన్నను సత్కరిస్తున్న మంత్రులు హరీశ్, తుమ్మల, పాలగుమ్మి సాయినాథ్, అల్లం నారాయణ, కట్టా శేఖర్‌రెడ్డి, కె. శ్రీనివాస్ తదితరులు

ఈ సందర్భంగా ప్రముఖ వాగ్గేయ కారులు గోరటి వెంకన్నను అరుణ్‌కుమార్ సాహితీ పురస్కారంతో సత్కరించారు. అనంతరం వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు గానూ అవార్డులను ప్రదానం చేశారు. ప్రింట్ మీడియా విభాగంలో నవతెలంగాణ 'సోపతి' ప్రతినిధి శివరామకృష్ణయ్య రాసిన 'ఎడారి బతుకు చిత్రం' కథనానికి ద్వితీయ బహుమతి అందుకున్నారు. మొదటి బహుమతి కిష్టయ్య(నమస్తే తెలంగాణ- అంబర్‌పేట), తృతీయ బహుమతి కట్టా నరేంద్రచారి(పెద్దపల్లి), కోలా నాగేశ్వర్‌రావు ప్రదానం చేశారు. ఎలక్ట్రానిక్ విభాగంలో యాజులు (సాక్షి), నరేంద్రచారి(హెచ్ఎంటీవీ), మణికేశ్వర్ (ఈటీవీ) అందుకున్నారు.



శివరామకృష్ణయ్యను సత్కరిస్తున్న పాలగుమ్మి సాయినాథ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి


> సమస్యలొస్తే గందరగోళ పడకు, నువ్వు విజయం సాధించవలసిన పరీక్షలుగా భావించి వాటిని ఎదుర్కో - కారల్ మార్క్స్

సంపాదకీయం

రజనీ రాజకీయ ప్రవేశం

తమిళ సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఏడాది చివరి రోజు తాను రాజకీయాల్లోకి వస్తున్నానని, కొత్త పార్టీ స్థాపించబోతున్నానని ప్రకటించి రెండు దశాబ్దాలుగా ఆయన రాజకీయరంగ ప్రవేశంపై వినవస్తున్న ఊహాగానాలకు తెరదించారు. తలైవర్ (నాయకుడు)గా పిలుచుకునే తమ అభిమాన కథానాయకుడు రాజకీయ నాయకుడు కావడం రజనీ అభిమానులకు నిజంగా పెద్ద పండగే. ఇంతకుముందెలా ఉన్నా జయలలిత మరణం తర్వాత రజనీ రాజకీయ ప్రవేశంపై చర్చ ఊపందుకుంది. మరో సినీ నటుడు కమల్‌హాసన్ రాజకీయ అరంగేట్రం కోసం వడివడిగా అడుగులేస్తున్న తరుణంలో సైతం ప్రస్తుతం రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ రజనీ వ్యాఖ్యానించి ఆశ్చర్యపరిచారు. అంతలోనే గత మే మాసంలో అభిమానులతో సమావేశమయ్యారు. తదుపరి డిసెంబర్ 26న మరోసారి అలాంటి భేటీయే నిర్వహించి డిసెంబర్ 31న స్పష్టత ఇస్తానన్నారు. అన్నట్టుగానే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ స్థాపించి అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులను పోటీకి నిలబెడతానని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలపై ఆ సమయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రాజకీయాలు భ్రష్టు పట్టాయి, వాటి ప్రక్షాళనే లక్ష్యం, గెలుపోటములు దేవుడి చేతుల్లోనే, రాజకీయాలంటే భయం లేదు, గెలిస్తే విజయం లేకుంటే విరమణ... ఇవీ స్థూలంగా రజనీ తొలి పలుకుల సారాంశం. అందరి నాయకులమల్లేనే పదవులపై ఆశ లేదన్నారు. అవి ఎప్పుడో తనను వెతుక్కుంటూ వచ్చినా చలించలేదని వక్కాణించారు. తనకు ఇంతటి స్థానాన్ని కట్టబెట్టిన ప్రజలకు సేవ చేయకపోతే చచ్చే వరకు ఆ బాధ వేధిస్తుందని చెప్పారు. ప్రస్తుతం రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. రజనీ వల్లించిన మాటలు పడికట్టు పదాలే. రాజకీయరంగ ప్రవేశానికి సంబంధించిన సమాచారం వెల్లడించేవే తప్ప పార్టీ విధానాలు, ఆశయాలు, సిద్ధాంతాలను విస్పష్టపరిచేవి కావు. రానున్నకాలంలో స్పష్టత వస్తుందేమో చూడాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో మతోన్మాదం, ఉదారవాద ఆర్థిక సంస్కరణల వంటి కీలక అంశాలు తప్పక ముందుకొస్తాయి. తలైవర్ కొత్తసంవత్సరంలో కొత్త నిర్ణయాలు, విధానాలతో ముందుకు వస్తుందా లేదా అనే ఉత్సుకత కొనసాగుతోంది. రజనీ పార్టీ విధి విధానాలు ప్రకటించేవరకు వేచి చూడాల్సిందే.



తమిళ రాజకీయాలకు సినిమా రంగం కొత్తకాదు. చాలా ద్రవిడ పార్టీలకు వెండితెర ప్రముఖులే నాయకులు. కొందరు ముఖ్యమంత్రి పదవులు సైతం అధిరోహించగా మరికొందరు ఘోరంగా విఫలమయ్యారు. ద్రవిడ ఉద్యమ నాయకుల్లో ఒకరైన అన్నాదురై డీఎంకే పార్టీ నెలకొల్పి సీఎం అయ్యారు. ఆయన సహచరుడు కరుణానిధి అన్నాదురై అనంతరం డీఎంకే పగ్గాలు చేపట్టి ముఖ్యమంత్రి అయ్యారు. వీరిద్దరూ సినిమా రచయితలు. అన్నాడీఎంకేను స్థాపించిన సినీ నటుడు ఎంజి రామచంద్రన్, ఆయన తర్వాత ఆ పార్టీ పగ్గాలు చేపట్టిన జయ ముఖ్యమంత్రు లయ్యారు. శివాజీగణేశన్ పార్టీ పెట్టి అనంతరం కాంగ్రెస్‌లో చేరి 1987లో బయటికొచ్చి ఇంకో పార్టీ పెట్టి భంగపడ్డారు. సీమాన్, విజయ్‌కాంత్, శరత్‌కుమార్‌ల పరిస్థితి కూడా దాదాపు అంతే. ఇప్పుడు రజనీ, కమల్ రాజకీయాల్లోకొస్తామని వెల్లడించారు. ఒక విధంగా చూస్తే రజనీ గతంలో పలు సందర్భాల్లో రాజకీయాల్లో సంచలనాత్మకంగా వ్యవహరించారు. తమిళనాడులో 1996 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలనుకున్నారు. అన్నాడీఎంకేకి కాంగ్రెస్ మద్దతివ్వడంతో అసంతృప్తి చెందారు. జయ గెలిస్తే రాష్ట్రాన్ని దేవుడు కూడా రక్షించలేడని వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో జయ పార్టీ ఓటమికి తన వ్యాఖ్యలే కారణమని రజనీ చెప్పుకున్నారు కూడా. నదుల అనుసంధానం చేపడతామన్న హామీపై 2004లో ఎన్‌డీఏకి మద్దతునిచ్చారు. జయ 2014లో జైలు నుంచి బయటికొచ్చాక రజనీ కలిసి ఆమె సీఎం కావాలని ఆకాంక్షించారు.

యాభై ఏండ్లుగా తమిళనాడులో డీఎంకె, అన్నాడీఎంకే రెండు పార్టీలే అధికారాన్ని పంచుకున్నాయి. ఒకసారి ఒకరు గెలిస్తే ఇంకోసారి మరో పార్టీ గెలుస్తూ వచ్చింది. మొన్ననే అన్నాడీఎంకే వరుసగా రెండోసారి అధికారంలోకొచ్చింది. జయ మృతి తర్వాత ఆ రాష్ట్రంలో రాజకీయ అస్థిరత్వం నెలకొంది. రెండు పార్టీలూ ప్రజల మద్దతును కూడగట్టడంలో వెనుకబడ్డారని నిన్నటి ఆర్‌కే నగర్ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థి దినకరన్ గెలుపుతో తేలింది. ఈ అవకాశాన్ని రజనీ సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నట్టు ఆయన తొలి ప్రకటనలో 'సమయం ఆసన్నమైంద'ని చెప్పకనే చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టవచ్చు. ఆ పార్టీ విధానాలతోనే దాని దార్శనికత అర్థమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్‌టీ రామారావు పార్టీ పెట్టి ఘన విజయం సాధించడానికి రాష్ట్రాల అధికారాలు, ఆత్మగౌరవం, కాంగ్రెస్ అప్రజాస్వామ్య చర్యలు వంటి విధానాలు తోడ్పడ్డాయి. రెండు పార్టీల ఆనవాయితీ ఉన్న తమిళనాడులో మూడోశక్తిగా వేలు పెట్టాలని బీజేపీ ప్రయత్నిస్తున్న తరుణంలో రజనీ రాజకీయ ప్రవేశం సహజంగానే చర్చనీయాంశమవుతోంది. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీని రజనీ ప్రత్యేకంగా కలవడం అప్పట్లో సంచలనం రేపింది. ప్రస్తుత పరిస్థితుల్లో మతోన్మాదం, ఉదారవాద ఆర్థిక సంస్కరణల వంటి కీలక అంశాలు తప్పక ముందుకొస్తాయి. తలైవర్ కొత్తసంవత్సరంలో కొత్త నిర్ణయాలు, విధానాలతో ముందుకు వస్తుందా లేదా అనే ఉత్సుకత కొనసాగుతోంది. రజనీ పార్టీ విధి విధానాలు ప్రకటించేవరకు వేచి చూడాల్సిందే.

బాలికా విద్య ఇంకెంత దూరం...?!



మోతుకూరి సంయుక్త

"తరలిరండి- చదువుకోండి/ స్వశక్తితో నిలవండి, శ్రమించండి/ విజ్ఞాన ధనం ఆర్జించండి/ చదువులేకుంటే అన్నీ నిష్ప్రయోజనమే/ వివేచన లేకుంటే మనం / వింత పశువులం"

ఆధునిక భారతదేశ తొలిఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే 19వ శతాబ్దం ఉత్తరార్థంలో బాలికలకు యిచ్చిన పిలుపు ఎంత ఉత్తేజకరంగా, ఉత్సాహవంతంగా, ధీమాగా ఉంది! ఆ పిలుపును భారతదేశంలోని మూల మూలల్లో నేటికీ వినిపించాల్సిన అవసరం ఉందికదా! సావిత్రీ బాయి పూలే 187వ జన్మదినం (జనవరి 3) సందర్భంగా ఆమె స్ఫూర్తిని స్మరించుకుందాం.

ప్రపంచానికి మనమే జ్ఞాన భిక్ష పెట్టామని, ప్రచారం చేస్తున్న పాలకులు అట్టడుగు క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోవడం లేదు. విద్యలో సమానత్వం సాధించగలిగితేనే బాలికలు తమ భవిష్యత్తు తీర్చి దిద్దుకోగలుగుతారు. డ్రాపవుట్ బాలికల కోసమే నిర్వహించబడుతున్న కస్తూర్బాగాంధీ పాఠశాలలు కూడా పౌష్టికాహార కొరత, వసతుల లేమితో మొక్కుబడిగా నడుస్తున్నాయి. ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు పేరేదైనా ప్రచారానికి ఉపయోగపడినంతగా ప్రమాణాల నాణ్యత ఉండడం లేదు.


సమాజంలోని సకల వివక్షలకు మూలం అవిద్య, అజ్ఞానం అని గుర్తించిన జ్యోతిబా తన కార్యాచరణలో చదువుకు అత్యంత ప్రాధాన్యత కల్పించాడు. బాల బాలికలకు, వయోజనులకు విద్య నందించే కృషికి ప్రణాళికలను తయారు చేశాడు. బాలికలను ఇంటి గడప దాటించడమే కష్టమైన నాటి పరిస్థితులలో పురుష ఉపాధ్యాయులు బోధకులుగా ఉంటే బాలికలు ఎవరూ బడికి వచ్చే అవకాశం లేదు. అందుకని తన జీవిత సహచరి సావిత్రీబాయిని ఒప్పించి మెట్రిక్యులేషన్ వరకు చదివించి, ఉపాధ్యాయ శిక్షణ ఇప్పించాడు జ్యోతిబా. ఉన్నత, మధ్యతరగతి కుటుంబాల ఆడ పిల్లలు ఎట్లాగైనా చదువుకోగలరు. వివక్షకు గురవుతూ, ఆత్మన్యూనతతో కుమిలిపోతున్న దళిత, బహుజన బాలికలకు చదువు చెప్పడం ముఖ్యం అని, ఆడ పిల్లలు విద్యావంతులైతే సమాజగమనం అభివృద్ధి వైపు పయనిస్తుందని సమాజాభివృద్ధిలో వారే క్రియాశీలక పాత్ర పోషించగలరని నమ్మారు పూలే దంపతులు. "ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు", 'బేటీ బచావో, బేటీపఢావో' నినాదాలకు శతాబ్దానికి ముందే బాలికల చదువు ఆవశ్యకత వారు గుర్తించారు. బాల్య వివాహాలు విస్తృతంగా జరుగుతున్న ఆ కాలంలో పూలేది కూడా బాల్య వివాహమే, అయినా వారిలో ఎంతో పరిణతితో సమాజాన్ని గురించిన ఆలోచనలు సాగడం ఆశ్చర్యమే.

1848లో సావిత్రీబాయి ఉపాధ్యాయినిగా మహారాష్ట్రలోని పూనే నగరంలో తొలి దళిత బాలికల పాఠశాలను ప్రారంభించారు. సహాధ్యాయిని ఫాతిమా ఆమెకు తోడై నిలిచింది. పాఠశాల ఏర్పాటుకు ఒక ముస్లిం పెద్ద తన ఇంటిలో కొంత భాగాన్ని ఇవ్వడంతో వీరికి బలం చేకూరింది. ఆ క్రమంలో సంపన్న అగ్రకులాలవారి నుండి సావిత్రీబాయి ఎదుర్కొన్న అవమానాలు లెక్కకు మిక్కిలి. ఎట్టి పరిస్థితులలోనూ సవాళ్లను ఎదుర్కోవడం తప్ప వెనుతిరగని ధీరురాలు సావిత్రీబాయి. బాలికలకు చదువు చెప్పడంతోపాటు ఛాందస ఆచారాల అంధకారంలో కుంగి కునారిలుతున్న బ్రాహ్మణ బాల వితంతువులకు ఆసరాగా కూడా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. జ్యోతిబా పూలే మరణించినప్పుడు తన భర్త చితికి తానే నిప్పంటించి కుల పెద్దల, సంప్రదాయ వాదుల నోరు మూయించింది. సామాజిక సేవలో కొవ్వొత్తిలా కరిగి, ప్లేగు వ్యాధి పీడితులకు సేవలందిస్తూనే కనుమూసిన త్యాగ మూర్తి సావిత్రీబాయి.

బాలికా విద్యకోసం పరితపించి, సాహసంతో ఒక బాటను వేసి, అసంఖ్యాకులైన బాలికలు ఉన్నత స్థాయికి చేరుకోవడంలో శ్రమించి మార్గ దర్శనం చేసిన సావిత్రీబాయి పూలే ఆశయం ఏమేరకు ఫలించిందో చూస్తే బాధ కలుగుతుంది. ఏడు దశాబ్దాల స్వతంత్ర దేశంలో 'అందరికీ విద్య' ఇంకా నినాదంగానే మిగిలి పోయింది. దళిత, వెనకబడిన, పక్కకు నెట్టివేయ బడిన కులాల పిల్లలు, ముఖ్యంగా బాలికలు ఇప్పటికీ లక్షల్లో బడి ముఖం చూడలేక పోతున్నారు. దేశంలో 6 కోట్ల మంది బడి ముఖం చూడలేదు. అనేక ప్రణాళికలు, కమిషన్లు, చట్టాలు వచ్చినా పాలకులకు రాజకీయ చిత్తశుద్ధిలేని కారణంగా లక్ష్య సాధన సుదూరంలో కూడా కానరావడం లేదు. కుల మత, వర్గ వివక్ష ఉన్న చోట లింగవివక్ష మరింత ఎక్కువగా ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో అక్షరాస్యత 74.4శాతం ఉంటే దానిలో 82.14శాతం బాలురు, 65.46శాతం బాలికలు. ఈ శాతాలు గ్రామీణ, మారుమూల గిరిజన ప్రాంతాలలో మరింత తక్కువగా 30-35శాతంగా ఉంటున్నాయి. విద్యా హక్కు చట్టం-(2009) వచ్చి ఏడేండ్లు గడుస్తున్నా అమలులో మాత్రం వేగం లేదు. 1966 నాటి కొఠారీ కమిషన్ సూచనల మేరకు నిధుల మంజూరు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం 3శాతం, తెలంగాణ ప్రభుత్వం 8.5శాతం బడ్జెట్ మాత్రమే విద్యా రంగానికి కేటాయిస్తున్నాయి. వార్షిక బడ్జెట్లు లక్షల కోట్లల్లో కేటాయించినా విద్యారంగం కేటాయింపులు పెరగడం లేదు. "మహిళల పురోగమనాన్ని చూసే నేను దేశ పురోగమనాన్ని అంచనా వేస్తాను" అన్నారు డా. అంబేద్కర్. మహిళల పురోగమనం బాలికలకు విద్యను అందించడంతోనే సాధ్యం అవుతుంది. అదే నేడు నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. పాలకుల దృష్టిలో ఇది శ్రద్ధ వహించవలసిన అంశంగానే లేదు.

పేద కుటుంబాల సామాజిక ఆర్థిక వెనుకబాటుతనం, తల్లిదండ్రుల వలసలు, ఇంటిపని కారణంగా బాలికలు బడికి రావడం మానుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న కారణంగా అవి పిల్లలను ఆకర్షించడం లేదు. అయినా ఆడ పిల్లలకు అవి మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. ఆంగ్ల మాధ్యమంపై తల్లిదండ్రులకు ఆసక్తి ఉన్నా భరించలేని ఫీజులు, కొడుకులు పున్నామ నరకం నుండి తప్పిస్తారన్న మూఢత్వతం, ఆడ పిల్లలు పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతారు, మగపిల్లలు తమను ఆదుకుంటారన్న ఆశతో కొడుకులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. కొడుకులు మాత్రమే తమ సంపద అని వారిని పెంచి పోషించుకోవాలని, కూతుళ్ళు ఇతరుల సంపద కాబట్టి వారిపై పెట్టుబడి పెట్టడం అనవసర మైన ఖర్చు అనే వివక్షా పూరిత ధోరణి కూడా ఆడపిల్లల ఎదుగుదలకు, చదువులకు ఆటంకంగా పరిణమిస్తున్నది. బాలికల విద్యాప్రమాణాలస్థాయి పెరుగుతున్న కొద్దీ ఆయా సమాజాల్లో మహిళల హోదా గణనీయంగా మెరుగు పడుతున్నదని యునెస్కో పేర్కొంటున్నది.

అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రభుత్వరంగంలోనే అందరికీ విద్య అందుబాటులో ఉండగా ఉన్నత విద్యారంగంలో కూడా ఐరోపా 54శాతం, అమెరికా 55శాతం, చైనాలో 54శాతం కాగా భారత్‌లో 16 శాతంగా మాత్రమే ఉంది. 189 దేశాల



మానవాభివృద్ధి సూచిలో 131వ స్థానంలో, 159 దేశాల్లో అసమానతలపై చేసిన సర్వేలో 125 స్థానంలో మనదేశముంది. ప్రభుత్వ రంగంలో సమానమైన, నాణ్యమైన విద్యనందిస్తూ పురోగమిస్తున్న ఫిన్లాండ్, సింగపూర్, తైవాన్ దేశాల నమూనాను మనం అనుసరించాలి. అతి చిన్న దేశాలకు కూడా సాధ్యమయిన 'అందరికీ చదువు' మనకెందుకు సాధ్యం కావడం లేదన్నది పెద్ద ప్రశ్న. సామాజిక ఉద్యమాల ఒరవడిలో అక్షరాస్యతలో కేరళ ముందున్నది. త్రిపుర కేరళతో పోటీ పడుతూ అభివృద్ధి సాధిస్తున్నది. బీహార్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ మొదలైన రాష్ట్రాలు ఛాందస భావజాలంతో వెనుకడుగులో ఉంటున్నాయి. ఏపీ తెలంగాణ రాష్ట్రాల్లో ఆడపిల్లలపై జరుగుతున్న హింసా, రక్తహీనత, బడిమానేయడం వంటి సమస్యల్లో ముందు వరుసలో ఉన్నాయి. లింగ సమానత్వ భావనలను పెంచి సమానమైన, నాణ్యమైన విద్య అందరికీ ఒకే తీరుగా అందించాలనే విద్యావేత్తల, అభ్యుదయ వాదుల ఆలోచనలు కార్యరూపం దాల్చడంలేదు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నామని, ప్రపంచానికి మనమే జ్ఞాన భిక్ష పెట్టామని, ప్రచారం చేస్తున్న పాలకులు అట్టడుగు క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోవడం లేదు. విద్యలో సమానత్వం సాధించగలిగితేనే బాలికలు తమ భవిష్యత్తు తీర్చి దిద్దుకోగలుగుతారు. డ్రాపవుట్ బాలికల కోసమే నిర్వహించబడుతున్న కస్తూర్బాగాంధీ పాఠశాలలు కూడా పౌష్టికాహార కొరత, వసతుల లేమితో మొక్కుబడిగా నడుస్తున్నాయి. ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు పేరేదైనా ప్రచారానికి ఉపయోగపడినంతగా ప్రమాణాల నాణ్యత ఉండడం లేదు.

బాలికా పాఠశాలలను బలోపేతం చెయ్యాలి

బాలికల పాఠశాలలు అవసరమైన స్థాయిలో లేవు. బాలికల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణమైన చర్యలు చేపట్టడం తక్షణ అవసరం. బాలికల పాఠశాలలను బలోపేతం చెయ్యాలి. మౌలిక వసతుల కల్పన, మహిళా ఉపాధ్యాయుల నియామకం, టాయిలెట్స్, సురక్షితమైన మంచినీరు, పాఠశాల చుట్టూ ప్రహరీ గోడలు, పర్యవేక్షణాధికారులు, సేవలందించే సిబ్బంది, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, వైద్యసేవల అందుబాటు, ఆత్మరక్షణ విద్యలు, నెలసరి అవసరాలకు తగిన సానిటరీ నాప్‌కిన్సు వంటి కనీస సౌకర్యాల కల్పనకు తగిన బడ్జెట్ కేటాయించడం చాలా ముఖ్యం.

బాలికల ఎదుగుదలకు ప్రభుత్వం, సమాజం చేయవలసింది. బాలికలకు వారివారి కుటుంబాలు, సమాజం తోడ్పాటును అందించాలి. బాలికల చదువు ఆవశ్యకతపై విస్తృతమైన ప్రచారం ప్రభుత్వం, వివిధ స్వచ్ఛంద సంస్థలు చేపట్టాలి.

* పురుషాధిపత్య భావజాలం, బాలికలు, అబలలు అనే మూఢత్వాన్ని తొలగించేందుకు శాస్త్రీయమైన భావజాల, ఆలోచనల ప్రచారం జరగాలి.
* బాల్యవివాహాలు, చిన్నవయసులోనే పిల్లల్ని కనడం వంటి పద్ధతులు కుటుంబ హింస పోషకాహారలేమి, రక్తహీనత వంటివి బాలికల ఎదుగుదలకు ఆటంకాలవు తున్నాయి. ఈ పరిస్థితులను మార్చాలి.
* హైదరాబాదు, ఢిల్లీ, ముంబై వంటి పెద్ద పట్టణాలలో బాలికల అక్రమరవాణా ఆందోళన కలిగించే అంశం. దీనిని పూర్తిగా అరికట్టాలి.
* ప్రభుత్వాలు మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల ఏర్పాటు చేయాలి. ఉన్నవాటిని బలోపేతం చేయాలి. తెలంగాణ రాష్ట్రంలో మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి.

మానవ వనరులు పుష్కలంగా కలిగిన మన దేశంలోని చదువుల్లో నాణ్యత 5 శాతమేనని అంతర్జాతీయ సర్వేలు పేర్కొంటున్నప్పుడైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేలుకోవాలి. "ఆడపిల్లలను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దాం ఎదగనిద్దాం" అన్న సామాజిక నినాదాన్ని నిజం చేయాలని, "బేటీ బచావో- బేటీ పఢావో" అంటున్న మన ప్రధాని అందుకు అవసరమైన నిధులను కేటాయించాలి. బాలికా విద్యాభివృద్ధిలో భాగస్వాములం కావాలి. చిరస్మరణీయురాలైన సావిత్రీబాయి పూలే ఆశల హరివిల్లుగా బాలికలను తీర్చిదిద్ది ఆవిధంగా ఆమె అడుగుల్లో అడుగువేస్తూ దేశాన్ని తీర్చిదిద్దే మంచియువతులను, మంచి ఉపాధ్యాయులను రూపొందించుకోవాలి.

సెల్: 9908924947

గొప్ప అవకాశాన్ని కోల్పోయాం!



డాక్టర్ చుక్కా రామయ్య

ప్రపంచంలోని అన్ని రంగాల్లోనూ ఆటోమేషన్ శరవేగంగా విస్తరిస్తోంది. కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబొటిక్స్‌కు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. మనుషులు మరమనిషితో కలిసి పనిచేయాల్సిన రోజులు మరెంతకాలమో లేవు. ఈ తరుణంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక జ్ఞానాన్ని ఒడిసి పట్టుకోలేకపోతే మనిషి వెనకబడిపోవడం ఖాయం. తద్వారా మనిషికి ఉపాధే ప్రశ్నార్థకమవుతుంది. ఎందుకంటే ఇది టెక్నాలజీ యుగం. ఉపాధి అవకాశాలకు మూలాధారమైన టెక్నాలజీ ఈ రోజు సంపద సృష్టికి కేంద్ర బిందువుగా మారింది. దీనికనుగుణంగా నేటి యువతరం ప్రపంచ స్థాయిలో వస్తోన్న పోకడలకు అనుగుణంగా కొత్త జ్ఞానాన్ని సముపార్జించుకోవడం తక్షణావశ్యం. ఇందుకోసం అనేక సదస్సులు, సమావేశాలు నిర్వహించి యువతలో సామాజిక చైతన్యంతో పాటు విజ్ఞానపు వెలుగు రేఖలు నింపాల్సిన తరుణంలో తెలంగాణ ఓ సువర్ణ అవకాశాన్ని కోల్పోయింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నేటి నుంచి ఈ నెల 7 వరకు జరగాల్సిన 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ఇంఫాల్‌కు తరలిపోవడం బాధాకరం.


నేడు మన యువతంతా గ్రామాల నుంచి వస్తున్నారు. కానీ, ఉపాధి అవకాశాలు మాత్రం గ్లోబల్‌గా ఉంటున్నాయి. ఈ రెంటినీ అనుసంధానం చేసే మనిషి గానీ, మాధ్యమాలు గానీ ఎంతో అవసరం. లోకల్‌లో పొటెన్షియల్ ఉన్నప్పటికీ గ్లోబల్‌లో కాంపిటేషన్ ఉంది. ఇటీవల నిర్వహించిన తెలుగు ప్రపంచ మహాసభల్లో మన స్థానిక ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాం. చాలా మంచిది. దాంతో యువకుల్లో కొంత ప్రేరణ వచ్చింది. అలాగే ఈ రోజు గ్లోబల్ మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే సైన్సే కీలకం. సైన్స్ అభివృద్ధే గ్లోబల్ మార్కెట్‌ను నిర్ణయిస్తుందనేది నేడు జగమెరిగిన సత్యం. అందువల్ల స్థానిక ప్రతిభను ప్రపంచ మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలు కృషిచేయాలి. ఈ రెంటిలో కేవలం ఒకేదానిపై దృష్టిపెట్టడం వల్ల ప్రయోజనం ఉండదు. అవకాశాలు పెరగకపోతే అచీవ్‌మెంట్స్ ఉండవు. పిల్లల్లో కాంక్షలు పెరిగితేనే అచీవ్‌మెంట్ వస్తుంది. మన దగ్గర ఉత్పత్తయిన జ్ఞానం ప్రపంచ స్థాయి మార్కెట్‌కు అనుసంధానం చేయడమే నేడున్న పెద్ద సవాల్. దీనిలో సమతుల్యాత సాధిస్తే అభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. రోజుకో కొత్త పరిశోధనతో సైన్స్ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ మన దగ్గర జరగాల్సిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వేరే చోటుకు తరలిపోవడానికి ఎవరు కారణమో సామాన్యుడికి అంతుపట్టడంలేదు. కొందరు వీసీ కారణమంటుంటే.. మరికొందరు విద్యార్థులు కారణమని, ఇంకొందరైతే ప్రభుత్వం భద్రతకు భరోసా ఇవ్వలేదు కాబట్టి తరలి పోయిందంటూ కొంతమంది భావిస్తున్నారు. కానీ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ మాత్రం ఇంఫాల్‌కు తరలిపోయింది. ఏది ఏమైనప్పటికీ మన పిల్లల్లో గొప్ప అవకాశాలను, ఆకాంక్షల్ని నిర్మాణానికి దోహదపడే ఓ సువర్ణావకాశాన్ని చేతులారా వదులుకున్నామని మాత్రం చెప్పక తప్పదు. పిల్లల్లో కాంక్షల్ని పెంచేవిధంగా ప్రభుత్వాలు, సంస్థలు వ్యవహరించాలి తప్ప వాటిని తుంచేవిధంగా కాదని గుర్తుపెట్టుకోవాలి.

రామయ్య మాట

స్థానిక యువతలో పొటెన్షియల్ తీసుకొచ్చేందుకు రాష్ట్రంలో ప్రయత్నమైతే జరుగుతోంది. కానీ దాన్ని గ్లోబల్ మార్కెట్‌తో కలిపినప్పుడే ఫలితాలు వస్తాయి. ఈ సైన్స్ కాంగ్రెస్ తరలిపోవడానికి కారణం ఎవరైనా దాని ఫలితం అనుభవించేది మాత్రం ప్రజలే. గురుత్వాకర్షణ తరంగాలపై పరిశోధనలు చేసినందుకు గాను 2017లో ముగ్గురికి నోబెల్ బహుమతి రావడం విశేషం. రెయినర్ వీస్, బ్యారీ బారిష్, కిప్ థోర్న్‌కు ఫిజిక్స్‌లో నోబెల్ వచ్చింది. వీరిలో ఇద్దరు అమెరికాకు చెందినవారు కాగా మరొకరు జర్మనీకి చెందినవారు. పరిశోధనలకు ఉన్న గొప్పతనం అది. దేశాల ఎల్లలతో సంబంధం లేకుండా ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఇతరులతో కలిసి పనిచేసే గొప్ప అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఇతర రంగాల్లో విశేష కృషిచేసినవారికి కూడా నోబెల్ ప్రైజ్ వచ్చింది. ఈ సైన్స్ కాంగ్రెస్ సందర్భంగానైనా వారందరినీ చూస్తామని హైదరాబాద్ యువతరం ఎదురుచూసింది. కానీ, సైన్స్ కాంగ్రెస్ తరలిపోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. ఇప్పటివరకు మనం ఆర్థికపరమైన మోడల్ తీసుకున్నాం. సోషల్ మోడల్ కూడా అయిపోయింది. ప్రస్తుతం నాలెడ్జ్ మోడల్‌పై సొసైటీ నిర్మించుకుంటున్నాం. వస్తువులు, వనరులను ఉపయోగించి ప్రజల శ్రేయస్సు కోసం ప్రయత్నం చేయడం ఇప్పటిదాకా జరిగింది. కానీ వనరులను విపరీతంగా వాడటం వల్ల పర్యావరణం క్షీణిస్తోంది. వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. అందువల్ల నాలెడ్జ్ ఆధారంగానే నేడు ప్రజల స్థితిగతులను మార్చే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. జ్ఞానం ఆధారంగా టెక్నాలజీని పెంచి ప్రజల అభివృద్ధికి పాటుపడటం ద్వారా జీవన ప్రమాణాలు పెరుగుతాయని భావిస్తున్నారు. నాలెడ్జ్ ఎప్పటికీ పెరుగుతుందే తప్ప తరగడం ఉండదు. ఇలాంటి జ్ఞాన ఉత్పత్తికి ఇలాంటి సైన్స్ కాంగ్రెస్‌లు ఎంతో ప్రేరణగా నిలుస్తాయి. అందుచేత ఈ రాష్ట్రం కొత్తగా ఏర్పడింది గనక సైన్స్ సామాన్యుడి జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకొనేందుకు ఇది ఉపయోగపడేది కదా అని నా అభిప్రాయం. తెలుగు మహాసభలను నిర్వహించి భాషాభివృద్ధికి కృషిచేసినందుకు అభినందనలే. కానీ అదేమాదిరిగా సైన్స్ కాంగ్రెస్ వల్ల ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చే అవకాశం ఉండేది కదా. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొంటే బాగుండేది కదా అన్పించింది. ప్రభుత్వం, ప్రజల సహకారం లేకుండా ఇలాంటి ప్రతిష్టాత్మకమైన సదస్సులు జరగడం అసాధ్యం. సమాజం అభివృద్ధికి దోహదం చేసే ఇలాంటి గొప్ప అవకాశాన్ని కోల్పోయినందుకు బాధేస్తోంది. టెక్నాలజీ విపరీతంగా పెరుగుతున్న క్రమంలో ఇలాంటి సదస్సులు జరిగితే సైన్స్‌పై ప్రజల్లో అభిమానం పెరుగుతుంది. సమాజంలో మూఢవిశ్వాసాలు పెరగకుండా వుండేందుకు అడ్డుకట్ట వేసే వీలుండేది. అంతేకాదు.. రీసెర్చిలోకి వచ్చే మహిళలు చాలా పరిమితంగానే ఉంటున్నారు. అలాగే వ్యాపారవేత్తలుగా రాణించేందుకు అద్భుతమైన అవకాశాలు ఉన్నప్పటికీ అమ్మాయిలు వాటిని అందిపుచ్చుకోవడంలో వెనుకబడి పోతున్నారు. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన సదస్సులు జరిగితే చైతన్యం విస్తరించి సమాజం ముందుకెళ్తుంది. భవిష్యత్తులో ఇలాంటి అవకాశాలు వచ్చినప్పుడు ఎన్ని కష్టాలైనా పోగొట్టుకోవద్దని నా మనవి.

ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు

ఎంతకాలం ఈ దుఃఖం?



సిహెచ్. మధు

ప్రతి దినం హత్యలు పెరుగుతున్నాయి. ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఏం వ్యవస్థ ఇది! భద్రతలేని వ్యవస్థలో, భయంకర వ్యవస్థలో దుర్మార్గ వ్యవస్థలో బతుకుతున్నాం. ప్రాణానికి విలువలేని, ప్రాణానికి విలువయివ్వని, ప్రాణాలు తీసే వ్యవస్థలో బతుకుతున్నాం. సహజ మరణాలకు తలవంచాల్సిందే! వీరోచిత మరణాలకు జోహార్లతో తలదించాల్సిందే! పనిగట్టుకొని హత్యలు చేస్తే... భరించరాని చీకట్లో ఊపిరాడని జీవనగదిలో ధైర్యంగా ఉండాల్సిన క్షణాలు పిరికిగా మారిపోతే... పోరాటం జీవన మార్గం అనే నీతిని వదిలి మరణాన్ని కౌగలించుకుంటే ఏదో ఒక సంఘటన జరిగిందంటే అర్థం చేసుకోవచ్చు. ప్రతిదినం ఇలాగే జరిగితే... ప్రతిదినం హత్యలు, ఆత్మహత్యలు ఈ వ్యవస్థ ఇంత పిరికితనానికి దిగజారిందేమిటీ? హత్యలు ఆత్మహత్యలు చూస్తుంటే... దుఃఖంతో పాటు కోపం.. కసీ కూడా కలుగుతుంది. ఎవరినో ఒకరిని హత్య చేసే హక్కు వేరేవ్యక్తికెక్కడిది? ఒకరి యిష్టాన్ని నిర్ధారించే హక్కు వేరే వ్యక్తుల కెక్కడిది? "మనిషిలో ధైర్యం తగ్గింది. జీవితం వెలుగునీడల సంగమ మనే ప్రాథమిక సూత్రం తగ్గింది. మనిషిలో పోరాడాలనే తత్వం నశించింది. నేటి జీవితం.. జీవనం పిరికిగా మారిపోయింది. కష్టాలతో పోరాడలేక ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఎదుటవ్యక్తితో వేగలేక, ఎదుటి వ్యక్తి తన స్వార్థానికి సుఖానికి ఆటంకంగా ఉన్నారని, ఎదుటి వ్యక్తి తనను ప్రేమించటం లేదని, ప్రేమించినా పెళ్లి చేసుకొమ్మని ఒత్తిడి తెస్తుందని హత్యలు చేస్తున్నారు. హత్యలలో ఎక్కువ శాతం మహిళలుంటున్నారు. ప్రేమికుని చేతులలో ఉన్మాదుల చేతులలో, భర్తల చేతులలో, రేపిస్టుల చేతులలో ఇలా ఎందరో మహిళలు బలి అవుతున్నారు. ఇదేం భారతం? విషాద భారతమా? దుర్మార్గ భారతమా? పిరికి భారతమా? చీకటి భారతమా? హత్యల భారతమా? ఆత్మహత్యల భారతమా; ఇదేం భారతమిది? ఎందుకిలా జరుగుతోంది? జీవితంలో పోరాడలేక కొందరు.. శత్రువును మిత్రునిగా మార్చుకోలేక హతమార్చటం ఒకటే మార్గమని కొందరు.. తన తప్పులను తెలియకుండా ఉండాలని కొందరు, ప్రశ్నిస్తున్నారని, ధిక్కరిస్తున్నారని, చెప్పిన మాట వినటం లేదని తన బతుకుకు ఆ వ్యక్తి బతికి ఉంటే కష్టమని, తన విలాసాలకు భోగాలకు తప్పుడు పనులకు అడ్డు తగులుతున్నాడని హత్యలు చేస్తున్నారు. సంస్కరణ గుణం తగ్గింది. సహనం తగ్గింది. ఆత్మవిశ్వాసం తగ్గింది. ఇందుకు కారణం ఏమిటీ? వ్యవస్థలోపమా? వ్యక్తి లోపమా? వ్యక్తిలో పెరిగిన హింసాధోరణి కారణమా? వ్యక్తి బలహీనత కారణమా?.. సమాజంలో జరుగుతున్న హత్యలు ఆత్మహత్యలకు నా దృష్టిలో 'వ్యవస్థ' కారణం. వ్యవస్థలోని దుర్మార్గం కారణం.. వ్యవస్థలోని హింసాయుత వాతావరణం కారణం. వ్యవస్థలోని దోపిడీ లక్షణాలు కారణం. హత్యలు.. ఆత్మహత్యలకు 'వ్యక్తులు-వ్యక్తివాదం' కారణంగా పైకి కనిపించినా నిజానికి వ్యవస్థ కారణం. మన ఆలోచనలలోని 'సంకుచిత గుణం' వ్యక్తి తప్పుమీదికి మరలుతుంది. కానీ.. వ్యక్తికాదు, వ్యవస్థ కారణం. వ్యవస్థను పట్టుకొన్న రోగం కారణం.

జీవితం అమూల్యమైనది. జీవితం కమనీయం, రమనీయం అయినది. జీవితం కన్నీళ్లు వున్నా... జీవనం ముళ్ల రాళ్లతో నిండినా... జీవితంలో ఆనందముంది. జీవనదారిలో అమృతముంటుంది. నా దృష్టిలో పోరాడేవాడే వీరుడు. హత్యలుచేసే వాడు ఆత్మహత్యలు చేసుకునేవాడు పిరికివాడు. జీవన ఆనందం తెలుసుకోలేనివాడు. కష్టాలను ఎదుర్కొనేవాడే మనిషి. తన కన్నీళ్లను తుడుచుకుంటూ ఎదుటివ్యక్తి కన్నీళ్లను తుడిచేవాడే మనిషి. జీవన



పోరాటంలో మధురిమను ఆస్వాదించేవాడే మనిషి. ఇతరుల తప్పులను క్షమించి దగ్గరికి తీసుకునే వాడే మనిషి. పోరాటమంటే... తాను బతకటానికి, తన సుఖం కొరకు, తన స్వార్థం కొరకు ఇతరులను బెదిరించటం, కొట్టటం, చంపటం పోరాటం కాదు. పోరాటం మార్పుకు సంకేతం... జీవన పోరాటం... జీవించటానికి పోరాటమంటే.. తాను చెపితే వినని మనసుతో పోరాటం.. తన చుట్టూ ఉన్న చీకటితో పోరాటం... తనను నిరంతరం వెంబడిస్తున్న నీడతో పోరాటం. పాలకుల తప్పులపై పోరాటం, మూఢాచారాలపై, చెడు వ్యసనాలకై, దోపిడీ వ్యవస్థ సృష్టిస్తున్న చెడు సాంప్రదాయాలపై, చెడు అలవాట్లపై, చెడు రంగాలపై పోరాటం... పోరాటం చేయటంలో ఆనందముంటుంది. పోరాటం ద్వారా జీవన ధైర్యం పెరుగుతుంది. జీవించాలనే తపన పెరుగుతుంది... మనిషిలో పోరాట ధోరణి పెరిగితే హత్యలు.. ఆత్మహత్యలు తగ్గుతాయి. పోరాటమంటే కసి తీర్చుకోవటం కాదు. కక్ష పెంచుకోవటం కాదు. కొట్టటం, చంపటం, బెదిరించటం కాదు. పోరాటమంటే సంస్కరణ, పోరాటమంటే చైతన్యం, పోరాటమంటే మార్పు. పోరాటమంటే జీవించటం, జీవనాన్నివ్వటం, పోరాటం కరువై మన వ్యవస్థలో హత్యలు, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఇటీవల ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయి. అమూల్యమైన భవిష్యత్తు తమదిగా భావించే విద్యార్థులలో ఆత్మహత్యలు పెరిగాయి. ఇతరులను రక్షించాల్సిన పోలీసురంగంలో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కొందరు తాను పిరికివాడయి ఆత్మహత్య చేసుకోవటమే కాకుండా చంటి పిల్లల్నీ కుటుంబాన్ని చంపుతున్నారు. ఇటీవల యాదాద్రి - జగదేవ్‌పూర్ కుటుంబ ఆత్మహత్యలు ఎంత ఘోరం? ఏడుగురు చనిపోయారు. రెండు తెలుగు రాష్ట్రాలలో విద్యార్థులలో 70 మంది ఆత్మహత్యలు జరిగినట్టు వార్త.. వీటికి వ్యవస్థ కారణం కాదా? బలహీనమైన, దుర్మార్గమైన, నిరంతరం చీకటిని పెంచుతున్న వ్యవస్థే కారణం. ఆత్మహత్యలు సమర్థనీయం కాదు. తెలంగాణ ఉద్యమ బలహీనతకు వ్యవస్థ దుర్మార్గానికి, పాలకపక్ష దుర్నీతికి ఈ ఆత్మహత్యలు కారణం.. తెలంగాణ ఉద్యమంలో కొందరు ఆత్మహత్యకు ఎందుకు గురి అయ్యారు? తెలంగాణ రాదని... సమైకాంధ్రలో తమ బతుకులు బాగుపడవని... ఇవి కొన్ని కారణాలైతే.. తెలంగాణ యివ్వటం లేదని నిరసనగా కొందరు... తెలంగాణ ఉద్యమంలోని ఆత్మహత్యల నుండి మనం గుణపాఠం నేర్చుకోవాలి. తెలంగాణ సాధన తర్వాత మన అంచనా ఏమిటీ? తెలంగాణ ఉద్యమంలో ఆత్మహత్య చేసుకొన్నవాడు తొందరపడ్డారని... అమూల్యమైన జీవితాలు అనవసరంగా బలి అయ్యాయి. తెలంగాణ వచ్చిన తర్వాత బాగుందా? అది వేరే సంగతి.

ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని కొందరంటున్నారు. నూటికి నూరుపాళ్ల నిజం... అప్పులు పెరిగి.. బతుకులేక.. బతుకలేక ఎలా బతకాలో తెలియక ఒంటరితనం భరించలేక.. పురుషాధిక్యవేధింపులు తట్టుకోలేక అవమానాలను, అన్యాయాలను దుర్మార్గాలను భరించలేక ఈ ఆత్మహత్యలకు వ్యవస్థ కారణం కాదా? వ్యవస్థ లోని దోపిడీ లక్షణం కారణం కాదా? వ్యవస్థ ఎక్కడి వరకు దిగజారిందంటే.. కులం పేరుతో.. మతం పేరుతో హత్యలు జరుగుతున్నాయి. ఇటీవల హిందూ ఉగ్రవాదం హత్యలు పెరిగాయి. గౌరీలంకేశ్, కల్బుర్గీ, దబోల్కర్... ఆవు మాంసం తింటున్నారని, అమ్ముతున్నారని రకరకాల హత్యలు పెరిగాయి. ఈ మత హత్యలకు గురి అవుతున్న దెవరు? దళితులు, అణగారిన వర్గాలు, మైనారిటీలు వాళ్లేమి పాపంచేసారో?

ఈ వ్యవస్థలోని పాలకపక్షాలు హింసమీద ఆధారపడి బతుకుతున్నాయి. మనిషిని సామాజిక లోపాలను సంస్కరించటం వాళ్లకు చేతకాదు. నేరగాళ్లను పెంచుతున్న వ్యవస్థ ఇది. మనిషి బతకాలి. జీవితాన్ని తనివితీరా అనుభవించాలి. జీవితంలోని మాధుర్యాన్ని పొందాలి. అందుకు మనిషి పోరాడాలి. హత్యలకు, ఆత్మహత్యలకు వ్యతిరేకంగా! హత్యలు - ఆత్మహత్యలు పరిష్కారం కాదు.

సెల్: 9949486122

నెహ్రా నయా అవతారం

బెంగళూరు జట్టు బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు



బెంగళూరు : ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన టీమిండియా మాజీ బౌలర్ ఆశీష్ నెహ్రా కోచ్‌గా కొత్త అవతారం ఎత్తనున్నాడు. కెరీర్ విరమణ అనంతరం కామెంటేటర్‌గా అలరించిన నెహ్రా తాజాగా బెంగళూరు రాయల్ చాలెంజర్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా ఎన్నికయ్యాడు. ఈ మేరకు ఆ జట్టు మేనేజ్‌మెంట్ ఓ ప్రకటనలో తెలిపింది. జట్టుకు బౌలింగ్ శిక్షణ ఇవ్వటమే గాక మెంటార్‌గానూ నెహ్రా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ఇందుకు సంబంధించిన అంగీకార పత్రాలపై గతవారమే సంతకాలు జరిగినట్టు తెలుస్తోంది. మరో పక్క బ్యాటింగ్ కోచ్, మెంటార్ బాధ్యతలను దక్షిణాఫ్రికా మాజీ బ్యాట్స్‌మన్ గ్యారీ కిర్‌స్టెన్ చూసుకోనున్నాడు. గత మూడు ఐపీఎల్ సీజన్లలో ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు కోచ్‌గా ఉన్న గ్యారీ.. ప్రస్తుతం బిగ్‌బాష్ లీగ్‌లో హబర్ట్ హరికేన్స్‌కు కోచ్ బాధ్యతలు నెరవేరుస్తున్నాడు. కాగా బ్యాటింగ్, బౌలింగ్ కోచ్‌లు ఇద్దరు ఆర్‌సీబీ ప్రధాన కోచ్ డానియల్ వెటోరీ నేతృత్వంలోనే పని చేయనున్నారు. ఇదివరకు జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న వుడ్‌విల్.. బ్యాటింగ్ నైపుణ్యాభివృద్ధి, విశ్లేషకుడిగా.. ఫీల్డింగ్ కోచ్‌గా కొత్త బాధ్యతలు నెరవేర్చనున్నాడు.



విజయ రహస్యం!

సఫారీ టూర్‌లో లోయర్ ఆర్డర్ బ్యాటింగ్ కీలకం

సుమారు మూడు దశాబ్దాలుగా దక్షిణాఫ్రికా గడ్డపై టీమ్ ఇండియాకు టెస్టు సిరీస్ విజయం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. 1992లో మహ్మద్ అజారుద్దీన్ సారథ్యంలో తొలిసారి సఫారీకి వెళ్లగా..మూడు టెస్టులు డ్రా చేసుకున్నా, ఓ టెస్టు పరాజయం సిరీస్ కోల్పోయేలా చేసింది. 1996లో సచిన్ కెప్టెన్సీలోనూ 0-2తో పరాభవం తప్పలేదు. ఇదే ఫలితం 2001లోనూ ఎదురైంది. కానీ రాహుల్ ద్రవిడ్ తొలిసారి 2006లో సఫారీ గడ్డపై ఓ టెస్టు మ్యాచ్ గెలుపు రుచి చూపించాడు. కానీ సిరీస్‌ను 1-2తో కోల్పోయాడు. 2010లో ఎం.ఎస్ ధోని సైతం ఓ విజయంతో సిరీస్‌కు దగ్గరయ్యాడు. కానీ సిరీస్‌ను సఫారీలకూ విడువలేదు. 1-1తో సమవుజ్జీగా, ఎంతో గౌరవంగా స్వదేశానికి వచ్చారు. 2013-14లో ధోనిసేన ఓ టెస్టులో ఓడి సిరీస్ అప్పగించి వచ్చేసింది. ఇంత సుదీర్ఘ ప్రస్థానంలో భారత్‌కు మిగిలింది రెండు విజయాల ఆనందమే!. కానీ ఇన్నేండ్ల చరిత్ర ఒకటి, ఇప్పుడొకటి అంటూ వచ్చిన విరాట్ కోహ్లి.. అగ్రజట్టు హోదాలో సఫారీ గడ్డపై తొలి సిరీస్ వేటకు బయల్దేరాడు. దిగ్గజాలకు సాధ్యం కాని రికార్డులెన్నో అలవోకగా ఒడిసిపట్టిన కోహ్లి ఇప్పుడూ దక్షిణాఫ్రికా విషయంలోనూ అదే చేసేందుకు సై అంటున్నాడు. జనవరి 5 నుంచి దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్టు ఆరంభం.



శ్రీనివాస్ దాస్ మంతటి

డిసెంబర్ 2014, ఆడిలైడ్ టెస్టు. ఆస్ట్రేలియా ఓవర్‌నైట్ డిక్లరేషన్‌తో ఆఖరి రోజు భారత్ 364 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగింది. కెప్టెన్ కోహ్లి, ఓపెనర్ విజయ్ విజయం కోసమే ఆడారు. సెషన్ల పాటు ఆట సాగుతోంది. అసాధ్యమనుకున్న టార్గెట్.. ఇంకెంతో దూరంలో లేదు అనిపించసాగింది. ఈ తరుణంలో విజయ్ 99 పరుగుల వద్ద అవుటయ్యాడు. అప్పటికీ టీమ్ ఇండియా మరో 122 పరుగులు చేస్తే సరిపోతుంది. చేతిలో ఇంకో 8 వికెట్లు. విజయ్ వికెట్‌తో పతనం మొదలైందా అన్నట్టు కోహ్లి మరో ఎండ్‌లో మౌనంగా మిగిలిపోగా.. ఈ ఎండ్‌లో వికెట్లు కూలసాగాయి. వృద్ధిమాన్ సాహా దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేదు. భారత ఆఖరి ఐదు వికెట్లు కలిపి చేసింది 38 పరుగులే. ఫలితంగా 48 పరుగుల తేడాతో టీమ్ ఇండియా పరాజయం.

11 నెలల తర్వాత, వేదిక భారత్‌కు మారింది. భారత్‌లో చలి మొదలైంది. వాంఖడే వన్డేలో సఫారీలకు మనోళ్లు ఏకంగా 438 పరుగులు సమర్పించుకున్నారు. వన్డే సిరీస్‌లో ఓటమి. జట్టులో సన్నగిల్లిన ఆత్మవిశ్వాసం. సొంతగడ్డపై కెప్టెన్‌గా తొలి సిరీస్ సవాల్ కోహ్లి ముందుంది. మొహాలీలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు. టాస్ నెగ్గిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. విజయ్ (75), పుజారా (31) రాణించటంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగుతుంది. కానీ ఇంతలోనే 102/5తో పతనావస్థలో కోహ్లిసేన. లోయర్ ఆర్డర్‌లో రవీంద్ర జడేజా (38), అశ్విన్ (20) పరుగులకు తోడు ఆఖరి ఐదు వికెట్లకు భారత్ 99 పరుగులు జోడించింది. ఇదే సమయంలో దక్షిణాఫ్రికా ఆఖరి ఐదు వికెట్లకు 77 పరుగులు చేయగల్గింది. లోయర్ ఆర్డర్ బ్యాటింగ్ సాయంతో భారత్‌కు దక్కింది 17 పరుగుల ఆధిక్యమే. కానీ ఈ చిన్న సాయమే మొహాలీలో టీమ్ ఇండియా పైచేయి సాధించేలా చేసింది. ఈ తోక సాయమే టెస్టు సిరీస్‌నూ, తద్వారా ప్రపంచ నెం.1గా ఎదిగేలా చేయగల్గింది. గత రెండేండ్లలో కోహ్లిసేన జైత్రయాత్రకు మొహాలీ టెస్టు మరపురాని విజయం మాత్రమే కాదు ఓ మైలురాయి. జట్టు ఆలోచనలకు, జట్టు దూకుడుతత్వానికి దిక్సూచిగా నిలిచిన లోయర్ ఆర్డర్ బ్యాటింగ్ మెరుపులు గణాంకాల పరంగా స్వల్పమే కావొచ్చు కానీ ప్రభావం అసమానం. ఐదు రోజుల ఆటలో ఒకట్రెండు వికెట్లు, ఒకరిద్దరి ప్రదర్శనలు విజయానికి సరిపోవు. కానీ ఐదారు ఓవర్ల ఓ భీకర స్పెల్, 15 నిమిషాల పాటు అదనంగా చేసే పోరాటం గెలుపోటములను తీవ్రంగా ప్రభావం చేయగలవు. గత రెండున్నర ఏండ్లలో లోయర్ ఆర్డర్ సహకారంతో టీమ్ ఇండియా ఎన్నో మధుర విజయాలు సాధించింది. అది దక్షిణాఫ్రికాతో నాగ్‌పూర్, వెస్టిండీస్‌తో గ్రాస్‌ఐలెట్, న్యూజిలాండ్‌తో కాన్పూర్, కోల్‌కత లేదా ఇంగ్లాండ్‌తో రాజ్‌కోట్, మొహాలీలో, ఆఖరుగా ఆస్ట్రేలియాతో ధర్మశాలతో అయితేనేమీ రెండు జట్ల గెలుపోటములకు ప్రధాన వ్యత్యాసం ఆఖరి ఐదుగురి ప్రదర్శన.

ఆఖర్లో మనమే అత్యుత్తమం

2013 జులై-2015 ఆరంభం వరకూ టీమ్ ఇండియా విదేశీ పర్యటనల్లో భాగంగా 13 టెస్టుల్లో పాల్గొన్నది. ఈ సమయంలో టీమ్ ఇండియా ఆఖరి ఐదు వికెట్ల భాగస్వామ్యాల సగటు కేవలం 22.65 మాత్రమే. వెస్టిండీస్, జింబాబ్వే, బంగ్లాదేశ్‌ల కంటే కాస్త మెరుగు!. కానీ 2015 మొహాలీ టెస్టు నుంచి ఆఖరి ఐదు వికెట్ల ప్రదర్శనల సగటులో ప్రపంచంలోనే టీమ్ ఇండియా అత్యుత్తమం. 33.18 సగటుతో భారత్ ఆఖర్లో ఏకంగా 8 సెంచరీలు, 21 అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు నమోదు చేసింది. మొహాలీ టెస్టు తర్వాతి నుంచి భారత ఇన్నింగ్స్‌లో లోయర్ ఆర్డర్ వాటా సుమారుగా 166 పరుగులు. విచిత్రంగా 2013-2015 సమయంలోని 13 విదేశీ టెస్టుల్లో టీమ్ ఇండియా గెలుపొందిన ఏకైక టెస్టులోనూ లోయర్ ఆర్డర్ ప్రద్శరనే కీలకం. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ టెస్టులో జడేజా (68), భువనేశ్వర్ కుమార్ (52) మెరవటంతో 95 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది. ఇదే సమయంలో ప్రత్యర్థి జట్టులోని ఆఖరి ఐదు వికెట్లకు ఇచ్చుకున్న పరుగుల విషయంలో టీమ్ ఇండియాదే అత్యల్పం. 19.18 సగటుతో (2013-15లో ఇది 44.56తో అత్యధికం) ప్రత్యర్థి తోక కత్తిరించటంలో కోహ్లిసేన టాప్‌గా నిలిచింది.

నెం.1 ప్రస్థానంలో ఆఖరి మెరుపుల పాత్ర అమోఘం

ఇప్పుడేంటి?

టీమ్ ఇండియా టెస్టుల్లో నిలకడగా 6, 7, 8 స్థానాల్లో అశ్విన్, సాహా, జడేజాలు ఆడుతున్నారు. టీమ్ ఇండియా తోక మెరుపుల్లో వీరిదే సింహభాగం వాటా. వీరి బ్యాటింగ్ నైపుణ్యం కారణంగా భారత్ మరో స్పెషలిస్ట్ బౌలర్‌తో ఆడే వెసులుబాటు సైతం దక్కింది. ఇక దక్షిణాఫ్రికాను వారి దేశంలోనే ఓడించిన తాజా జట్టు ఇంగ్లాండ్. ఇంగ్లీష్ శిబిరం సైతం టెయిలెండర్లపై ప్రత్యేక దృష్టి నిలిపింది. వారికి 6, 7, 8 స్థానాల్లో బెన్ స్టోక్స్, జానీ బెయిర్‌స్టో, మోయిన్ అలీలు ఆడారు. ఆఖర్లో కనీసం ఇద్దరు స్పెషలిస్ట్ ఆల్‌రౌండర్లు లేకుంటే సఫారీ పరిస్థితుల్లో నిలవటం కష్టం. మన లోయర్ మెరుపులు సఫారీ పరిస్థితుల్లో నిలబడగల్గితే.. సంతోషమే. ఇక్కడి పిచ్‌లు మన స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌కే పెను సవాల్‌గా నిలిస్తే.. లోయర్ ఆర్డర్ ఇబ్బంది పడకుండా ఉంటుందా? అనే ప్రశ్న ఉదయిస్తోంది!. ఫ్రంట్ ఫుట్ బ్యాటింగ్ శైలి ఇక్కడి పరిస్థితులకు అనుకూలం. ఈ శైలితో హార్దిక్ పాండ్య, వృద్ధిమాన్ సాహా భారత్‌కు ఉన్నారు. అయితే ఆరో స్థానంలో ఆడే ఆటగాడి కోసం రోహిత్ శర్మ, పాండ్య పోటీపడుతున్నారు. మ్యాచ్ వ్యూహం, పిచ్ స్వభావాన్ని బట్టి నిర్ణయం మారుతుండవచ్చు. కానీ ఈ స్థానంలో నిలకడగా పరుగులు చేయటం అత్యంత కీలకం. ఇక స్పిన్‌కు అనుకూలించని పిచ్‌లపై అశ్విన్, జడేజాలు ఇద్దరూ ఆడలేకపోవచ్చు. కానీ ఇద్దరిలో ఎవరికి అవకాశం దక్కకపోయినా, సుమారుగా ఈ సీజన్ సాంతం ఎదురుచూపులు తప్పకపోవచ్చు. అశ్విన్ ఇక్కడి పిచ్‌లపై బ్యాట్స్‌మెన్‌గా రాణించగలడు కానీ ఫీల్డర్‌గా జడేజా అధికంగా మార్కులు కొట్టేస్తున్నాడు. తుది జట్టు సమీకరణం ఏ విధంగా ఉన్నప్పటికీ సఫారీ గడ్డపై టీమ్ ఇండియా తొలి సిరీస్ విజయం సాధించడానికి ఆఖర్లో 6, 7, 8 స్థానాల్లోని ఆటగాళ్ల ప్రదర్శన కీలకం. టాప్ ఆర్డర్ సింహభాగం మెరుపులు, బౌలింగ్ బృందం వికెట్ల లేకుండా కేవలం లోయర్ ఆర్డర్ విన్యాసాలు ఎందుకూ సరిపోవు. కానీ ఆ రెండూ ఉండి, ఇక్కడ విఫలమైతే మ్యాచ్‌తో పాటు సిరీస్ సైతం గల్లంతవటం ఖాయం.

భారత్, దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్

తేది	మ్యాచ్	వేదిక
జనవరి 5-9	తొలి టెస్టు	కేప్‌టౌన్
జనవరి 13-17	రెండో టెస్టు	సెంచూరియన్
జనవరి 24-28	మూడో టెస్టు	జోహన్నస్‌బర్గ్



తెలంగాణ అమ్మాయిల జోరు

హైదరాబాద్ : 65వ సీనియర్ జాతీయ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ మహిళల జట్టు సత్తా చాటింది. గచ్చిబౌలిలోని జి.ఎమ్.సీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన హోరాహోరీ పోరులో అస్సాం జట్టును 44-40తో ఓడించింది. ఉత్కంఠ భరితంగా సాగిన పురుషుల కబడ్డీ పోరులో ఆంధ్ర ప్రదేశ్ జట్టు 44-43తో చత్తీస్‌ఘడ్‌పై గెలుపొందింది.

యుకీ శుభారంభం

- అర్జున్ కాదేపై 2-0తో గెలుపు

పుణె : మహారాష్ట్ర ఓపెన్‌లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చిన యుకీ బాంబ్రీ తొలి పోరులో రాణించాడు. సహచర ఆటగాడు అర్జున్ కదేపై 6-3, 6-4తో వరుస సెట్లలో గెలుపొందాడు. తొలి సెట్‌ను సునాయసంగా నెగ్గిన యుకీ రెండో సెట్‌లో నెమ్మదించగా 2-2, 3-3తో అర్జున్ పోటీలో నిలిచాడు. అయితే ఆఖర్లో చెలరేగిన యుకీ 6-4తో గెలిచి ప్రీ క్వార్టర్స్ బరిలో నిలిచాడు. అర్హత మ్యాచులు నెగ్గి ప్రధాన టోర్నీలో అడుగు పెట్టిన సుమీత్ నాగల్.. ఇల్యా ఇవష్కా (బెలారస్) చేతిలో 3-6, 3-6తో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

మేటి జట్లపై మెరుగ్గా ఆడాలి

- మహిళల హాకీ కోచ్ హరేంద్ర

న్యూఢిల్లీ : ఈ ఏడాది అగ్ర జట్లపై మెరుగైన ప్రదర్శన చేయటమే తమ లక్ష్యమని మహిళల హాకీ కోచ్ హరేంద్ర సింగ్ అన్నాడు. రెండు వారాల విరామానంతరం 33 మంది సభ్యుల జట్టు బుధవారం నుంచి బెంగళూరులో జరుగనున్న జాతీయ శిక్షణా శిబిరంలో పాల్గొనన్నుది. ఈ నేపథ్యంలో హరేంద్ర మాట్లాడుతూ.. 'గతేడాది ఫలితాలు సంతృప్తికరం. ఏడాదిని కెరీర్ ఉత్తమ 10వ ర్యాంకుతో ముగించాం. ఈ ఏడాది కీలకం. కొత్త సీజన్‌లో అగ్ర శ్రేణి జట్లపై మెరుగ్గా ఆడటమే ప్రధాన లక్ష్యం.' అన్నాడు. గత శిక్షణా శిబిరంలో మాదిరిగానే ఈ సారి కూడా ఫిట్‌నెస్, నైపుణ్యాల పదునుపై దృష్టి పెట్టనున్నట్టు హరేంద్ర తెలిపాడు. 21 రోజుల శిక్షణా శిబిరం జనవరి 24న ముగుస్తుంది.



కశ్యప్ పోరాటం

పీబీఎల్ పోరులో అహ్మదాబాద్‌పై 4-3తో అవాధె విజయం

లక్నో : సైనా నెహ్వాల్ సారథ్యంలోని అవాధె వారియర్స్ పీబీఎల్ పోరులో వరుసగా మూడో విజయం నమోదు చేసింది. మంగళవారం జరిగిన ఉత్కంట పీబీఎల్ పోరులో 4-3తో అహ్మదాబాద్ స్మాష్‌మాస్టర్స్‌పై గెలిచింది. ప్రత్యర్థి ట్రంప్ మ్యాచ్‌లో సైనా నెహ్వాల్ నిరాశపరచినా, కిదాంబి శ్రీకాంత్ వరుస సెట్లలో ఓడినా.. పారుపల్లి కశ్యప్ ఒంటి చేతి పోరాటంతో అవాధెను అజేయంగా నిలిపాడు. మిక్స్‌డ్ డబుల్స్ విజయంతో 1-0 శుభారంభం చేసిన అవాధె.. కశ్యప్ పురుషుల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో ఎస్ వర్మను 11-15, 15-13, 15-14 ఓడించటంతో 3-0 ఆధిక్యంలో నిలిచింది. కిదాంబి, సైనాల పరాజయంతో 3-3తో అహ్మదాబాద్ పోటీలోకొచ్చింది. పురుషుల డబుల్స్ నిర్ణాయక పోరుగా మారిన వేళ టంగ్ చున్‌మన్, హెంద్రా సెతియవాన్‌ల జంట 15-14, 15-10తో అహ్మదాబాద్‌కు చెందిన నందగోపాల్ జోడీని ఓడించటంతో 4-3 విజయం అవాధె సొంతమైంది.




మరియా షరపోవా

షెన్‌జెన్ ఓపెన్

క్వార్టర్స్‌లో షరపోవా

ప్రీ క్వార్టర్స్‌లో అలిసన్ రిస్కేపై 2-1తో విజయం

షెన్‌జెన్ (చైనా) : ఐదు సార్లు గ్రాండ్ స్లామ్ చాంపియన్ మరియా షరపోవా సీజన్ తొలి టోర్నీలో దూసుకుపోతున్నది. షెన్‌జెన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్స్ చేరుకున్నది మంగళవారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో అమెరికా క్రీడాకారిణి అలిసన్ రిస్కేను 2-1తో ఓడించింది. తొలి సెట్‌లో గెలిచిన అలిసన్ మాజీ నెంబర్ వన్ షరపోవాపై షెన్‌జెన్‌లో తొలి విజయం నమోదు చేసేలా కనిపించింది. అయితే, 3-6తో తొలి గేమ్‌లో తడబడిన రష్యా సుందరి షరపోవా రెండో గేమ్ 6-4తో గెలుపొందింది. ఇక నిర్ణాయక తుది సెట్‌ను 6-2తో అలవోకగా నెగ్గి క్వార్టర్స్‌లో కాలుమోపింది. రెండున్నర గంటలు సాగిన హోరాహోరీ సమరంలో 34 విన్నర్లు సహా 11 ఏస్‌లు సంధించింది. సెమీస్‌లో స్థానం కోసం జరినా దియాస్ (కజకిస్థాన్)తో రేపు అమీతుమీ తేల్చుకోనున్నది. మరో ప్రీ క్వార్టర్స్ మ్యాచ్‌లో రెండో సీడ్ జెలెనా ఒస్టాపెంకో (లాట్వియా) 1-6, 4-6తో చెక్ రిపబ్లిక్ చిన్నది క్రిస్టినా ప్లిస్కోవా చేతిలో ఓడింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

కాలంతో పాటు మారిన పరిస్థితులను ఇతివృత్తాలుగా తీసుకుంటూ.. సాహిత్యం సమాజహితానికి కూడా దోహదపడాలంటూ రచనావ్యాసాంగాన్ని కొనసాగిస్తున్నా రచయితల్లో నండూరి సుందరీ నాగమణి ఒకరు. చిన్నతనం నుంచి సాహిత్యంతో పరిచయం ఆమెలో భావవ్యక్తీకరణకు పదమైన పదాలను అందించింది. మనుషుల మధ్య బంధాలను, సమాజంలోని పరిస్థితులను వాస్తవికదృష్టితో పరిశీలించి మనసుకు హత్తుకునేలా అక్షరరూపం ఇవ్వడంలో ఆమెది ప్రత్యేకశైలి. ఉద్యోగిగా, రచయితగానే కాదు.. తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించే మహత్తర బాధ్యతను తీసుకున్న ఆమె అంతరగం మానవితో...

అడ్డంకులను అధిగమించిన ధీశాలి

సావిత్రిబాయి పూలే... సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మింది. అందుకే బాలికల కోసం మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించింది. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తన సామాజిక బాధ్యతగా విశ్వసించింది. తన సహచరుడితో కలిసి నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసింది.




WOMEN of the day



ఆమె మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న రైతు కుటుంబంలో జన్మించింది. తన 9వ యేట 12 యేండ్ల జ్యోతిరావు ఫూలెను 1840లో వివాహమాడారు. పిల్లలు కలగకపోవడంతో ఆ జంట యశ్వంతరావు (బ్రాహ్మణ వితంతువు కుమారుడు) ను దత్తత తీసుకున్నారు. భర్త ప్రోత్సాహంతో ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించారు. ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయసు 18 ఏండ్లు మాత్రమే. ఆ దంపతులు వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే సావిత్రి ఆధిపత్య కులాల నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలోనే 1849లో సావిత్రీబాయి దంపతులను గృహ బహిష్కారానికి గురిచేశారు.

ఎన్ని నిర్భంధాలు ఎదురైనా స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో 'మహిళా సేవామండల్' అనే మహిళా సంఘన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి ఫూలే. బాల్యవివాహలకు, మూడనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేఖంగా, వితంతువు పునర్వివాహల కొరకు అసమాన బ్రాహ్మనిజ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు సావిత్రీబాయి. తరువాత 1873 సెప్టెంబరు 24న స్థాపించబడిన సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. కేవలం సంఘ సంస్కర్తగానే కాదు రచయిత్రిగా కూడా ఆమె వేగుచుక్కగా నిలిచారు. 'కావ్యపూలే', 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్' అనే కవితా సంపుటాలను ప్రచురించారు. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి.

జ్యోతీరావుపూలే1890 నవంబరు 28న మరణించారు. భర్త చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ బాధ్యతని స్వీకరించారు. 1897 లో ప్లేగు వ్యాధి, పూణె నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి మాత్రం కొడుకు యశ్వంత్‌తోకల్సి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో ప్రాణాలు తీసింది. అమ్మాయిల చదువుకోసం విస్తృతంగా కృషిచేసిన సావిత్రి బాయి జయంతి అయిన ఈ రోజును భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం.



అక్షరం.. అందరికీ చేరాలి



ఊహ తెలిసినప్పటి నుండీ అమ్మ చెప్పే కథలు వింటూ పెరిగిన నాకు ఇంటి ఎదురుగా ఉండే చిన్న గ్రంథాలయం బడి తర్వాత బడిగా మారింది. అక్కడకు వచ్చే చిన్నపిల్లల పత్రికల్లోని ఆకర్షణీయమైన బొమ్మలను చూస్తూ.. ఆ బొమ్మలకు సంబంధించిన కథను తెలుసుకోవాలన్న ఆరాటంతో ఒక్కోక్క అక్షరాన్ని కూడబలుక్కొని చదివేదాన్ని. చందమామ, బాలమిత్ర నా అభిమాన పత్రికలు. అమ్మ కమల కథలు బాగా చెప్పేవారు. నాన్న సూరన్న స్కూలు పుస్తకాలు తప్ప మరో పుస్తకాలు చదవనిచ్చేవారు కాదు. సెలవులు వచ్చినప్పుడు మాత్రం కథల పుస్తకాలు చదవడానికి అనుమతినిచ్చేవారు. చాలా పుస్తకాలు కూడా కొనిచ్చేవారు. అమ్మనాన్న ఇద్దరూ సాహిత్యంపై మక్కువ ఉన్నవారే కావడం.. స్కూలులో తెలుగు ఉపాధ్యాయురాలు భాష పట్ల మక్కువ పెరగడానికి ఎంతో తోడ్పడ్డారు. అక్క, తమ్ముడు ఇద్దరూ రచయితలే.

తెలుగు భాషలో చాలామందికి వ్యాకరణం అంటే భయం. అబ్బ...సంధులు, సమాసాలు ఏంటో అర్థం కావు.. అంటుంటారు. తెలుగు భాష నుడికారంలో ఉన్న మాధుర్యం మరే ఇతర భాషలో లేదు. స్కూలులో తడబడకుండా సంధి సూత్రాలు, సమాస విగ్రహ వాక్యాలు చెప్పేదాన్ని. పుస్తకాలు బాగా చదివే అలవాటు కారణంగా కొత్త పదాలు అలవోకగా వచ్చేవి. చిన్నపిల్లల కోసం వచ్చే పాకెట్ నవలలు, సింధుబాద్ సాహసయాత్రలు ఎంతో ఇష్టంగా చదివేదాన్ని.

పదవతరగతి అయిపోయిన తర్వాత సెలవుల్లో శ్రీశ్రీ గారి మహాప్రస్థానం చదివాను. ఇది నన్ను ఎంతో ప్రభావితం చేసింది. ఆ తర్వాత ఏదైన సంఘటన చూసినప్పుడు.. సంతోషం కలిగినప్పుడు వచ్చే భావావేశాలు కవితలుగా రాయడం ఇంటర్‌లో ప్రారంభించాను. కాలేజీ సావనీర్ కోసం ఒక కథ రాయమని అడిగారు. అప్పుడే జరిగిన ఒక సంఘటన నన్ను బాగా కలిచివేసింది. మా కాలేజీ విద్యార్థి ప్రమాదవశాత్తు చనిపోయాడు. ఇదే ఇతివృత్తంతో నేను రాసిన కథ కాలేజీ సావనీర్‌లో ప్రచురించారు. ఏ మాత్రం ఖాళీ సమయం ఉన్నా.. క్లాసు రూంలోనే కూర్చోని కథో.. కవితో రాసేదాన్ని. వాటిని చదివి స్నేహితులు ఎంతో మెచ్చుకునేవారు. ఆ రోజుల్లోనే నేను రాసిన నవలను చదివిన స్నేహితులు భవిష్యత్‌లో మంచి రచయిత అవుతావు అంటూ... రచనల వైపు ప్రోత్సహించారు.



తొలి కథ..

కాలేజీలో లీజర్ పిరియడ్‌లో రాసిన కథలు, కవితలు కేవలం మా స్నేహితుల వరకు మాత్రమే ఇచ్చేదాన్ని. వాటినెప్పుడు ఏ పత్రికలకు పంపించలేదు. ఆ తర్వాత పరిచయమైన ప్రముఖ రచయిత వాలి హిరణ్మయీదేవి ప్రోత్సహంతో 'ఆమని ఆగనం' కథను ఆంధ్రప్రభ వారపత్రికకు పంపించాను. ఆ కథ1991లో ప్రచురించబడింది. 'బొమ్మ కంటి నీరు' కథ వనిత మాస పత్రికలోనూ వచ్చింది. చాలా ఉత్సాహంగా ఎన్నో కథలు రాసినా.. అచ్చుకాలేదు. ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేయడం.. ఆంధ్రబ్యాంక్‌లో ఉద్యోగం రావడం. డిఆర్‌డిఎల్‌లో పనిచేసే నండూరి నాగేశ్వరరావుతో పెండ్లి, బాబు పెంపకం, ఇంటి బాధ్యతలు పెరగడంతో కలం పట్టే అవకాశం రాలేదు.

రెండు దశాబ్దాల తర్వాత..

ఉద్యోగ బాధ్యతలు, ఇంటి పనులలో సతమతమవుతూనే ఎంతో మంది ప్రముఖ రచయితల పుస్తకాలు, కవుల గ్రంథాలు చదివి.. వారు చేసిన సాహితీ సేవను తెలుసుకున్నాను. కలం పట్టే తీరిక లేకపోవడంతో ఎన్నో సంఘటనలు మనసు పొరల్లో నిక్షిప్తమైనవి. బాబు ఇంజనీరింగ్ పూర్తి చేసి విదేశాలకు వెళ్లడం.. నాకు నిజామాబాద్ బదిలీ కావడం రెండు ఒకేసారి జరిగాయి. దాంతో దొరికిన ఖాళీ సమయం మళ్ళీ కలం పట్టేలా ప్రేరేపించింది. మదిమూలల్లో దాగిన సంఘటనలు ఒక్కక్కటిగా గుర్తుకు తెచ్చుకుంటూ కథలు రాయడం ప్రారంభించాను. అలా దాదాపు 19 ఏండ్ల తర్వాత నేను నా రాసిన 'సుపుత్రుడు' కథ నది మాసపత్రిక వారు నిర్వహించిన మంచి కథల పోటీల్లో ఎన్నిక కావడంతో నూతనోత్తేజం వచ్చింది. దాంతో సాహిత్యవనంలో నాకు నచ్చిన కొన్ని కథా కుసుమాలను వెదజల్లే ప్రయత్నం చేశాను. ఇప్పటి వరకు దాదాపు 80 కథలు రాశాను. ఇవి 'అమూల్యం', 'నీవు కడలివైతే' కథాసంపుటాలుగా వచ్చాయి. నేను రాసిన 'మాధుర్యం' నవల స్వాతి మాస పత్రికలో స్వాతిముత్యం పేరుతో వచ్చింది. రెండో నవల 'తరలిరావే ప్రభాతమా' ఆంధ్రభూమి మాసపత్రికలో ధారావాహికగా వెలువడింది. మూడో నవల 'అతులిత బంధం' వెబ్ వార పత్రిలో సీరియల్‌గా వచ్చింది.

సంగీతంలోనూ..

రచనావ్యాసంగంతో పాటు సంగీతం అంటే కూడా నాకు చాలా ఇష్టం. ప్రముఖ గురువు చంద్రశేఖర్ మాస్టారు వద్ద 15సంవత్సరాలు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. తెలుగు విశ్వవిద్యాలయం లో లలిత సంగీతంలో డిప్లొమా పూర్తి చేశాను.

పదాలతో పందిరి..

చిన్నతనం నుంచి ఎక్కువగా పుస్తకాలు చదవడంతో కొత్తకొత్త పదాలను తెలుసుకునే వీలు కలిగింది. వ్యాకరణంపై మక్కువతో పదాల ప్రయోగం అంటే ఆసక్తి. తెలుగు పదాలతో పజిల్స్ తయారు చేయడం మరీ ఇష్టం. కౌముది వెబ్ మ్యాగజైన్ కోసం నాలుగేండ్లు పదాల పందిరి శీర్షికతో పజిల్స్ నిర్వహించాను. కథలు, నవలలే కాకుండా చందస్సుతో కూడిన పద్యాలు, వచన కవిత్వం రాయడం ఎంతో ఇష్టం.



తలసేమియాపై అవగాహన కల్పిస్తూ..

సాహిత్యం సమాజ హితం కోసం ఉపయోగపడేలా ఉండాలి అన్నది నా అభిమతం. నా ప్రతికథలో నేను తీసుకునే ఇతివృత్తం సమాహహితాన్ని కోరేలా ఉంటుంది. చాలా అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలిన బాధ్యత రచయితలపై ఉందని నేను భావిస్తాను. ఈ ఆలోచనతోనే 'మలగని దీపాలు' కథలో తలసేమియా వ్యాధి ఇతివృత్తంగా తీసుకున్నాను. నేను రాసే పుస్తకాలపై వచ్చిన డబ్బులకు కూడా తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం 'మా ఆసరా' సంస్థ ద్వారా ఖర్చు చేస్తుంటాం.

చిన్న గ్రంథాలయాలకు ఉచితంగా..

పుస్తకాలు కొని చదవడం అనేది కొద్ది మంది మాత్రమే చేయగలుగుతారు. చదవాలన్న తపన ఉన్నా.. పుస్తకాలు కొనే శక్తి లేనివారికి గ్రంథాలయాలే మంచి నెలవులు. అందుకే నా పుస్తకాలను గ్రామాల్లో ఉన్న చిన్న గ్రంథాలయాలు ఉచితంగా ఇస్తుంటాను. అక్షరం.. సమాజాన్ని మార్చే ఆయుధం. సామాజికరుగ్మతల పై అవగాహన కల్పించే అవకాశం. అందుకే సమాజహితాన్ని ఆకాంక్షిస్తూ.. నేను రాసిన ప్రతి అక్షరం అందరికీ చేరాలి అన్న తపనతో పుస్తకాలు గ్రంథాలయాలకు ఉచితంగా ఇస్తుంటాను. రాయడంలో తృప్తి ఉంది. ఆ రాతలు కొందిరిలోనైనా మార్పు తీసుకు వస్తే.. అంతకన్నా ఇంకేం కావాలి.

వి. యశోద


ఎల్‌సి లక్ష్మీ
అంకుషాపూర్
ఘట్‌కేసర్.

21 చుక్కలు
11 వరకు మధ్య
చుక్క వచ్చేవరకు

ఇట్ల చేద్దాం

టమాట పై పొరను తీసేసి మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్‌లా చేయాలి. దానికి కొంచెం మెత్తటి ఉప్పను చేర్చి స్టౌ మీద పడ్డ మొండి మరకలపై రాసి కొద్దిగా సేపటి తర్వాత పొడిబట్టతో తుడిచేస్తే మరకలు తొలగిపోతాయి.

ముద్ది కొండ శ్యామల
కాచీగూడ
హైదరాబాద్



16 చుక్కలు
2 వరసలు
2 వచ్చేవరకు



ముత్యాల ముగ్గులు

ఓ తెల్ల కాగితంపై ముగ్గు వేసి, చక్కటి రంగులతో నింపి మాకు పంపండి. ముగ్గు వేసే విధానం అర్థమయ్యేలా ఉండాలి. ముగ్గులోని చుక్కల సంఖ్య, ఇతర వివరాలను కూడా చేర్చండి. మీ పేరు, చిరునామాతో పాటు మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో కూడా జతచేయండి.

మా చిరునామా

మానవి,నవతెలంగాణదినపత్రిక, ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్, హైదరాబాద్-20. ఇ-మెయిల్: navamaanavi@gmail.com

చిరుతిళ్లు మాన్పించండి!

స్వీట్స్, మసాలా వేపుళ్లు, ఉప్పు పదార్థాల రుచికి అలవాటు పడితే వదిలిపెట్టరు నేటి తరం పిల్లలు. అలాంటి సమయంలో క్రమంగా చిరుతిళ్లను మాన్పించడం మంచిదని చెబుతున్నారు నిపుణులు. ఎలా మాన్పించాలో తెలుసుకుందాం!

- ఉదయం స్కూల్ కు వెళ్లే ముందు సమయం ఉండక చాలామంది తల్లిదండ్రులు స్నాక్స్‌ను పెడతారు. ఇది మంచిదే కానీ ఇంట్లో చేసినవైతే సరే! బయటి వేపుళ్లను పెట్టడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి.



- ఉదయం స్నాక్స్‌గా బాదం, జీడి పప్పు, ఉడికించిన కోడి గుడ్లు, పండ్ల ముక్కలు పెడితే ఆరోగ్యానికి చాలా మంచిది.
- ఇంటి బయటకు వెళ్లితే రోడ్డు మీద కనిపించే పానిపూరీ, జంక్‌ఫుడ్, కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్ ఇలా ఇష్టమొచ్చిన పదార్థాలను ఇప్పించమని మారం చేస్తారు. ఆ సమయంలో వారిని నెమ్మదిగా ఒప్పించండి. ఆ పదార్థాలు తింటే కలిగే ప్రమాదాలను వివరించండి.
- ప్లాస్టిక్ కవర్లలో ఎక్కువ కాలం నిల్వ ఉంచిన పదార్థాలు ఇప్పించవచ్చు. ఉదాహరణకు: చిప్స్, వాటర్ ప్యాకెట్స్ వంటివి. వీటి వల్ల పిల్లలు బలహీనంగా తయారవుతారు.
- పోషకాలు అధికంగా ఉన్న పదార్థాలను ఒకే సారి తినిపించకుండా... నెమ్మదిగా అలవాటు చేయడం మంచిది.
- పిల్లలు ఆకుకూరలు, పండ్లు తినడానికి ఎక్కువగా ఇష్టపడరు. ఆ సమయంలో వారికి ఇష్టమైన విధంగా వండి పెడితే సరిపోతుంది. పండ్ల రసాలు, ఆకుకూరతో చేసిన పకోడిలు చేసి పెడితే పిల్లలు ఇష్టంగా తింటారు.



మంగళవారం రాత్రి విజయవాడలో కనిపించిన సూపర్ మూన్

అమరావతికి రూ.3,324 కోట్ల రుణం..

- ప్రపంచ బ్యాంకు పరిశీలనలో ఉందన్న జైట్లీ

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నుంచి రూ.3,324 కోట్ల మేర రుణం రానున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో ప్రకటించారు. ఈ రుణం ఇచ్చే అంశం ప్రపంచ బ్యాంకు పరిశీలనలో ఉందని ఆయన చెప్పారు. మంగళవారం రాజ్యసభలో అమరావతి నిర్మాణానికి నిధుల కేటాయింపుపై ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జైట్లీ సమాధామిస్తూ, రాజధాని నిర్మాణానికి రూ.3324 కోట్లు కావాలని ఏపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకును కోరిందన్నారు. ఈ అంశం ప్రపంచ బ్యాంకు పరిశీలిస్తోందన్నారు. రుణం మంజూరు విషయంలో ప్రపంచ బ్యాంకు ప్రారంభించిన అధ్యయనం, మదింపు ప్రాథమిక దశలో ఉన్నాయని, ప్రాజెక్టు మదింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత రుణానికి సంబంధించిన సంప్రదింపులు ప్రారంభమవుతాయని, ఈ సంప్రదింపుల ప్రక్రియ పూర్తయ్యాకనే రుణాన్ని మంజూరు చేస్తుందని ఆయన చెప్పారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం జనరల్ కేటగిరీ రాష్ట్రాలు ప్రపంచ బ్యాంకు వంటి బహుముఖ ఆర్థిక సంస్థల నుంచి పొందే ఆర్థిక సహాయం మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 70 శాతం మించకూడదన్నారు.

మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుంచే సమకూర్చుకోవలసి ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత జరిగే ఖర్చును రుణంలో భాగంగా ప్రపంచ బ్యాంకు నియమిత కాలపరిమితి ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తూ వస్తుందని వివరించారు. ప్రపంచ బ్యాంకు రుణం ఇంకా ఆమోదం పొందనందున ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధులు, వాటి వినిమయ పత్రాల సమర్పణ ప్రసక్తే లేదని మరో ప్రశ్నకు జైట్లీ సమాధానమిచ్చారు.

కళలకు చావు లేదు

ప్రజా నాట్యమండలి రాష్ట్ర మహాసభలో ఎల్‌బి శ్రీరాం, మాదాల రవి

- ప్రారంభమైన బళ్లారి రాఘవ ప్రజా సాంస్కృతిక ఉత్సవాలు

అనంతపురం : సమాజాన్ని జాగృతి చేసి వారిలో చైతన్యాన్ని నింపడంలో ముందు నుంచి ప్రజానాట్యమండలి చేస్తున్న కృషి అభినందనీయమని సినీ నటులు ఎల్‌బి.శ్రీరాం, మాదాల రవి పేర్కొన్నారు. కళలకు చావు లేదన్నారు. బళ్లారి రాఘవ ప్రజా సాంస్కృతిక ఉత్సవాల పేరుతో ప్రజానాట్యమండలి 9వ రాష్ట్ర మహాసభలు అనంతపురం నగరంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. లలిత కళా పరిషత్‌లో నిర్వహించిన ప్రారంభ సభకు అనంతపురం జిల్లాలోని ప్రముఖులు, సాహితీవేత్తలు, కళాకారులు పెద్దఎత్తున హాజరయ్యారు.

డప్పు కళాకారుల నృత్యాలు, చెక్కభజనలు, కోలాటాలతో ప్రదర్శన చేశారు. ప్రదర్శన నగరంలోని గీతా మందిరం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్‌క్లాక్ నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు సాగింది. అనంతరం జరిగిన బహిరంగ సభకు సినీ నటులు ఎల్‌బి.శ్రీరాం, మాదాల రవిలు ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఎల్‌బి.శ్రీరాం మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసే క్రమంలోనే కళలు పుట్టుకొచ్చాయని చెప్పారు. నేడు సినిమాల్లో చూపినట్టు ఒక్కరే హీరో కాకుండా ఈ కళల్లో అందరూ హీరోలేనని చెప్పారు. సమాజంలో జరుగుతున్న చెడును ఎత్తి చూపడంలో ఇవి ఎంతో కీలకంగా పనిచేస్తాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కళలకు విస్తృత ప్రచారం పొందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. మాదాల రవి మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రాచీన కళలు దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా సామ్యవాద శక్తులన్నీ ఏకమై పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. అంతకు ముందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి చంద్రానాయక్ పాల్గొని సౌహార్ద్ర సందేశాన్ని ఇచ్చారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన ప్రజలు అనేక సమస్యల్లోనున్నారన్నారు. వారిని జాగృతి చేసి పోరాటా మార్గంలో నడిపించేందుకు ప్రజాకళలు ఎంతగానో దోహదం చేస్తాయని వివరించారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన సముదాయ్ ప్రధాన కార్యదర్శి దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ నేడు మతతత్వశక్తులు పెచ్చరిల్లుతున్న క్రమంలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛమీద దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా అందరినీ ఏకం చేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సినీ నటులు ఎల్‌బి.శ్రీరాం



ప్రారంభోత్సవ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు

ఆకట్టుకున్న ప్రదర్శనలు...

బళ్లారి రాఘవ సాంస్కృతిక ఉత్సవాల సందర్భంగా సాయంత్రం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజానాట్యమండలి నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా 'సైరా బళ్లారి' అంటూ ఉభయ గోదావరి జిల్లాల కళాకారులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ఆ తరువాత విశాఖపట్నం వారు ప్రదర్శించిన వేమన నృత్యరూపకం ఆలోచింపజేసే విధంగా సాగింది. వేమన చెప్పిన పద్యాలను నృత్యరూపంలో ప్రదర్శించారు. ఆ తరువాత శ్రీకాకుళం కళాకారుల తప్పెటగూళ్లు, 'ఓభార్య, ఓభర్త, ఇంకో అది', గోగ్రహణం నాటికలు అందరినీ ఆలోచింప చేసేవిగా కొనసాగాయి.



పంచాయతీలకు రేటింగ్

- ప్రతి ఒక్కరికీ డిజిటల్ లాకర్ ఏర్పాటు చేస్తాం : దర్శి 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

ఒంగోలు : 'రానున్న కాలంలో పంచాయతీల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం, ఆ సౌకర్యాల ఆధారంగా 'స్టార్' గుర్తులిస్తాం. అప్పుడు మీ ఊరి పరిస్థితి ఏమిటో తెలుస్తుంది. ప్రతి ఇంటికీ ఫైబర్ కనెక్షన్‌తో నెట్, టీవీ, ఫోను సౌకర్యాలు కల్పించాం. ప్రతి ఒక్కరికీ డిజిటల్ లాకర్‌ను ఏర్పాటు చేస్తాం. వాటి ద్వారా అన్ని రకాల సర్టిఫికెట్లు అందులో భద్రపరుచుకోవచ్చు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. మంగళవారం దర్శిలో ఐదో విడత 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వడ్డీలేని రుణాలను మాఫీ చేసేందుకు రూ.680 కోట్లు కేటాయించామని చెప్పారు. ఇప్పటి వరకు రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశామని, విడతల వారీగా రైతులకు అందజేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 1.42 కోట్ల రేషన్ కార్డులుండగా వీటి ద్వారా 4.05 కోట్ల మందికి బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. కేంద్రం చక్కెర నిలిపేస్తే జనవరి నుంచీ అందరికీ అరకిలో చక్కెర ఇస్తున్నామన్నారు. జన్మభూమిలో 1.50 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. ఇందులో రాజకీయాల్లేవని, పేదవాడికి కార్డులు, పింఛన్లు, ఇండ్లు ఇలా ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నాని చెప్పుకొచ్చారు.

'గవర్నర్ తెలంగాణ పక్షపాతి'

విజయవాడ: తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌పై కేంద్రానికి ఫిర్యాదు చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు, పరిశ్రమలు నెలకొల్పేందుకు చెల్లించే నాలా పన్నును తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఆ భూమికి ఉన్న మార్కెట్ విలువలో ప్రస్తుతం 9 శాతం ఉన్న పన్ను 3 శాతానికి తగ్గించేలా అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపామన్నారు. నెల రోజులవుతున్నా ఆ బిల్లుకు ఇంతవరకు గవర్నర్ ఆమోదం లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఇదే చట్టం రూపంలో తెలంగాణలో అమలవుతోందని, ఆ రాష్ట్రానికి మాత్రం గవర్నర్ వెంటనే ఆమోదించి పంపారని చెప్పారు. గవర్నర్ తెలంగాణ పక్షపాతిగా ఉన్నారని, ఏపీపై ఆయనకు ప్రేమ లేదన్నారు.



బర్దన్‌కు నివాళులర్పిస్తున్న సురవరం, నారాయణ, చాడ తదితరులు

ఉద్యమాన్ని విస్తరించిన నేత

- బర్దన్‌కు సీపీఐ ఘన నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని, కార్మికోద్యమాన్ని విస్తరించటంలో ఎ.బి.బర్దన్ క్రియాశీలక పాత్ర పోషించారని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి చెప్పారు. ఆయన ఆశయాల సాధన కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బర్దన్ రెండో వర్ధంతి సభను మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సురవరం మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో మతోన్మాదం పేట్రేగి పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశ సమైక్యతకు, సమగ్రతకు తీరని భంగం కలిగిస్తుందని హెచ్చరించారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితిని ప్రతిఘటించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నీ ఏకమై, ఐక్య ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల అణచివేతే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం: కేవీపీఎస్



- మతోన్మాదుల దాడికి నిరసనగా దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళితుల అణచివేతే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులు పని చేస్తున్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆందోళన వ్యక్త చేసింది. ఒకవైపు అంబేద్కర్ ఫోటోతో దొంగజపం చేస్తూ.. మరోవైపు ఆయన జాతిని అణచివేసే వ్యూహాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఆచరిస్తున్నదని విమర్శించింది. అంబేద్కర్ ప్రారంభించిన శౌర్య దినాన్ని పురస్కరించుకుని దళితులు, అంబేద్కరిస్టులు నివాళి అర్పించేందుకు కోరెగావ్ వెళ్లిన దళితులపై హిందూ మతోన్మాద శక్తులు దాడిచేశారని తెలిపింది. ఇందుకు నిరసనగా మంగళవారం కేవీపీఎస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టడంతో పాటు హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలో మతోన్మాద శక్తులు దిష్టిబొమ్మను దహనం చేసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ పీష్వాల పాలనలో అణగారిన వర్గాలు, బలహీనవర్గాలు, దళితులు తీవ్ర అణచివేతకు గురయ్యారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక దళితులపై దాడులకు అంతేలేకుండా పోతుందని ఆందో ళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం దశరథ్, ఉపాధ్యక్షులు జి రాములు, ఎం అజయ్‌బాబు, ఎం మహేందర్, ఆర్ సైదులు, ఎన్ సూరన్న, ఎన్ మల్లయ్య, ఆర్ అరుణ జ్యోతి, జి నర్సింహ, జి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా సీఎమ్‌డీగా శ్రీధర్ పేరు ప్రతిపాదన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



కోల్ ఇండియా చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సింగరేణి కాలరీస్ సీఎమ్‌డీ ఎన్.శ్రీధర్ పేరును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ పంపింది. దరఖాస్తుతో పాటు శ్రీధర్ బయోడేటాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ జతపరిచారు. గత పదేండ్లుగా శ్రీధర్‌పై ఎలాంటి అభియోగాలు లేవని లేఖలో తెలిపారు. 1997 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఎన్ శ్రీధర్ ప్రస్తుతం సింగరేణి సీఎండీగా విధులు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే. సింగరేణి సంస్థలో ఆయన అనేక సంస్కరణల్ని విజయవంత ంగా అమలు చేయడంలో కృషి చేశారు. ఈ ప్రాతిపదికనే రాష్ట్రప్రభుత్వం కోల్ ఇండియా సీఎమ్‌డీ నియామకానికి సిఫారసు చేసింది.

మహిళల భద్రతకు సవాల్‌గా నిఘా కెమెరాలు

హోటల్‌గదులు, బాత్రూమ్‌లు, బట్టల షాపుల ట్రయల్ గదులలో స్త్రీల నగ్న దృశ్యాల చిత్రీకరణ

- పెరుగుతున్న స్పై కెమెరాల వాడకం
- వందల సంఖ్యలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అవుతున్న వీడియో ఫుటేజ్‌లు

నవతెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

మహిళల భద్రత కోసం అనేక చర్యలను తీసుకుంటున్నామని ప్రభుత్వ పెద్దలు, పోలీసు ఉన్నతాధికారులు ఎన్ని మాటలు చెబుతున్నా.. స్త్రీల వ్యక్తిగత గౌరవానికి నిఘా కెమెరాలు సవాల్‌గా మారాయి. స్పై కెమెరాల వినియోగం రోజురోజుకూ పెరిగిపోయి ఆందోళనకరస్థితికి చేరుకుంటున్నది. రాష్ట్రంలోనేగాక దేశంలోని అభివృద్ధి చెందుతున్న నగరాలలో రహస్య కెమెరాల కొనుగోళ్లు పెరిగాయి. అయితే, వినియోగదారుల్లో వాటిని దుర్వినియోగం చేసే వారే ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే పరిణామం. ఈ స్పై కెమెరాలను ఉపయోగించి ఇప్పటికే వందల సంఖ్యలో మహిళల నగ్న దృశ్యాలను చిత్రీకరించి సొమ్ము చేసుకుంటున్న కేటుగాళ్లది దొరికితేనే దొంగ అనే నానుడిగా మారింది. ముఖ్యంగా హోటల్ గదులు,బాత్రూమ్‌లు మొదలుకొని బట్టల షోరూమ్‌లలోని దుస్తులు మార్చుకునే ట్రయల్ గదుల వరకూ రహస్య కెమెరాలను వినియోగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. వాటిని కనిపెట్టలేని మహిళలల్లోని చాలా మంది ఈ స్పైకెమెరాలకు చిక్కుతున్నారు. షోరూమ్‌లలో ఖరీదు చేసిన దుస్తులను ట్రయల్ గదులలో మారుస్తూ కంటికి కనిపించకుండా రహస్యంగా అమర్చిన ఈ కెమెరాలలో దృశ్యీకరణకు గురవుతున్నారు.

షోరూమ్‌లు, హోటళ్లు, ప్రైవేటు గెస్ట్‌హౌజ్‌లతోపాటు కొన్ని అపార్ట్‌మెంట్లలో స్పై కెమెరాలను అమర్చి ఆడవాళ్ల జీవితాలతో ఆడుకునేందుకు,బ్లాక్ మెయిల్ చేసేందుకు వక్రబుద్ధులు, బ్రోకర్లు యత్నిస్తున్నారు. దీంతో, ఎక్కడో బట్టలు మారుస్తుండగా చిత్రికరించిన వీడియోలు ఆన్‌లైన్‌లలో తమకు తెలిసినవారికి కనిపించడంతో ఏంచేయాలో తెలియక పరువు పోతుందన్న భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలూ జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ లతోపాటు ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా,ముంబయి,చెన్నై చండీగఢ్,విజయవాడ,వైజాగ్ తదితర నగరాల్లో ఎక్కువగా జరుగుతున్నాయని స్వచ్ఛంద సంస్థల అధ్యయనంలో వెల్లడైంది. అయితే,ఇలాంటి కెమెరాలు,రహస్యబగ్‌లతో మహిళల జీవితాలతో ఆడుకుంటున్న దుర్మార్గులపై తమకు ఫిర్యాదు వస్తేనేగాని చర్యలు తీసుకోలేమని పోలీసు అధికారులు చెబుతున్నారు. కాగా,తాము ఇలాంటి ట్రాప్‌లో చిక్కుకున్నామని బాధితులకు తెలిసేలోగా వారి చిత్రాలు ఆన్‌లైన్‌లో వ్యాపించి పోతున్నాయి. ఒకవేళ తమకు జరిగిన అన్యాయాన్ని వెలుపలికి వచ్చి ఫిర్యాదు చేద్దామంటే అది ప్రచారం జరిగి పరువుపోతుందన్న భయంతో అనేకమంది



బాధితులు మిన్నకుండి పోతున్నారు. ముఖ్యంగా విదేశాల నుంచి భారీ ఎత్తున ఆన్‌లైన్‌లలో కేవలం ఐదు వందల నుంచి మూడు వేల రూపాయలకు ఇలాంటి రహస్య కెమెరాలు దొరుకుతుండటంతో వాటి వాడకం పెరిగిపోయింది. వాటి కొనుగోళ్లపై ఆంక్షలు లేకపోవడంతో వినియోగిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతున్నదని నిపుణులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. కంటికి కనిపించకుండా గోడలు, అద్దాలకు ఫిక్స్ చేస్తున్న ఈ కెమెరాలను కనుక్కోవడం సాధారణ స్త్రీలకు సాధ్యంకాదని వారంటున్నారు. వాటిని కనిపెట్టాలంటే దుస్తులు ఛేంజ్ చేసే ట్రయల్ గదులు, హోటల్ గదులు, బాత్రూమ్‌లలో స్మార్ట్ కెమెరాలలో ఉండే కెమెరా డిటెక్టర్, బగ్ డిటెక్టర్‌లను ఆన్ చేసి ఆ ప్రాంతాన్ని స్కాన్ చేయాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ అక్కడ కెమెరా ఉన్న పక్షంలో స్కాన్ చేస్తున్న సమయంలో చిన్న బల్బు వెలిగి అలర్ట్ చేస్తుందని వారు తెలిపారు. కానీ, ఈ విధంగా ఎంత మంది వద్ద స్మార్ట్ ఫోన్‌లు ఉంటాయి, ఎంత మందికి వాటిని ఆపరేట్ చేయడం తెలుస్తుందని మరి కొందరు ప్రశ్నిస్తున్నారు. అలాగే అద్దానికి వెనుక పూత ఉంటే దానికి స్పై కెమెరాలను అమర్చడం సాధ్యం కాదని, కాని ట్రాన్స్‌పరెంట్‌గా ఉండే అద్దాలకు వీటిని బిగించడం సులువని వారు హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో పోలీసులు, సెక్యూరిటీ వ్యవస్థలు, ఆర్మీ మొదలైన విభాగాలు మినహాయించి ఇతరులెవ్వరు కూడా స్పై కెమెరాలను వినియోగించకుండా చట్టం తీసుకు రావలని వారు సూచిస్తున్నారు. ఒకవేళ అది సాధ్యం కాకపోయినా స్పై కెమెరాలను కొనేవారి ఆధార్‌నంబర్ అయినా నమోదు చేసేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని స్పై కెమెరాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సంస్థలు కోరుతున్నాయి. ఈ స్పై కెమెరాల ద్వారా ప్రతిఏటా దాదాపు 20 లక్షలమంది మహిళల నగ్న ఫుటేజ్‌లు ఆన్‌లైన్‌లోకి అప్‌లోడ్ అవుతున్న భయంకర పరిస్థితి నెలకొన్నదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


మహిళలను చైతన్య పరచడం మినహా స్పైని కట్టడి చేయలేము: డీజీపీ మహేందర్‌రెడ్డి

స్పై కెమెరాలను ఆన్‌లైన్‌లో ఖరీదు చేయడాన్ని లేదా, వినియోగించడాన్ని కట్టడి చేసే ఎలాంటి చట్టాలూ లేవని రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపారు. స్పై కెమెరాలే గాక పలు స్మార్ట్ ఫోన్‌లలో ఉన్న కెమెరాలను ఎవరు ఏ విధంగా వాడుతున్నారనేది కనిపెట్టడం సాధ్యంకాదని ఆయన తెలిపారు. అయితే,ఇలాంటి కెమెరాల వల్ల జరిగే అనర్థాలు, స్వార్థపరులు, నేర మనస్తత్వం కలవారు వాటిని ఏవిధంగా దుర్వినియోగం చేస్తున్నారో తెలుపుతూ జాగ్రత్తలు తీసుకోవడంపై మహిళలను చైతన్యపరచడం ఒక్కటే మార్గమని, ఆదిశగా దృష్టిని సారిస్తామని డీజీపీవివరించారు.

కేసీఆర్ దోపిడీకి పవన్ బ్రాండ్ అంబాసిడర్

- సర్కారు కరెంట్ డ్రామాకు... పొగడ్తాలా?
- పవన్ కళ్యాణ్‌కు రేవంత్ విమర్శలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు పాలనలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు సంబంధించిన వాస్తవాలు తెలుసుకోకుండానే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి చెప్పారు. 24 గంటల కరెంట్ డ్రామాను ఆయన పొగడ్తాలతో ముంచెత్తడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ దోపిడీకి పవన్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో జరుగుతున్న విషయాలపై పవన్ కళ్యాణ్ వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 56 లక్షల మంది రైతులు 24 గంటల విద్యుత్‌ను కోరుకోలేదని, ఉదయం పూట 9 గంటలు ఇస్తే చాలని భావిస్తున్నారని చెప్పారు. రాత్రి పూట విద్యుత్ ఇవ్వడం ద్వారా రైతులకు ఉపయోగమేమిటన్నారు. దివాళా తీసిన విద్యుత్ కంపెనీల నుండి ముఖ్యమంత్రి విద్యుత్ కొనుగోలు చేయడంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. పవన్ నిజాలు తెలుసుకోవాలంటే విద్యుత్ జేఏసీ తరుపున రఘు రాసిన పుస్తకాన్ని చదవాలని సూచించారు. పవన్‌కు, తనకు ఉన్న కామన్ ఫ్రెండ్స్ ద్వారా ఆ పుస్తకాన్ని పంపుతున్నట్టు చెప్పారు. విద్యుత్ దోపిడీ వెనుక ఉన్న ఆ రహస్యాన్ని పవన్ గుర్తించాలన్నారు. ఇవేవీ తెలియకుండా మాట్లాడి కేసీఆర్ దోపిడీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కొత్త సంవత్సరంలో కేసీఆర్ మాయ మాటలకు పవన్ తెరలేపారని మండిపడ్డారు. కేసీఆర్ మాయ మాటల్లో పడి, ప్రజలను కూడా ఆ మత్తులో ముంచేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆనాడు రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ పరిస్థితులను సోనియాగాంధీ వివరించిన ప్రకారం విద్యుత్‌ను వినియోగాన్ని ప్రాతిపదికంగా విభజించారన్నారు.

కేసీఆర్ మాయంలో పవన్ : వీహెచ్

ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు మాయంలో పవన్ కళ్యాణ్ పడిపోయారని మాజీ ఎంపీ వి హను మంతరావు చెప్పారు. 24గంటల కరెంట్ ఇవ్వడం మొదలు కాకముందే పవన్ మెచ్చుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అవినీతి రహిత పాలన కోసం పార్టీ పెట్టిన పవన్ అవినీతి సీఎంను పొగడటంలో ఆయన చిత్తశుద్ధి బయటపడిందని చెప్పారు.

పార్టీ పేరు నిర్ణయించలేదు: రజనీ కాంత్

చెన్నై: ప్రముఖ తమిళ నటుడు రజనీకాంత్ రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ప్రకటించినప్పటికీ పార్టీ పేరు, గుర్తును ఎప్పుడు ప్రకటిస్తారనేది స్పష్టం చేయలేదు. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో అడిగిన ప్రశ్నకు బదులుగా.... 'పార్టీ పేరు ఏంటనేది నాకూ ఇంకా తెలియదు. ప్రజల్లోకి వెళ్తే తెలిసే అవకాశం ఉంది' అని సమాధానమిచ్చారు. ఒకేసారి నేను అన్ని విషయాలు చెప్పలేనన్నారు. నూతన సంవత్సరానికి కొన్ని గంటల ముందు రాజకీయ పార్టీని ప్రకటించి, త్వరలో తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం తన రాజకీయ పార్టీకి సంబంధించి అభిమానుల కోసం మొబైల్ యాప్, వెబ్‌సైట్, ట్విట్టర్ ఖాతాను ప్రారంభించారు.

'అక్బర్ దిగ్రేట్' రచయిత అన్వర్ కన్నుమూత



లక్నో: సుప్రసిద్ధ కవి, మాటల రచయిత అన్వర్ జలాల్‌పూరి(70) కన్నుమూశారు. గతనెల స్నానాలగదిలో ప్రమాదవశాత్తూ జారిపడి కోమాలోకి వెళ్లిన ఆయన మంగళవారం కింగ్ జార్జి వైద్యకళాశాలలో తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.అన్వర్ గీతాంజలి, భగవద్గీతలను ఉర్దూలోకి అనువదించారు. 'రహే సే రహాహునా తక్' వంటి పుస్తకాలు రాశారు. దీంతోపాటు 'అక్బర్ దిగ్రేట్' అనే టీవీ సీరియల్‌కు మాటల రచయితగా పనిచేశారు. యూపీలోని అంబేద్కర్‌నగర్ జిల్లాలోని జలాల్‌పూర్‌లోని ఆయన సొంతనివాసంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమారుడు శంకర్ తెలిపారు.

త్వరలో అన్ని రైళ్లకు 22 బోగీలే!

న్యూఢిల్లీ: దేశంలో ప్రయాణికులకు సేవలందిస్తోన్న అన్నిరైళ్లలోనూ ఒకే విధమైన ప్రామాణికతను తీసుకొచ్చేందుకు రైల్వేశాఖ ప్రణాళికలు తయారు చేస్తోంది. పలు రూట్లలో తిరుగుతున్న రైళ్లన్నింటికీ 22 బోగీలు చొప్పున ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.

దేశంలో 'నూతన' నవజాతం

- కొత్త ఏడాదిలో 69,070 మంది జననం
- ప్రపంచంలోనే ఎక్కువ మంది..: యూనిసెఫ్



న్యూఢిల్లీ: దేశంలో నూతన సంవత్సరం రోజున(జనవరి 1) 69,070 మంది శిశువులు జన్మించినట్టు యునైటెడ్స్ స్టేట్స్ అండ్ చిల్డ్రన్స్ ఫండ్ (యూనిసెఫ్) వెల్లడించింది. ఈ ఒక్కరోజులోనే ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3.86 లక్షల మంది పుట్టారని యూనిసెఫ్ అంచనా వేసింది. ప్రపంచంలో భారత్‌లోనే ఎక్కువ మంది శిశువులు జన్మించడం గమనార్హం. తర్వాతి స్థానంలో చైనా ఉన్నది. తొమ్మిది దేశాల్లోని రిపోర్టుల ఆధారంగా ఈ నివేదికను వెల్లడించింది. యూనిసెఫ్ రిపోర్టు ప్రకారం.. ఈనెల 1న చైనాలో 44,760 మంది, నైజీరియాలో 20,210 మంది, పాకిస్థాన్‌లో 14,910 మంది, ఇండోనేషియాలో 13,370 మంది, యూఎస్‌లో 11,280 మంది, కాంగోలో 9,400 మంది, ఇథోపియాలో 9,020 మంది, బంగ్లాదేశ్‌లో 8,370 మంది శిశువులు జన్మించారు.

గల్ఫ్ బాధితుల సమస్యలు పరిష్కరించండి

- గవర్నర్‌కు బీజేపీ నేతల వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



గల్ఫ్ బాధితుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వారిని ఆదుకోవడానికి గవర్నర్ జోక్యం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ అన్నారు. బుధవారంనాడాయన బీజేపీ నేతలు ఎన్ వి సుభాష్, వి సుధాకరశర్మ, నర్సింహనాయుడుతో పాటు గల్ఫ్ బాధిత కుటుంబసభ్యులతో కలిసి గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర సచివాలయంలో గల్ఫ్ బాధితుల సమస్యలు వినేందుకు కనీసం ఒక కార్యాలయం కూడా లేదని, వారికోసం ఎన్‌ఆర్‌ఐ సెల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెంట్ల చేతిలో మోసపోయి, ఆస్తులు పోగొట్టుకొని, అనేక కుటుంబాలు కటిక దారిద్ర్యం అనుభవిస్తున్నాయని చెప్పారు. గల్ఫ్ దేశాల్లో, గల్ఫ్ నుంచి తిరిగి వచ్చి ఇక్కడ మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.6 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వారిక ఆరోగ్యశ్రీ పథకం వర్తింపచేయాలని, రేషన్‌కార్డులనుంచి పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని, మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి రిక్రూటింగ్ వ్యవస్థపై నిరంతర నిఘా పెట్టాలని, నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాడ్‌తో ఆరుగురిని కొట్టి చంపి..

- హర్యానాలో మాజీ సైనికాధికారి వీరంగం

చండీగఢ్ : దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి సేవలందించి ఇటీవలే పదవీ విరమణ పొందాడు. ఏమైందో తెలియదు గానీ.. ఉన్నట్టుండి వీరంగం సృష్టించాడు. రాడ్ పట్టుకొని దారి పొడవునా దాడి చేస్తూ నరరూప రాక్షసుడిలా ప్రవర్తించాడు. ఈ ఘాతుకంతో అమాయకుల ప్రాణాలు గాల్లో కలిశాయి. హర్యానాలో ఓ మాజీ సైనికాధికారి పాశవికంగా దాడి చేసి ఆరుగురిని పొట్టన బెట్టుకున్నాడు. అడ్డొచ్చిన పోలీసులపై కూడా దాడి చేసి గాయపర్చాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని బల్లభ్‌గఢ్ ప్రాంతానికి చెందిన మాజీ సైనికాధికారి నరేశ్ ధాంకడ్(45).. ప్రస్తుతం వ్యవసాయ శాఖలో పని చేస్తున్నాడు. కాగా సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అతడు.. పాల్వాల్‌లో రెండు కిలోమీటర్ల మేర విధ్వంసం సృష్టించాడు. ఇనుప రాడ్ చేతిలో పట్టుకొని నగరంలోని ఆగ్రా చౌక్ నుంచి క్యాంప్ కాలనీ వరకు దొరికిన వారిని దొరికినట్టు చావబాదాడు.

అమెరికాను విడిచి వెళ్లాల్సిందేనా !



హెచ్1బీ వీసా నిబంధనలు కఠినతరం, పెండింగ్‌లో గ్రీన్‌కార్డు దరఖాస్తులు

- ట్రంప్ తీసుకొన్న నిర్ణయాల ప్రభావం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న నిర్ణయాల ప్రభావం ఇండియన్లపై తీవ్రంగా కన్పిస్తోంది. వేలాది మంది ఇండియన్లు అమెరికా నుండి తిరిగిరావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. హెచ్1-బీ వీసా నిబంధనలు కఠినతరం కావడం, గ్రీన్‌కార్డు దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో సుమారు 50 వేల మంది అమెరికాను విడిచి వెళ్ళాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

అమెరికాలో ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. స్థానికులకే ఉద్యోగావకాశాలను కల్పించేలా చట్టాల్లో మార్పులు తీసుకువచ్చారు. 'బై అమెరికన్, హైర్ అమెరికన్' అనే పాలసీని అమలుజేస్తున్న ట్రంప్ సర్కార్ తీరు వల్ల వేలాది మంది ఇండియన్ టెక్కీలపై తీవ్ర ప్రభావం కన్పిస్తోంది. హెచ్1-బీ వీసా నిబంధనలను కూడ కఠినతరం చేయడంతో కూడ ఈ పరిస్థితులు నెలకొన్నాయి.

50 వేల మంది వెనక్కి !

ట్రంప్ సర్కార్ అమెరికా ఐటీ కంపెనీలపై తెస్తున్న ఒత్తిడి కారణంగా, మనవాళ్ల ఉద్యోగాలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్క్ వీసా పొడగింపులు కూడా ఉండకపోవటంతో మనవాళ్లు తీవ్ర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. దీంతో 50వేలకు పైగా వరకు భారతీయ హెచ్-1బీ వీసా హోల్డర్స్ తిరిగి స్వదేశానికి రావాల్సి వస్తుందని అంచనాలు వెలువడుతున్నాయి. వీసా సంబంధిత సమస్యలపై సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ బాడీ నాస్కామ్, అమెరికా సెనేటర్లు, కాంగ్రెస్‌మెన్, అడ్మినిస్ట్రేషన్‌తో చర్చిస్తున్నారు. శాశ్వత సభ్యత్వం కోసం పొందే గ్రీన్‌కార్డులు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకున్న నిబంధనలతో గ్రీన్‌కార్డు ఆమోదం పొందలేని పక్షంలో హెచ్-1బీ వీసాలకు రెండు మూడేండ్ల పొడిగింపు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ కూడా అనుకున్నంత స్థాయిలో జరగకపోవచ్చు !



బ్రెజిల్ జైలులో ఘర్షణలు

- 9 మంది మృతి...100 మంది పరారీ

సావోపాలో : బ్రెజిల్‌లోని గోయియాస్ రాష్ట్రంలో ఉన్న ఓ జైలులో ప్రత్యర్థి వర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ జరిగింది. జైలు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ దుర్ఘటనలో 9 మంది మరణించగా, 14 మంది గాయపడ్డారు. 100 మందికిపైగా పరారయ్యారు. కొలోనియా ఆగ్రో ఇండస్ట్రియల్ జైలులో ఈ దుర్ఘటన జరిగింది. ఈ జైలులో ప్రత్యర్థి గ్యాంగుల సభ్యులను వేర్వేరు బ్లాకుల్లో ఉంచారు. ఒక సెల్ బ్లాక్‌లో ఉన్నవారు ప్రత్యర్థుల్లో ముగ్గురిపై దాడికి పాల్పడటంతో ఘర్షణ ప్రారంభమైంది.

చాపలను తగులబెట్టి, మరణించిన ఖైదీల మృతదేహాలపై పడేశారు. అగ్నిమాపక దళం ఈ మంటలను ఆర్పగలిగింది. 106 మంది ఖైదీలు పరారవగా, వారిలో 29 మందిని పోలీసులు అరెస్టు చేయగలిగారు. ఘర్షణల సమయంలో పారిపోయిన 127 మంది స్వచ్ఛందంగా తిరిగి రావడం విశేషం. సైన్యం సహకారంతో స్పెషల్ పెనిటెన్షియరీ ఆపరేషన్స్ గ్రూప్ అధికారులు ఈ జైలుపై రెండు గంటల్లో నియంత్రణ సాధించగలిగారు.

అమెరికా విమానాశ్రయాల్లో స్తంభించిన కంప్యూటర్ సేవలు

- గంటలకొద్దీ ప్రయాణీకుల నిరీక్షణ



వాషింగ్టన్: అమెరికాలోని పలు విమానశ్రయాల్లో సోమవారం రాత్రి ఇమ్మిగ్రేషన్ డెస్క్ కంప్యూటర్లు రెండు గంటల పాటు పనిచేయలేదు. దీంతో ఎయిర్‌పోర్టుల్లోనే ప్రయాణీకులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. అమెరికాలోని పలు ఎయిర్‌పోర్టుల్లో సోమవారం నాడు ఈ పరిస్థితి ఎదురైంది. నూతన సంవత్సర వేడుకలను ముగంచుకొని స్వదేశానికి తిరిగి వస్తున్న ప్రయాణీకులకు కంప్యూటర్లు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ప్రాసెసింగ్ సిస్టమ్‌లో రెండు గంటల పాటు సాంకేతిక సమస్యలు తలెత్తాయని ప్రకటించింది సాధారణం కంటే అధిక సమయాన్ని ఎయిర్ పోర్టుల్లోనే గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణీకులు చెప్పారు. అయితే ఈ అంతరాయానికి గల కారణాలను మాత్రం అధికారులు ప్రకటించకపోవడంతో ప్రయాణీకులు ప్రత్యామ్నాయమార్గాలను ఎంచుకొన్నారు. న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్. కెన్నెడీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, హార్ట్స్‌ఫీల్డ్ జాక్సన్ అట్లాంటా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వంటి ఇతర ఎయిర్‌పోర్టులు దీని ప్రభావానికి గురయ్యాయి.

అమెరికా తీరుపై పాక్ అత్యవసర సమావేశం



ఇస్లామాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్‌కు దాదాపు 255 మిలియన్ డాలర్ల (సుమారుగా రూ.1619 కోట్లు) సైనిక సాయం నిలిపేస్తున్నట్టు ప్రకటించడంతో ఆ దేశానికి షాక్ తగిలింది. ఈ విషయంపై చర్చించడానికి పాక్ ప్రధాని షాహిద్ ఖాన్ అబ్బాసి జాతీయ భద్రత కమిటీతో అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చారు. అబ్బాసి అధ్యక్షతన బుధవారం ఈ సమావేశం జరగనున్నది. ట్రంప్ పాక్‌పై చేసిన తీవ్ర వ్యాఖ్యలపై ఏ విధంగా స్పందించాలనే అంశంపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి పాక్ విదేశాంగ మంత్రి, అంతర్గత శాఖ మంత్రి, రక్షణ మంత్రి, త్రివిధ దళాధిపతులు, సివిల్, మిలిటరీ సీనియర్ అధికారులు హాజరుకానున్నారు.

ఉ.కొరియాతో చర్చలకు సౌత్ కొరియా సిద్ధం..



సియోల్: మరికొద్ది రోజుల్లో దక్షిణ కొరియాలో వింటర్ ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. వాటిల్లో ఉ.కొరియా పాల్గొనే అంశాన్ని పరిశీలించేందుకు దక్షిణ కొరియా ఉన్నత స్థాయి చర్చలు నిర్వహించనున్నది. దక్షిణ కొరియాకు ఓ టీమ్‌ను పంపుతామని ఉ.కొరియా అధినేత కిమ్ ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామం చోటుచేసుకున్నది. 2018 ఫిబ్రవరిలో దక్షిణ కొరియా వింటర్ ఒలింపిక్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తోంది. అయితే ఇటీవల కొరియా దేశాల మధ్య సంబంధాలు బలహీనపడ్డ విషయం తెలిసిందే. ఉద్రిక్త పరిస్థితుల మధ్య మళ్లీ సంబంధాలు బలపడేందుకు ఇదో మంచి అవకాశమని సౌత్ కొరియా ప్రెసిడెంట్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో డీ-మిలిటరీ జోన్‌లో ఉన్న ఓ గ్రామంలో రెండు దేశాలకు చెందిన ప్రతినిధులు వింటర్ ఒలింపిక్స్ అంశాన్ని చర్చించనున్నారు.

పెద్ద ఎత్తున డబ్బు, ఆయుధాల్ని ఉపయోగిస్తున్నారు..

- ఇది ఇరాన్ శత్రువుల పని : ఇరాన్ సుప్రీం ఖొమైనీ



టెహ్రాన్ : దేశంలో గతకొద్ది రోజులుగా జరుగుతున్న ఆందోళనలు, నిరసనల వెనుక ఇజ్రాయిల్, అమెరికా, సౌదీ అరేబియా దేశాలున్నాయని, ప్రభుత్వ వ్యతిరేక శక్తులు, శత్రువులు కలిసిపోయి హింసకు దిగుతున్నాయని ఇరాన్ సుప్రీం లీడర్ ఆయాతొల్లా అలీ ఖొమైనా అన్నారు. గతకొద్ది రోజులుగా ఇరాన్‌లో పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నాయి. దేశంలో నిత్యావసర ధరలు పెరగటం, అవినీతి...వంటివాటికి వ్యతిరేకంగా ఆందోళనలు మొదలయ్యాయి. ఇరాన్ ప్రభుత్వ తీరును వారంతా తీవ్రంగా నిరసిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో భద్రతా బలగాలతో ఆందోళనకారులు ఘర్షణకు దిగారు. ముఖ్యంగా మధ్య ఇరాన్‌లో హింస పెద్ద ఎత్తున చోటుచేసుకుంది. పలు చోట్ల జరిగిన హింసాయుత ఘటనల్లో ఇప్పటివరకూ 22 మంది చనిపోయారని ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఆందోళనకారులకు అమెరికా అధ్యక్షుడు బహిరంగంగా మద్దతు పలుకుతున్నారు. ఆందోళనకారుల్ని ప్రోత్సహిస్తూ ట్రంప్ పదే పదే ట్విట్టర్ సందేశాల్ని వదులుతున్నారు. దీనిని ఇరాన్ ప్రభుత్వం చాలా సీరియస్‌గా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయాతొల్లా అలీ ఖొమైనీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.."ఇరాన్ శత్రువులు దేశంలోని ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడానికి కుట్ర పన్నారు. పెద్ద ఎత్తున డబ్బు, ఆయుధాలు ఉపయోగిస్తున్నారు. అలాగే రాజకీయంగా, గూఢాచార్య కార్యకలాపాలతో ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నాయి. దేశం కోసం ఎంతోమంది ఇరానీయులు తమ జీవితాన్ని త్యాగం చేశారు. వారి స్ఫూర్తితో, వారిచ్చిన ధైర్యంతో నేటి విద్రోహుల్ని, శత్రువుల్ని ఎదుర్కొంటా"మని ఖొమైనీ చెప్పారు.

ప్రియుడితో వివాహం.. క్షణాల్లోనే మరణం



కనెక్టికట్ : ప్రేమించిన వ్యక్తిని పెండ్లి చేసుకుని నిండు నూరేళ్లు కలిసుండాలని ప్రతీ అమ్మాయి కోరుకుంటుంది. కానీ కోరుకున్న వ్యక్తిని పెళ్లి చేసుకున్న క్షణాల్లోనే ఓ యువతి కన్నుమూసింది. ఈ ఘటన అమెరికాలోని కనెక్టికట్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. కనెక్టికట్‌కు చెందిన హెథర్, డేవిడ్ 2015 నుంచి గాఢంగా ప్రేమించుకుంటున్నారు. 2016లో హెథర్‌కి రొమ్ము క్యాన్సర్ ఉన్నట్టు తెలిసింది. అప్పటికే వ్యాధి ముదరడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. 2017 డిసెంబర్ ఆఖరి వారంలో ఆమె పరిస్థితి దిగజారుతుండడంతో వెంటనే పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సాధారణ పెండ్లిలాగానే కుటుంబ సభ్యులందరి సమక్షంలో హాస్పిటల్‌లో హెథర్, డేవిడ్‌లు వివాహ బంధంతో ఒకటయ్యారు. పైగా పెళ్లికి వచ్చేవారు ఎలాంటి కానుకలు తీసుకురావద్దని ఆ డబ్బును ఛారిటీలకు ఇవ్వాల్సిందిగా హెథర్ కోరింది. కానీ వారి ప్రేమ విధికి తలవంచక తప్పలేదు. బెడ్‌పై ఉన్న హెథర్.. తన భర్త డేవిడ్‌తో ప్రేమగా మాట్లాడిన మాటలే ఆఖరి మాటలయ్యాయి. డేవిడ్, కుటుంబ సభ్యుల ముందే హెథర్ కన్నుమూసింది. పెండ్లి సమయంలో హెథర్, డేవిడ్ దంపతులు దిగిన ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

నెలాఖరు నాటికి ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్!

ఐసెట్ కన్వీనర్‌గా సుబ్రమణ్య శర్మ

- ఎంసెట్ కన్వీనర్ యాదయ్య కొనసాగింపు
- సెట్స్ కన్వీనర్ పేర్లు ప్రకటించిన ఉన్నత విద్యామండలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరంలో ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షలు (సెట్స్)-2018 కన్వీనర్ల పేర్లను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) మంగళవారం ప్రకటించింది. ఇప్పటికే ప్రవేశ పరీక్షల తేదీలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ కన్వీనర్‌గా కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం సుబ్రమణ్య శర్మను ఎంపిక చేసింది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్యను కొనసాగించింది. లాసెట్ కన్వీనర్‌గా ఓయూ ప్రొఫెసర్ ఎస్‌బి ద్వారకానాథ్ ఎంపికయ్యారు. మంగళవారం తనను కలిసిన విలేకరులతో ప్రవేశ పరీక్షల కన్వీనర్లను, నిర్వహణ తేదీలను ప్రకటించామని చెప్పారు. ఈనెలలోనే సెట్ కమిటీల సమావేశాలు జరుగుతాయని సూచనప్రాయంగా అన్నారు. ఈనెలాఖరునాటికి ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు విడుదలవుతాయని చెప్పారు. సెట్ కమిటీల సమావేశంలోనే దరఖాస్తు ఫీజులపై నిర్ణయం ఉంటుందని అన్నారు. మే 2 నుంచి 5వ తేదీ వరకు ఎంసెట్, మే 9న ఈసెట్, మే 17న ఐసెట్, మే 20వ తేదీ నుంచి పీఈసెట్, మే 25న లాసెట్, మే 26న పీజీలాసెట్, మే 27న పీజీఈసెట్, మే 31న ఎడ్‌సెట్ రాతపరీక్షలు జరుగుతాయని ప్రకటించిన విషయం విదితమే. పీఈసెట్ మినహా మిగతా అన్ని ప్రవేశ పరీక్షలనూ ఆన్‌లైన్‌లో నిర్వహించనుంది. ఈనెల రెండోవారం నుంచి మాక్‌టెస్టులు ప్రారంభం కానున్నాయి. గ్రామీణ, ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉన్నత విద్యామండలి చర్యలు చేపట్టనుంది.



డైరీని ఆవిష్కరిస్తున్నఉన్నత విద్యామండలి చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, టీఏఎఫ్‌ఆర్సీ చైర్మెన్ స్వరూప్ రెడ్డి, తదితరులు

ఉన్నత విద్యామండలి డైరీ ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ)-2018 డైరీని టీఎస్‌సీహెచ్‌ఈ చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్‌ఆర్సీ) చైర్మెన్ జస్టిస్ పి స్వరూప్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీహెచ్‌ఈ వైస్ చైర్మెన్లు ఆర్ లింబాద్రి, వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షల నిర్వహణ తేదీల వివరాలు

ప్రవేశ పరీక్ష	రాతపరీక్ష తేది	కన్వీనర్
ఎంసెట్	2.5.2018 నుంచి 5.5.2018 వరకు	ఎన్ యాదయ్య
ఈసెట్	9.5.2018	ఎ గోవర్ధన్
ఐసెట్	17.5.2018	ఎం సుబ్రమణ్య శర్మ
పీఈసెట్	20.5.2018 నుంచి	వి సత్యనారాయణ
లాసెట్	25.5.2018	ఎస్‌బి ద్వారకానాథ్
పీజీలాసెట్	26.5.2018	ఎస్‌బి ద్వారకానాథ్
పీజీఈసెట్	27.5.2018	సమీనా ఫాతిమా
ఎడ్‌సెట్	31.5.2018	సి మధుమతి

చివరి ఆయకట్టుకూ నీరందించాలి

- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సారెస్పీ కార్యాలయం ముట్టడి
- 14 టీఎంసీలు మిడ్‌మానేరుకు తరలించారని ఆరోపణ



ఎస్సారెస్పీ కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రైతులు

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల జిల్లాలోని చివరి ఆయకట్టు భూములకూ ఎస్సారెస్పీ నీటిని అందించాలని రైతులు ఆందోళనకు దిగారు. జగిత్యాల ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 100 మంది ధరూర్ క్యాంప్‌లోని ఎస్సారెస్పీ ఈఈ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. ప్రభుత్వం ఒకవైపు ఎస్సారెస్పీ నీటితో చెరువులు నింపడం కుదరదని చెబుతూనే ఎస్సారెస్పీ ఆయకట్టుతో సంబంధం లేని మిడ్‌మానేరు ప్రాజెక్టు క్యూరింగ్ కోసం 14 టీఎంసీల నీటిని పక్కదారి పట్టించిందని ఆయన ఆరోపించారు. భూ గర్భజలాలు అడుగంటిపోవడంతో రైతులు ఎస్సారెస్పీ నీటిపై ఆధారపడి రబీ సాగు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని ఎస్సారెస్పీ ఆధారిత చెరువులను నింపితేనే భూగర్భజలాలు పెరుగుతాయని,24 గంటల ఉచిత విద్యుత్‌ను ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. చెరువులు నిండకపోవడంతో చివరి ఆయకట్టు భూములకు నీరు అందట్లేదన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో 70 టీఎంసీల నీరుంటే 14 టీఎంసీలు తరలించుకుపోవడంతో ఆ ప్రభావం ఇప్పుడు జిల్లాలోని ఆయకట్టు భూములపై పడిందన్నారు. అధికారులకు కార్యచరణ లేదని, రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. యాసంగి నాట్లు వేస్తున్న ఈ సమయంలో చివరి ఆయకట్టు భూములకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ దాదాపు 5గంటలపాటు కార్యాలయం ఎదుట రైతులు బైటాయించారు. ధర్నాలో జిల్లా చివరి ఆయకట్టు సాగు భూముల రైతులు దాదాపు 100 మంది పాల్గొన్నారు.

10న లారీ యజమానుల కార్యవర్గ సమావేశం

- ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు అమలు కాకపోవడంపై చర్చ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 10వ తేదీ లారీ యజమానుల రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూకల భాస్కరరెడ్డి, జి దుర్గాప్రసాద్ తెలిపారు. హయత్‌నగర్‌లోని తొర్రూర్ ఎక్స్‌రోడ్ బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్‌లో ఆరోజు ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. గతంలో రెండుసార్లు జరిగిన లారీల బంద్ సందర్భంగా ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని, దీనిపై ఈ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరపనున్నట్టు తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి లారీ ఎగుమతి, దిగుమతుల్లో హమాలీ, గుమస్తా మామూళ్లు ఇవ్వడంపై సంఘం నిషేధాన్ని విధించిందని, దీనిపై కూడా చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న 'డబుల్ డ్రైవర్' విధానం, కార్మిక చట్టం ప్రకారం 'లేబర్ లైసెన్స్' రిజిస్ట్రేషన్‌పై కూడా చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. రాష్ట్రంలో లారీ యజమానుల సమస్యలపై ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా, కంటి తుడుపు చర్యలే తప్ప, శాశ్వత పరిష్కారాలు లభించట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సింగిల్ పర్మిట్ అంశం ఇప్పటి వరకు కొలిక్కిరాలేదని పేర్కొన్నారు.

బలవంత భూసేకరణను ప్రతిఘటిస్తాం

- నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపాలి గోకారం నిర్వాసితుల సదస్సులో : మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి

ప్రాజెక్టుల పేరుతో బలవంతంగా భూసేకరణ చేస్తే ప్రతిఘటించి తీరుతామని మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గోకారంలో రైతు సంఘం, వ్యకాస ఆధ్వర్యంలో భూనిర్వాసితుల సదస్సు మంగళవారం నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ..భూమిపైనే ఆధారపడి బతుకుతున్న గిరిజన, గిరిజనేతరులకు ప్రత్యామ్నాయం చూపకుండా పాలకులు మోసాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పట్టాదారుల అనుమతులు లేకుండా భూములు లాక్కొనే హక్కు ఎవరికీ లేదన్నారు. గ్రామంలో 80 శాతం మంది ప్రజలు ఒప్పుకుంటేనే భూములు తీసుకునే అవకాశం ఉంటుందని ఆయన గుర్తు చేశారు. 2013 భూసేకరణ చట్టాన్ని కాదని దొడ్డిదారిన 2017 చట్టాన్ని తీసుకురావటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఓవైపు ప్రవేయిటులో రిజర్వేషన్లు కేటాయించాలని ఆందోళనలు చేస్తుంటే మరోవైపు పేదల కడుపు కొట్టే విధంగా పాలన కొనసాగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పోరాటానికి టీ-మాస్ అండగా ఉంటుందని చెప్పారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, మహిళలపై దాడులు అరికట్టాలని కోరుతూ.. టీమాస్ చేస్తున్న ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ.. రైతులను ప్రభుత్వం దొంగ దెబ్బ తీయడానికి కుట్రలు పన్నుతోందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ధర్మానాయక్, జిల్లా నాయకులు ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి, నాయకులు బాలస్వామి, మల్లేష్, లక్ష్మణ్, సర్పంచ్ గాజమ్మ, ఉపసర్పంచి భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

మేట్లను కొనసాగించాలి

- సీఎంకు వ్యకాస లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పథకంలో పనిచేస్తున్న పాత మేట్లను కొనసాగిం చాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ్మా, రాష్ట్ర కార్యదర్శులు ఎం.ఆంజనేయులు, కె.జగన్, యూ. గోపాల్, సభ్యులు ఆర్ ఆంజనేయులు తదితరులు సంయుక్తంగా ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం జాబ్ కార్డు, పనిపొందే హక్కును అడ్డుకోరాదన్నారు. పనిలో అవినీతి జరిగితే మేట్ల జాబ్‌కార్డులను రద్దుచేసే ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. పాత మేట్లను తొలగిస్తూ జారీ చేసిన సర్క్యులర్ నెంబరు 1788ను రద్దు చేయాలని డమాండ్ చేశారు. అలాగే 20 మంది సభ్యులను కలిగిన శ్రమ శక్తి సంఘాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. 55 లక్షల జాబ్‌కార్డుల కుటుంబాలను 3.80 లక్షల మంది మేట్లు సమన్వయం చేస్తున్నారని గుర్తు చేశారు. కూలీలకు పనిచూపించడంలో మేట్లదే కీలకపాత్ర అని వివరించారు. వీరి కృషిని గత ఉమ్మడి ప్రభు త్వాలు గుర్తించి ఒక కూలిపై పారితోషికంగా రూ. 3 కమిషన్ ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొంతకాలం కొనసాగిం చిందన్నారు. మేట్లు ఎక్కువ మంది సామాజికంగా వెనుకబడ్డ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తరగతులకు చెందినవారని చెప్పారు. పదో తరగతి నుంచి పీజీ, ఇంజినీరింగ్ చేసి ఉపాధిలేక ఉపాధి పనికూలీలుగా పనిచేస్తున్నారని వివరించారు. వీరి కృషి ఫలితం గానే నిజామాబాద్ జిల్లా ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రాతినిధ్య ప్రాంతం ఉత్తమ అవార్డులు సాధిం చిందన్నారు. వీరి సేవలను గుర్తించి బతుకు భరో సాను కల్పించాలని కోరారు. సీనియర్ మేట్లను ఖాళీగా ఉన్న ఫిల్డ్‌అసిస్టెంట్ పోస్టుల్లో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అవినీతి పేరుతో జాబ్‌కార్డుల రద్దుకు సర్క్యులర్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ఇది ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని దెబ్బతీస్తుందని చెప్పారు.

ఆల్‌రౌండర్ అని పిలిస్తే హ్యాపీ..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్

'నటన, డాన్సులు, ఫైట్లు.. ఇలా అన్నింటిలోనూ సాయి ఆల్‌రౌండర్ అంటే చాలా హ్యాపీగా ఫీలవుతాను. వైవిధ్యమైన కథ, కథనం, ఆసక్తికర అంశాలతో తెరకెక్కుతున్న 'సాక్ష్యం' చిత్రం అన్ని వర్గాలను విశేషంగా అలరించడం ఖాయం' అని అంటున్నారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. 'అల్లుడుశీను', 'స్పీడున్నోడు', 'జయ జానకి నాయక' వంటి చిత్రాలతో తానేమిటో నిరూపించుకున్నారు. త్వరలోనే 'సాక్ష్యం' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సాయిశ్రీనివాస్ బర్త్‌డే నేడు (బుధవారం). ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

'సాక్ష్యం'.. కొత్త తరహా చిత్రం

నేను గతంలో నటించిన 'అల్లుడు శ్రీను', 'స్పీడున్నోడు', 'జయజానకి నాయక' చిత్రాలతో పోల్చితే 'సాక్ష్యం' ఓ కొత్త తరహా సినిమా అవుతుంది. పంచభూతాలు అనే కాన్సెప్ట్‌తో పాటు ఇంకా చాలా కొత్త అంశాలుంటాయి. అవేంటనేది వెండితెర మీద చూడాల్సిందే. మేకింగ్ పరంగా న్యూ ఏజ్‌గా ఉంటుంది. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ కొత్త ప్రయత్నం చేశారని అభినందిస్తారు. ఈ సినిమా కోసం చాలా కేర్ తీసుకున్నాం. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాల్లో ఇది ది బెస్ట్‌గా నిలుస్తుంది.

వీడియో గేమ్ డైరెక్టర్‌గా..

జనరల్‌గా కథలు మూడు రకాలు. ఒకటి ప్రేమ, రెండోది రివేంజ్, మూడోది త్యాగం. ఈ మూడు ఎలిమెంట్స్‌తోనే సినిమా చేయాలి. రివేంజ్ ఫార్మెట్‌లో ఇదొక కొత్త తరహా కథకు నాంది అవుతుంది. యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నేను వీడియో గేమ్ డైరెక్టర్‌గా కనిపిస్తాను. అమెరికాలో పుట్టి, పెరిగిన ఓ వీడియో గేమ్ డైరెక్టర్, అతని ఇష్టాఇష్టాలు, ఆలోచనా విధానం, యాటిట్యూడ్ అంతా భిన్నంగా, కొత్తగా అనిపిస్తుంది. పాత్ర కచ్చితంగా అందరినీ అలరిస్తుంది. ఈ పాత్రను చాలా ఎంజాయ్ చేస్తూ నటించాను. నా ఏజ్‌కు పక్కాగా సరిపోయే పాత్ర కావడంతో బాగా కనెక్ట్ అయ్యింది. అలాగే ప్రేక్షకులకు కూడా కనెక్ట్ అవుతుంది. ఇప్పటి వరకు జరిపిన షూటింగ్‌తో 70శాతం సినిమా పూర్తయ్యింది. న్యూయార్క్‌లో మూడు పాటలు, క్లైమాక్స్ షూట్ చేయాల్సి ఉంది.

దుబాయ్‌లో శిక్షణ తీసుకున్నా..

ఈ సినిమాలో పీటర్ హెయిన్స్ కంపోజ్ చేసిన యాక్షన్ ఎపిసోడ్స్ హైలైట్‌గా ఉంటాయి. దాదాపు 60 రోజులకు పైగా అంత పెద్ద యాక్షన్ డైరెక్టర్ పనిచేస్తున్నారంటే సినిమాలో యాక్షన్ సీక్వెన్స్‌లు ఏ రేంజ్‌లో ఉంటాయో ఊహించుకోవచ్చు. ఆయన మా సినిమాకు పనిచేయడమే పెద్ద ఎచీవ్‌మెంట్‌గా భావిస్తున్నాం. ఆయన కూడా చాలా ఛాలెంజింగ్‌గా చేశారు. రైడింగ్, సైక్లింగ్ వంటి వాటిపై దుబాయ్‌లో శిక్షణ తీసుకున్నా. సినిమాలో స్కై బోర్డింగ్ ఉంటుంది. తెలుగులో ఇలాంటి ఎపిసోడ్స్ ఏ సినిమాలోనూ రాలేదు. సైక్లింగ్ చేయడం చాలా కష్టమనిపించింది. ఇందులో కథ ప్రకారమే యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. పాత్ర కోసం బరువు కూడా తగ్గాను.

హైలైట్స్ చాలా ఉన్నాయి..

యాక్షన్‌తోపాటు కాస్టింగ్ కూడా హైలైట్‌గా నిలుస్తుంది. జగపతిబాబు, అశుతోష్‌రాణా, మీనా, శరత్‌కుమార్, రవికిషన్ వంటి భారీ తారాగణం ఉంది. గతంలో సాయి అంటే డాన్సులు, ఫైట్స్ గురించి చెప్పేవారు. 'జయజానకి నాయక'లో యాక్టింగ్ గురించి కూడా చెప్పారు. ఇందులో యాక్టింగ్ ఇంకాస్త బెటర్ అని చెబుతారనుకుంటున్నా. ఈ సినిమా తర్వాత సాయి ఆల్ రౌండర్ అని చెబితే ఇంకా హ్యాపీ. నా గత చిత్రాల్లో ఉన్నట్టు ఈచిత్రంలో స్పెషల్ సాంగ్ లేదు. చాలా మంది పెద్ద హీరోల సినిమాల్లోనూ స్పెషల్ సాంగ్స్ ఉన్నాయి. మరి వాళ్ళని ఎవరూ అడగడం లేదు. నన్నే ఎందుకు అడుగుతున్నారు (నవ్వుతూ). ఈ తరహా ప్రశ్నలు అడుగుతున్నారనే ఇందులో స్పెషల్ సాంగ్ పెట్టలేదు.

ఎంజాయ్ చేస్తాను..

'లక్ష్యం' తర్వాత దర్శకుడు శ్రీవాస్ స్వతహాగా రాసుకున్న కథ ఇది. చాలా రియలిస్టిక్‌గా రాసుకున్నారు. సినిమా అత్యంత సహజత్వంగానే ఉంటూ కొత్తగా ఉంటుంది. శ్రీవాస్‌తో పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది. ఆయనతో పని చేయడాన్ని చాలా బాగా ఎంజాయ్ చేస్తాను. సినిమాను చాలా బాగా తెరకెక్కిస్తున్నారు. అభిషేక్ నామా రాజీపడకుండా నిర్మిస్తున్నారు. బడ్జెట్ విషయంలోనూ కాంబినేషన్‌తోపాటు నా మార్కెట్ పరిధి మేరకు పెడుతున్నారు.

బెటర్‌మెంట్ చేసుకుంటా..

నేను సామాజిక మాధ్యమాలను పెద్దగా ఫాలో అవ్వను. కాకపోతే విమర్శలను పాజిటివ్‌గా తీసుకుంటా. యాక్టింగ్ పరంగానే కాదు ఇతర ఏ అంశాల్లోనైనా ఏదైన లోపం ఉందంటే సరిచేసుకోవడానికి ప్రయత్నిస్తా. నా వరకు నేను బెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తాను. సినిమా చూశాక ఇంతకంటే ఇంకా చేయడానికి లేదనేలా చేయాలనుకుంటాను. ఫ్రెండ్స్, సన్నిహితులు కూడా నాలోని లోపాలను చెబుతారు. సినిమాలు, స్క్రిప్టులతో పాటు ఇతర విషయాల గురించి నాన్నతో చేసే డిస్కషన్ అంతా ఫ్రెండ్లీగా ఉంటుంది. బేసిక్‌గా నేను చాలా హార్డ్ వర్కర్‌ని. అందుకే ఎవరు మాట్లాడినా నా హార్డ్ వర్క్ గురించే చెబుతారు.

సోలోగా వస్తాం..

'సాక్ష్యం' చిత్రాన్ని సమ్మర్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. 'జయజానకి నాయక'లాగా కాకుండా మంచి టైమ్ చూసుకుని సోలోగా రావడానికి ప్రయత్నిస్తున్నాం. తదుపరి చిత్రాలు ఇంకా ఏది కమిట్ కాలేదు. నాన్నగారు (బెల్లంకొండ సురేష్) కథలు వింటున్నారు. ఆయన ఎగ్జైట్ అయితే నాకు చెబుతారు. లవ్ స్టోరీ లాంటివి వస్తే మొదట నేను వింటా. మంచి కథ వస్తే కొత్త దర్శకులతోనూ చేసేందుకు సిద్ధమే. కథ బాగుంటే కొత్త, పాత అనేది లేదు. ఇకపై కంటిన్యూగా సినిమాలు చేస్తాను. ఈ ఏడాది రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాను.

లక్కీగా భావిస్తున్నా..

చాలా మంది హీరోలు మొదట లవ్ స్టోరీస్ చేసి ఆ తర్వాత మాస్, యాక్షన్ సినిమాలు చేస్తారు. లక్కీగా నాకు తొలి నుంచీ యాక్షన్ సినిమాలొచ్చాయి. అలాంటి కథలే చేశాను. అలాగని మాస్ ఇమేజ్ కోసం చేసినవి కావు. ఇకపై మంచి ప్రేమ కథలు వస్తే చేయాలనుంది. ఫైట్స్ లేని లవ్ స్టోరీస్ అయినా చేస్తాను. ఏ స్క్రిప్ట్ అయినా సరే నన్ను ఎగ్జైట్ అయ్యేలా చేయాలి.

నవచిత్రం

హల్‌చల్ చేస్తున్న హాట్ టాపిక్స్

'సైరా'.. దర్శకుడు మారుతున్నాడా..?
కాపీ చిక్కుల్లో పవర్‌స్టార్ సినిమా..!



కృష్ణవంశీ, చిరంజీవి, వి.వి.వినాయక్

151వ చిత్రంగా చిరంజీవి నటిస్తున్న 'సైరా.. నరసింహారెడ్డి' సినిమా గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో పలు ఆసక్తికర విషయాలు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో అందరి దృష్టి ఈసినిమాపై పడింది.

'సైరా నరసింహారెడ్డి' చిత్రానికి సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న విషయం విదితమే. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సురేందర్‌రెడ్డి అదే స్థాయిలో విజువల్ వండర్‌గా తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ చిత్రంలో క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ కూడా భాగం కాబోతున్నారట. పాటలను అందంగా, రొమాంటిక్‌గా షూట్ చేయటంలో కృష్ణవంశీ ఎక్స్‌పర్ట్. స్వాతంత్రోద్యమ కాలం నాటి కల్చర్‌ను ప్రతిబింబించే మూడు పాటలు ఈ చిత్రంలో ఉన్నాయట. ఆ మూడు పాటలకు కృష్ణవంశీ దర్శకత్వం వహించనున్నారని సోషల్ మీడియా కోడై కూస్తోంది. ఈ పాటలను అందంగా, అద్భుతంగా తీయాలని చిత్ర బృందంతోపాటు చిరంజీవి కూడా భావిస్తున్నారట. దీని కోసమై కృష్ణవంశీతో చిరంజీవి ఇప్పటికే చర్చించి ఫైనల్ చేశారని సమాచారం. రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైన ఈ చిత్రాన్ని కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రామ్ చరణ్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నయనతార కథానాయికగా నటిస్తుండగా, అమితాబ్ బచ్చన్, సుదీప్, విజయ్ సేతుపతి, జగపతి బాబు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిరంజీవికి గురువుగా అమితాబ్ బచ్చన్, నమ్మిన బంటు ఓబయ్యగా విజయ్ సేతుపతి, వెన్నుపోటు దారుడిగా జగపతిబాబు పాత్రలు ఉండబోతున్నాయట. ఇదిలా ఉంటే, ఈ చిత్రం నుంచి దర్శకుడు సురేందర్‌రెడ్డిని తొలగించి, ఆయన స్థానంలో వినాయక్‌ని తీసుకోవాలనే యోచనలో చిత్రయూనిట్ ఉందనే ఊహాగానాలు సైతం సామాజిక మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. చిరంజీవి రీఎంట్రీ ఇస్తూ నటించిన 'ఖైదీ నెం 150' చిత్రానికి వినాయక్ దర్శకత్వం వహించిన విషయం విదితమే.



పవన్‌కళ్యాణ్

ఫ్రెంచ్ సినిమా 'లార్గో వించ్'కి కాపీ..!

పవన్ కళ్యాణ్ నటించిన తాజా చిత్రం 'అజ్ఞాతవాసి' చట్టపరమైన చిక్కుల్లో ఇరుక్కున్నట్టు తెలుస్తోంది. ఫ్రెంచ్ థ్రిల్లర్ 'లార్గో వించ్' చిత్రాన్ని పోలి ఉందని టీ-సిరీస్ సంస్థ 'అజ్ఞాతవాసి' చిత్రబృందానికి లీగల్ నోటీసులు పంపించిందట. 'లార్గో వించ్' చిత్రం రీమేక్ రైట్స్‌ను టీ-సిరీస్ కలిగి ఉండటం, గత కొన్ని రోజులుగా ఈ సినిమా 'లార్గో వించ్'ను పోలి ఉందనే వార్తలు రావడం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఈ నేపథ్యంలో కాపీరైట్స్‌కు సంబంధించిన సమస్య కారణంగా టీ- సిరీస్ కోర్టుకు వెళ్ళిందట. సంక్రాంతి కానుకగా విడుదలకు సిద్ధమవుతున్న టైమ్‌లో 'అజ్ఞాతవాసి' ఇలాంటి లీగల్ సమస్యలను ఎదుర్కోవడం చర్చనీయాంశంగా మారింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీకి సీఈఓగా నటిస్తున్నారు. ఆయన సరసన కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయెల్ కథానాయికలుగా నటిస్తుండగా, హారికా అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ(చినబాబు) నిర్మిస్తున్నారు. ఇందులో పవన్ 'కొడకా.. కోటేశ్వరరావు..' అంటూ సాగే పాటను పాడిన విషయం విదితమే. ఈ నెల 10న విడుదల కానున్న ఈ సినిమాను ఓవర్సీస్‌లో అత్యధిక థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. కాపీ రైట్ లీగల్ ఇష్యూస్ కారణంగా ఈ సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

వెండితెర వైఎస్సార్..!



మమ్ముట్టి

బాలీవుడ్‌లోనే కాదు, టాలీవుడ్‌లోనూ బయోపిక్‌ల జోరు ఊపందుకుంటోంది. ఇప్పటికే ఎన్టీఆర్, సావిత్రి, పుల్లెల గోపీచంద్ బయోపిక్‌లు తెరకెక్కుతున్నాయి. తాజాగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవితం ఆధారంగా ఓ బయోపిక్‌ను రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారు. గతేడాది 'ఆనందో బ్రహ్మ' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని తీసిన దర్శకుడు మహి.వి.రాఘవ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని సమాచారం. వైఎస్‌పై సినిమా తీసేందుకు ఆయన తనయుడు, వైఎస్‌ఆర్‌సీపీ అధినేత జగన్ కూడా అంగీకరించినట్టు తెలుస్తోంది. వెండితెర వైఎస్సార్‌గా మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించే అవకాశాలున్నాయట.




అర్జున్ యజత్, సౌమ్య వేణుగోపాల్

మూడు పువ్వులు ఆరు కాయలు

ప్రముఖ మాటల రచయిత రామస్వామి దర్శకుడిగా మారుతూ రూపొందిస్తున్న నూతన చిత్రానికి 'మూడు పువ్వులు ఆరు కాయలు' అనే టైటిల్ నిర్ణయించారు. అర్జున్ యజత్, భరత్ బండారు, రామస్వామి హీరోలుగా, సౌమ్య వేణుగోపాల్, పావని, సీమా చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డా॥మల్లె శ్రీనివాసరావు సమర్పణలో స్మైల్ పిక్చర్స్ పతాకంపై వబ్బిన వెంకటరావు నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, 'ప్రేమ గొప్పదే.. కానీ జీవిత లక్ష్యం ఇంకా గొప్పది. ప్రేమంటే చంపడమో, చావడమో కాదు. చచ్చే దాకా కలిసి బతకడం. కన్నవాళ్ళ కలలతోపాటు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలిగితే ప్రతి ఒక్కరి జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందనే కథాంశంతో రూపొందిస్తున్న చిత్రమిది. నవ్వినా.. ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి. కడుపుబ్బా నవ్వించే హాస్యరసంతోపాటు కంటతడి పెట్టించే కరుణరసం కూడా ఉంటుంది. దాదాపు 40 సినిమాలకుపైగా మాటల రచయితగా పనిచేసిన రామస్వామిని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని నిర్మించడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'దర్శకుడుగా నాకిది తొలి చిత్రం. మంచి కాన్సెప్ట్‌తో సకుటుంబాన్ని అలరించేలా తెరకెక్కించాను' అని దర్శకుడు తెలిపారు. 'షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేస్తున్నాం' అని సమర్పకులు డాక్టర్ మల్లె శ్రీనివాసరావు చెప్పారు.

మరుగుజ్జుగా షారూఖ్ సందడి



షారూఖ్ ఖాన్

ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వంలో షారూఖ్‌ఖాన్ ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి 'జీరో' అనే టైటిల్ ఖరారు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం టైటిల్ పోస్టర్‌తోపాటు ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. ఇందులో మరుగుజ్జుగా కనిపిస్తున్న షారూఖ్‌ని చూస్తే ఎవ్వరైనా సరే సంభ్రమాశ్చర్యాలకు లోనవ్వాల్సిందే. ప్రోస్తటిక్స్‌తో తయారు చేసిన చేతులు, కాళ్లతో షారూఖ్ ఓ చిన్న బాలుడ్ని తలపించే మరుగుజ్జుగా కనిపిస్తున్నారు. ఇక టీజర్‌లో మరుగుజ్జుగా షారూఖ్ పాట పాడుతూ, స్టెప్పులేస్తున్న దృశ్యాలు ఆద్యంతం ఆసక్తికరంగా ఉన్నాయి. ఈ చిత్రంలో షారూఖ్ సరసన కత్రీనా కైఫ్, అనుష్క శర్మ కథానాయికలుగా నటిస్తున్నారు. అలాగే సల్మాన్ ఖాన్, దీపికా పదుకొనె, శ్రీదేవి, కాజోల్, అలియా భట్ వంటి పలువురు బాలీవుడ్ స్టార్స్ అతిథి పాత్రల్లో మెరవనున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది.



చిత్రా శుక్లా

నవ్య కథతో రంగుల రాట్నం

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'రంగుల రాట్నం'. చిత్రా శుక్లా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీరంజని దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ ఈచిత్రాన్ని నిర్మిస్తోంది. సంక్రాంతికి విడుదల కాబోతున్న ఈ సినిమా గురించి చిత్ర బృందం చెబుతూ, 'గతేడాది 'రారండోయ్ వేడుక చూద్దాం', 'హలో' వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించిన అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ తాజాగా 'రంగుల రాట్నం' చిత్రాన్ని నిర్మించింది. ఈ చిత్రానికి సంబంధించి చిత్రీకరణ మొత్తం పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. రాజ్ తరుణ్‌తో 'ఉయ్యాలా జంపాలా' వంటి సూపర్‌హిట్ చిత్రాన్ని నిర్మించిన అన్నపూర్ణ స్టూడియోస్ మళ్ళీ ఆయన హీరోగా ఈ సినిమాను నిర్మించడం విశేషం. నవ్యకథతో తెరకెక్కుతున్న ఈ సినిమాను ఈ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు' అని తెలిపింది. సితార, ప్రియదర్శి ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: ఎల్.కె.విజయ్, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, ఆర్ట్: పురుషోత్తం ఎం.

నిజాయితీగా ఆలోచించండి..

'నా జీవితానికి సరైన అర్థానిచ్చిన అభిమానులకు కృతజ్ఞతలు. అభిమానుల ప్రేమానురాగాలు నా జీవితాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాయి' అని నయనతార అన్నారు. స్టార్ హీరోలకు దీటుగా రాణిస్తున్న కథానాయికల్లో నయనతార ఒకరు. ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళంలో అరడజనుకుపైగా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. స్టార్ హీరోలకున్నంతగా ఫ్యాన్ ఫాలోయింగ్‌నూ సొంతం చేసుకున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా అభిమానులకు నయనతార ఓ లేఖ రాశారు. 'నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన అభిమానులకు కృతజ్ఞతలతోపాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు. మీ ప్రేమానురాగాలు నా జీవితాన్ని అందంగా మార్చాయి. శ్రమను మాత్రమే నమ్ముకుని, మిగిలిన విషయాలను భగవంతుడికే వదిలేయాలన్న విషయాన్ని మీ ద్వారా తెలుసుకున్నా. నేను వాణిజ్య చిత్రాలే కాకుండా 'ఆరం' వంటి సందేశాత్మక సినిమాల్లో కూడా నటించగలనని మీ ప్రేమతో, ఆదరాభిమానాలతో నిరూపించారు. నాకు సపోర్ట్ చేసిన మీడియా, పాత్రికేయులు, సోషల్ మీడియా, క్రిటిక్స్, సినీ పెద్దలకు థ్యాంక్స్. ప్రజలు తమ హృదయాల్లో నాకు చోటు కల్పించినందుకు హ్యాపీగా ఉంది. 2018 అందరికీ మరింత ఆనందాన్ని చేకూర్చే విధంగా ఉంటుందని నమ్ముతున్నా. ఎప్పుడూ నిజాయితీగా ఆలోచించండి' అని లేఖలో పేర్కొన్నారు. నయనతార ప్రస్తుతం 'జై సింహా', 'సైరా నరసింహారెడ్డి', 'ఇమైక్కా నోడిగల్', 'కొలైయుథిర్ కాలమ్', 'కోలమవు కోకిలా' చిత్రాల్లో నటిస్తోంది.



నయనతార

జైలుకు గజల్ శ్రీనివాస్

లైంగిక వేధింపుల కేసులో 12 రోజుల రిమాండ్



నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ లైంగిక వేధింపుల కేసులో అరెస్టై జైలుకు వెళ్లారు. ఆయనపై హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఆలయవాణి వెబ్ రేడియో జాకీగా పనిచేస్తున్న యువతిని రెండు నెలల నుంచి లైంగికంగా వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలు పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసుకు సంబంధించి పంజాగుట్ట ఏసీపీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు... గతేడాది ఉపాధి కోసమని నగరానికి వచ్చిన అమ్మాయి గజల్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న ఆలయవాణి వెబ్ రేడియోలో జాకీగా చేరింది. ఆ కార్యాలయం పంజాగుట్టలోని వెంకటరమణ కాలనీలో ఉంది. అయితే, రెండు నెలల నుంచి శ్రీనివాస్ బాధితురాలిని వేధిస్తున్నాడు. తాను చెప్పినట్టు వినకుంటే ఉద్యోగం నుంచి తీసేస్తానని బెదిరిస్తూ వాట్సప్ ద్వారా అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలు పెడుతున్నాడు. రెండు నెలల నుంచి మసాజ్ చేయాలంటూ ఒత్తిడి చేస్తుండడంతో బాధితురాలు డిసెంబర్ 29న పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. కొన్ని ఆడియో టేపులు, క్లిప్పింగ్స్ స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న మిగతావారినీ విచారించారు. పూర్తి ఆధారాలు సేకరించాక గజల్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్టు ఏసీపీ తెలిపారు. అతనిపై ఐపీసీ 354, 354ఏ, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

బెయిల్ నిరాకరణ... 12 రోజుల రిమాండ్

గజల్ శ్రీనివాస్‌ను పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం అతనికి మెజిస్ట్రేట్ 10 రోజుల రిమాండ్ విధించారు. న్యాయమూర్తి రిమాండ్ ప్రకటించిన వెంటనే శ్రీనివాస్ తరపు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టులో వాదోపవాదనల అనంతరం విచారణను వాయిదా వేశారు. ఆ తర్వాత శ్రీనివాస్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అతని బెయిల్‌పై గురువారం నిర్ణయం తీసుకునే అవకాశముంది. మరోవైపు పంజాగుట్ట పోలీసులు మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరనున్నట్టు సమాచారం.

ఎలాంటి వేధింపులకు పాల్పడలేదు: శ్రీనివాస్

కొద్దిరోజుల కిందట ప్రమాదంలో గాయపడ్డాను. అప్పటి నుంచి భుజం, కాలు నొప్పితో బాధపడుతున్నాను. ప్రతిరోజూ ఫిజియోథెరపీ చేయించుకుంటున్నా. తన కార్యాలయంలో పనిచేస్తున్న యువతి తనకు ఫిజియోథెరపీ వచ్చని.. వద్దన్నా వినకుండా ఆమెనే మసాజ్ చేసింది. అంతే తప్ప తాను ఎలాంటి లైంగిక వేధింపులకు పాల్పడలేదు.

మరిన్ని విషయాలు వెలుగులోకి

శ్రీనివాస్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలు పక్కా సాక్ష్యాలను పోలీసులకు అందజేసింది. శ్రీనివాస్ ఇంట్లో పని మనిషితో మసాజ్ చేయించుకుంటున్న వీడియోలనూ ఇచ్చింది. ఆఫీస్‌లో బెడ్‌రూం ఏర్పాటు చేసుకున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలను పోలీసులకు అందజేసింది. పోలీసులు పనిమనిషి పార్వతి స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డ్ చేశారు.

ఎన్ఎస్ఎస్‌లో రాష్ట్ర వాలంటీర్లకు అవార్డులు

- ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో రాష్ట్ర వాలంటీర్లను పలు కేంద్ర ప్రభుత్వ అవార్డులు వరించాయి. 2016-17 సంవత్సరానికిగాను కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ప్రకటించిన అవార్డుల్లో నాలుగింటిని రాష్ట్రం దక్కించుకుంది. ఉత్తమ యూనిట్ అవార్డును మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన అనురాగ్ గ్రూప్ విద్యా సంస్థలకు, ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డును అనురాగ్ గ్రూప్ ప్రోగ్రాం ఆఫీసర్ సి.మల్లేశ్‌కు అందుకున్నారు. అలాగే ఉత్తమ వాలంటీర్లుగా ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి చెందన తగరపు నవీన్, జెఎన్‌టీయూ(హెచ్)కు చెందిన పలుకూరి లలిత్ ఆదిత్య గత నెలలో అందుకున్నారు. తనను కలవడానికి వచ్చిన వీరిని మంగళవారం సీఎం కేసీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ లైజనింగ్ అధికారి డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడిసిన్ సీట్ల క్రీడాకోటాపై విచారణ జరిపించండి

- సీఎస్‌కు సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

క్రీడాకోటాలో కేటాయించిన మెడిసిన్ సీట్లపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌కు ఆయన లేఖ రాశారు. లేఖతో పాటు 'నవతెలంగాణ' దినపత్రికలో సోమ, మంగళవారాల్లో ఇదే అంశంపై ప్రచురితమైన కథనాలను జతచేశారు. విచారణలో అక్రమాలు వాస్తవమని తేలితే, ఆయా అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

బీజేపీ పాలిత జార్ఖండ్‌లో మరో ఆకలి చావు..

- ఆహారం అందక నీరసంతో 67 ఏండ్ల వృద్ధురాలి మృతి
- ఆధార్ లేనందున రేషన్ నిరాకరించడమే కారణం
- రైట్ టు ఫుడ్ క్యాంపెయిన్ నిజ నిర్ధారణలో వెలుగు చూసిన సంఘటన



రాంచి: జార్ఖండ్‌లో మరో ఆకలిచావు సంఘటన జరిగింది. గఢ్వా జిల్లా సోన్‌పూర్వ గ్రామానికి చెందిన 67 ఏండ్ల ఎత్వారియాదేవి రోజుల తరబడి ఆహారం లేక నీరసించి చనిపోయారు. ఈ సంఘటన గత నెల(డిసెంబర్) 25న జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద చౌక ధరల దుకాణాల ద్వారా సబ్సిడీ ధరకు అందించాల్సిన ఆహార ధాన్యాన్ని నిరాకరించడం వల్లే ఆమె మరణానికి దారి తీసినట్టు స్వచ్ఛందసంస్థ రైట్ టు ఫుడ్ క్యాంపెయిన్ తన నిజనిర్ధారణ నివేదికలో స్పష్టం చేసింది. ఎత్వారియాదేవి కుటుంబం తమ రేషన్‌కార్డుకు ఆధార్‌ను లింక్ చేయలేదన్న కారణంతో గతేడాది అక్టోబర్ నుంచి ప్రభుత్వం అందించే ఆహారధాన్యాన్ని పొందలేకపోయింది. మరోవైపు ఇంటర్‌నెట్ కనెక్షన్‌లో సమస్యలు తలెత్తడంతో సాంకేతిక కారణాలు చూపి ఆమెకు రావాల్సిన వృద్ధాప్య పింఛన్‌ను కూడా గతేడాది నవంబర్ నుంచి నిలిపివేశారు.

ఎత్వారియాదేవికి కుమారుడు, కోడలు, ముగ్గురు మనువళ్లు-మనవరాళు ఉన్నారు. రోజువారీ ఆహారం కోసం ఈ కుటుంబం ఇరుగుపొరుగుపై ఆధారపడేది. మూడు నెలలుగా పస్తులుంటూ కాలం గడిపారు. చాలీచాలని ఆహారంతో ఆమె నీరసించి చనిపోయినట్టు నిజనిర్ధారణ కమిటి విచారణలో తేలింది. గత కొన్ని నెలల్లో ఇది తాము గుర్తించిన ఐదో ఆకలి చావని కమిటీ సభ్యుడు సిరాజ్‌దత్తా తెలిపారు. ఎత్వారియాదేవిలాగే జార్ఖండ్‌లో 11 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులను తొలగించారని రైట్ టు ఫుడ్ సంస్థ తెలిపింది. దీంతో, 25 లక్షలమంది బాధితులుగా మారారని ఆ సంస్థ తెలిపింది. రేషన్‌కార్డులకు ఆధార్ లింక్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో ఆదేశాలు జారీ చేసిన తర్వాతే ఈ సంఘటనలు జరగడం గమనార్హం. గతేడాది మార్చిలో జార్ఖండ్ ప్రభుత్వం ఆధార్ లింక్ లేనిపక్షంలో రేషన్ కార్డులు తొలగిస్తామని ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం ఆదేశాలకన్నా ముందే జార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఆధార్‌తో అనుసంధానం చేయని కారణంతో రేషన్ కార్డులను తొలగించిన సంఘటనలు వెలుగు చూశాయి. ఈ రెండు రాష్ట్రాలు బీజేపీ పాలనలో ఉన్నాయి. ఆధార్ లింక్ లేనంత మాత్రాన సంక్షేమ పథకాలను నిలిపి వేయరాదంటూ 2013 నుంచి పలుమార్లు సుప్రీంకోర్టు ఆదేశించినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం గమనార్హం. సంతోషికుమారి ఆకలి చావు సంఘటనతో కేంద్ర ప్రభుత్వంలో కదలిక వచ్చింది. జార్ఖండ్‌లోని సిమ్డేగా జిల్లాకు చెందిన 11 ఏండ్ల సంతోషి నాలుగురోజులపాటు ఎలాంటి ఆహారం లేక సెప్టెంబర్ 28న చనిపోయారు. జార్ఖండ్ ప్రభుత్వం సంతోషి కుటుంబానికి గతేడాది ఫిబ్రవరి నుంచి రేషన్ తొలగించింది. సంతోషి సంఘటన తర్వాత గతేడాది అక్టోబర్‌లో ఆధార్ లేని కారణంగా రేషన్ కార్డులను తొలగించొద్దంటూ రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. దీంతో, జార్ఖండ్ ప్రభుత్వం కూడా తమ మునుపటి ఆదేశాలను వెనక్కి తీసుకున్నది. అయితే, క్షేత్రస్థాయిలో మాత్రం రేషన్‌కార్డుల పునరుద్ధరణ జరగలేదని స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన ప్రజా విచారణలో వెల్లడైంది. జార్ఖండ్‌లోని లాతేహార్‌లో డిసెంబర్ 8న ఆ సంస్థ ఈ విచారణ జరిపింది. ఆధార్‌లింక్ లేని కారణంగా తమ రేషన్‌కార్డులను తొలగించినట్టు పలువురు బాధితులు ఆ సందర్భంగా వెల్లడించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 పైగా సీట్లు



- టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- కేసీఆర్ చెప్పే అబద్ధాలను తిప్పికొట్టాలని పిలుపు
- కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటీసీ, ఎంఐఎం నేత బిలాల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కేసీఆర్ అబద్దాలు, మోసాలతో పాలన చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. కేసీఆర్ చెప్పే అబద్ధాలను తిప్పికొట్టాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. టీఆర్ఎస్ నిజస్వరూపాన్ని బయట పెట్టి కేసీఆర్ ఎత్తుగడలను చిత్తు చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తోందని, 70 స్థానాలకు పైగా సీట్లు వస్తాయని, పాలమూరు జిల్లాల్లో అన్ని సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. హన్వాడ మండలం జడ్పిటీసీ నారాయణమ్మ, ఆమె కుమారుడు సురేందర్‌రెడ్డి, ఎంఐఎం మాజీ కార్పొరేటర్ బిలాల మంగళావారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కు మార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారినుద్దేశించి ఉత్తమ్ మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు. రైతులు అనేక రకాల ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు వారిని మోసం చేసేందుకు 24 గంటల కరెంట్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మహబూబ్ నగర్‌లో అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు ఉన్నారని, వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ విజయా న్ని ఎవరు ఆపలేరన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే రైతులకు 2 లక్షల రూపాయలు ఏకకాలంలో రుణ మాఫీ చేస్తామని, రైతులకు పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పిస్తామని, నిరుద్యోగులకు భతి ఇవ్వడంతోపాటు వారికి మెరు గైన శిక్షణ కార్య క్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా మాట్లాడుతూ తెలం గాణలో కాంగ్రెస్ పార్టీ చాలా బలంగా తయారైంద న్నారు. రాబోయే కాలంలో కేంద్రంలోను, రాష్ట్రంలో ను కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాహుల్ గాంధీ నేతత్వంలో దేశంలో కాంగ్రెస్ బలోపేతమైందన్నారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ మాటలు, మూటల ముఖ్యమంత్రిగా మారారని చెప్పారు. తెలంగాణలో టీఆర్ఎస్ నాయకుల దౌర్జన్యాలు పెరిగిపోయాయ న్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చిన్నారెడ్డి, సంపత్‌కుమార్, మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, మైనారిటీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

డీ లిమిటేషన్‌కు వ్యతిరేకం?

అధికార టీఆర్ఎస్ ప్రయత్నిస్తున్న నియోజక వర్గాల డీలిమిటేషన్‌ను గట్టిగా వ్యతిరేకించాలని కాంగ్రెస్ నిర్ణయించినట్టు తెలిసింది. డీ లిమిటేషన్ చేసిన నియోజకవర్గాలను పార్టీ ఫిరాయింపు చేసిన వారికి అప్పగించేందుకు టీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. మంగళవారం గాంధీ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలతో కుంతియా భేటీ అయ్యారు. తాజా రాజకీయాల అంశాలతోపాటు డీ లిమిటేషన్‌పై పార్టీ వైఖరి ఎలా ఉండబోతుందనే అంశంపై సీనియస్‌గా చర్చించినట్టు తెలిసింది. డీ లిమిటేషన్ వల్ల పార్టీకి లాభం కంటే నష్టమే జరుగుతుందన్న అభిప్రాయానికొచ్చారు. బీజేపీ అండదండలతో డీ లిమిటేషన్ బిల్లును టీఆర్ఎస్ లోక్‌సభలో ఆమోదింప చేసుకున్నా...రాజ్యసభలో కాంగ్రెస్ అడ్డుకునేందుకు ప్రయత్నం చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

మొదటిపేజీ తరువాయి

ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిగా శాంతికుమారికి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఇదే మాదిరిగా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శిగా అరవింద్ కుమార్, బీసీ సంక్షేమశాఖ కార్యదర్శిగా బుర్రా వెంకటేశంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్‌గా నవీన్ మిట్టల్, విపత్తు నిర్వహణ కమిషనర్‌గా ఆర్.వి.చంద్రవదన్, పశుసంవర్ధకశాఖ కార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానియా, బీసీ సంక్షేమశాఖ కమిషనర్‌గా అనితా రాజేంద్ర, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా దానకిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీనియర్ ఐఏఎస్ సోమేష్‌కుమార్‌కు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌గా క్రిస్టినా, ఎస్సీ అభివద్ధిశాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధప్రకాశ్, భూ పరిపాలన సంచాలకులుగా వాకాటి కరుణ, రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శిగా ఇలంబర్తి, సైనిక సంక్షేమ సంయుక్త కార్యదర్శిగా చంపాలాల్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంచాలకులుగా ప్రీతిమీనాను నియమించారు. ఇక కలెక్టర్ల విషయానికొస్తే.. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఒమర్ జలీల్, నిజామాబాద్ కలెక్టర్‌గా ఎం.ఆర్.ఎం.రావు, పెద్దపల్లి కలెక్టర్‌గా దేవసేనను నియమించారు. జనగామ కలెక్టర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. మెదక్ కలెక్టర్‌గా మాణిక్‌రాజు, మహబూబాబాద్ కలెక్టర్‌గా లోకేశ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ప్రణాళికా బోర్డు కార్యదర్శిగా శివకుమార్ నాయుడు, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా అశోక్‌కుమార్, ఢిల్లీలో తెలంగాణ భవన్ ఓఎస్‌డీగా కాళీచరణ్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా భారతి హెూళికేరి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా సిక్తా పట్నాయక్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ముషారఫ్ అలీ, రాష్ట్ర ఆర్క్యూస్ డైరెక్టర్‌గా ఎ.మురళి నియమితులయ్యారు. బోధన్ సబ్ కలెక్టర్‌గా అనురాగ్ జయంతి, మెట్‌పల్లి సబ్ కలెక్టర్‌గా గౌతమ్, భద్రాచలం సబ్ కలెక్టర్‌గా పమేలా సత్పతి, బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా రాహుల్‌రాజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ బదిలీలకు సంబంధించి జనగామ కలెక్టర్ దేవసేనకు స్థాన చలనం కలగటం చర్చనీయాంశమైంది. స్థానిక ఎమ్మెల్యే భూ దందాలను తీవ్రంగా వ్యతిరేకించి వార్తల్లో నిలిచిన ఆమెను పెద్దపల్లి కలెక్టర్‌గా బదిలీ చేయటం గమనార్హం.

వృద్ధ దంపతుల హత్య

మొదటిపేజీ తరువాయి

ఇంట్లో పడుకున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లోకి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపేశారు. మంగళవారం ఉదయం పాలుపోసే వ్యక్తి వచ్చి పిలవగా ఎంతకూ పలకలేదు. డోర్ తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బాత్రూం వద్ద పూలమ్మ రక్తపు మడుగులో పడి ఉంది. దీంతో చుట్టుపక్కల వారికి, పోలీసులుకు సమాచారం అందించారు. డీసీపీ వెంకట్‌రెడ్డి, ఏసీపీ సత్య నారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో అనుమానిత ప్రాంతాల్లో ఆధారాలు సేకరించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ మృతదేహాలకు ఎంజీఎంలో పోస్టుమార్టం చేశారు. అనంతరం ఆ మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఎల్లయ్య మొదటి భార్యకు రమేష్, శ్రీనివాస్, తిరుపతి అనే కుమారులున్నారు. కొద్ది కాలంగా వారి మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నట్టు తెలిసింది. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు డీసీపీ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

ఎగుమతుల్లోనూ చిట్టచివరే !

మొదటిపేజీ తరువాయి

ప్రభావం ముఖ్యమైనదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతు న్నారు. జీఎస్టీ అమలులో లోపాల కారణంగా చిన్న, మధ్యతరగతి వ్యాపా రులు ఎక్కువగా దెబ్బ తింటున్నారు. ఉపాధి కల్పనపై సర్కారు మరింత దృష్టి కేంద్రీకరిస్తే తప్ప ఈ రంగాల నుంచి ఎగుమతులు పెరిగే అవకాశం లేదు.

కేసీఆర్ సమర్థత వల్లే 24 గంటల కరెంట్:పల్లా

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సమర్థవంతమైన చర్యల వల్లే మూడున్నరేండ్లలోనే పసికూన తెలంగాణ చీకట్లను తరిమేసి వెలుగులు మిరుమిట్లు కొలిపే రాష్ట్రంగా కీర్తించబడుతున్నదని శాసనమండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కరెంట్ అంశమే ప్రధానంగా మారిందన్నారు. 24 గంటల కరెంటు ఇస్తే తానే స్వయంగా టీఆర్ఎస్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారి కారు గుర్తుకు ఓటు వేయమని అడుగుతానని విపక్షనేత జానారెడ్డి అసెంబ్లీలోనే చెప్పారని అన్నారు. ఎంతోమంది ఎగతాళి చేశారని చెప్పారు. ఇతర రాష్ట్ర అధికారులు, కేంద్రమంత్రులు రాష్ట్ర ప్రభుత్వ పనితీరును అభినందిస్తున్నారని చెప్పారు. కరెంట్ తీగలు పట్టుకుని చూస్తే మతలబు ఏంటో అర్థమవుతుందని ప్రతిపక్షనేతలపై మండిపడ్డారు.

పవనే కేసీఆర్‌ను కలిశారు

పవన్ కల్యాణ్ ఎవరో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలియదని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి తెలిపారు. పవన్ సినిమాలను కూడా కేసీఆర్ చూడనప్పుడు ఆయన ఎలా తెలుస్తారని ప్రశ్నించారు. ప్రగతిభవన్‌లో పవన్ భేటీపై ప్రశ్నించగా పై విధంగా మాట్లాడారు. రాష్ట్రపతి కోవింద్ వచ్చిన సంద ర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కెసిఆర్‌ను పవన్ కలిశారని తెలిపారు. ఆ రోజు తాను కేసీఆర్‌ను కలుస్తానని అపాయింట్‌మెంట్ కోరారని చెప్పారు. జనసేన పార్టీకి విది విధానాలు కూడా లేవన్నారు. అలాంటిది చర్చలేముం టాయని ప్రశ్నించారు. వారిద్దరి భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని తెలిపారు.

వరించేదెవరిని..!

మొదటిపేజీ తరువాయి

ఉండాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.కాగా ఆశలు పెట్టుకున్న వారిలో ఎంతమందికి సీట్లు వరిస్తాయన్న దానిపై చర్చ మొదలైంది.అధికార టీఆర్ఎస్‌పార్టీలో ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు, నిజామాబాద్ ఎంపీ కవిత, కరీంనగర్ వినోద్‌కుమార్ అసెంబ్లీకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే వారు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్లారని తెలిసింది. కవిత జగిత్యాల నుండి పోటీ చేయడం ఖాయమని ఇప్పటికే ముమ్మర ప్రచారం జరుగుతున్నది. మీడియాలో కథనాలు వచ్చినా కవిత గానీ, ఆమె మద్దతుదారులుగానీ ఖండించలేదు. ముఖ్యమంత్రి ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని చెప్పారు. కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వంలో చేరితే కవితకు మంత్రి పదవి రావడం ఖాయమని ప్రచారం జరిగింది. అదేవిధంగా వినోద్‌కుమార్ కూడా అసెంబ్లీకి రావాలని ఎంతో ఆశతో ఉన్నారు. వేములవాడ నుంచి గానీ, భూపాలపల్లి నుంచి గానీ ఏదో ఒక చోట పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. ఇంకా ఎంపీలు నగేశ్, మల్లారెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతారాం నాయక్, బూర నర్సయ్యగౌడ్ అసెంబ్లీకి వచ్చేందుకు మక్కువ చూపుతున్నారు. ఇప్పటికే వరంగల్ ఎంపీగా పోటీ చేసి గెలిచిన కడియం శ్రీహరి రాజీనామా చేసి రాష్ట్ర క్యాబినెట్‌లో అడుగుపెట్టిన వచ్చిన విషయం తెలిసిందే. నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా రాష్ట్రంలో ఉండేందుకు సిద్ధపడ్డారు. వారి కోరికలను కేసీఆర్ తీరుస్తారా, లేదా అన్నది వేచి చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ప్రతిపక్ష పార్టీల్లోనూ ఇదే ఆలోచన..

ప్రతిపక్ష పార్టీల్లోనూ ఇదే ఆలోచన ఉన్నట్టు ఉందని తెలిసింది. అయితే ఎంపీల నుంచి ఎమ్మెల్యేలుగా మారేందుకు కాదు. ఎమ్మెల్యే నుంచి ఎంపీగా వెళ్లేందుకు యోచిస్తున్నారు. బీజేపీలో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ లోక్‌సభ సీటుపై కన్నేశారు. ఆయన తన అభిప్రాయాన్ని బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. అదే స్థానాన్ని లక్ష్మణ్ కూడా ఆశిస్తున్నారని తెలిసింది. దత్తాత్రేయకు సీటు నిరాకరిస్తే ఆ స్థానంలో బీసీగా ఉన్న తనకే ఇవ్వాలని లక్ష్మణ్ కోరినట్టు సమాచారం. కాంగ్రెస్‌పార్టీలో గత ఎన్నికల్లో లోక్‌సభకు పోటీ చేసిన వారంతా అసెంబ్లీకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సర్వే సత్యనారాయణ, అంజన్‌కుమార్ యాదవ్, జైపాల్‌రెడ్డి, బలరాంనాయక్ లాంటివారు అసెంబ్లీవైపు మక్కువ చూపినట్టు తెలిసింది.

ఎట్టకేలకు ఎస్సీ,ఎస్టీ కమిషన్

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మూడున్నర ఏండ్ల తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన దస్త్రంపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు మంగళవారం సంతకం చేశారు. కమిషన్ చైర్మెన్‌గా సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం ఘనపూర్‌కు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను చైర్మెన్‌గా ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన బోయిళ్ల విద్యాసాగర్, రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పొడగుగుట్ట తాండకు చెందిన ఎం రాంబల్ నాయక్, ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పాయగూడకు చెందిన కుర్సుంనీలాదేవి, హైదరాబాద్‌కు చెందిన సుంకపాక దేవయ్య, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామానికి చెందిన చిలుకమర్రి నర్సింహాను నియమించింది.

2001లో తొలి కమిషన్

ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 2001 అక్టోబర్‌లో తెలుగుదేశం ప్రభుత్వం 11మంది సభ్యులతో జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దళిత, గిరిజనుల సంక్షేమం కోసం తీసుకోవల్సిన చర్యలపై 2002లో కేవీపీఎస్‌తో పాటు ఇతర దళిత సంఘాలు 42 అంశాలతో కూడిని ఒక నివేదికను అందజేశాయి. ఈ సూచనలకు అప్పటి క్యాబినెట్ ఆమోదం తెలి పింది. వాటి అమలు కోసం కమిషన్ కొంత కృషి చేసింది. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి న తర్వాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మేకల నాగార్జున కమిషన్ ఏర్పాటు చేశారు.

దాడులు అరికట్టేనా?

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో దళిత, గిరిజనులపై దాడులు అధికమయ్యాయి. ఈ మూడున్నర సంవత్సరాల్లో 12 కుల దురహంకార హత్యలతో పాటు, దళితులపై దాడులు జరిగాయి. ప్రధానంగా దళితులను ప్రేమించినందుకు, పెండ్లి చేసుకున్నందుకు దళిత, యువతీ.. యువకులను అత్యంత దారుణంగా హత్య చేశారు. ఈ హత్యల్లో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నియమించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ దళితులపై దాడులు, హత్యలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది.

నిష్పక్షపాతంగా కమిషన్ పని చేయాలి (కేవీపీఎస్)

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను నియమించినందుకు కేవీపీఎస్ హర్షం వ్యక్తం చేసింది. దళిత, గిరిజనుల సంక్షేమం కోసం కమిషన్ నిష్పక్షపాతంగా పని చేయాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో దళిత, గిరిజనులపై పెరుగుతున్న దాడులు, కుల వివక్షత, అంతరాలను తొలగించేందుకు కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె భాస్కర్, టి స్కైలాబ్ బాబు కోరారు.

నెలకో పథకం ప్రారంభం

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా జనవరి మొదటి రోజున రాష్ట్రంలో 24 గంటల విద్యుత్‌ను ప్రారంభించినట్టుగానే, ఇకనుంచి నెలకో పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేస్తారని టీఆర్ఎస్‌పార్టీ నేతలు, ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. 24 గంటల విద్యుత్ వల్ల రాష్ట్రంతో పాటు మిగతా రాష్ట్రాల్లోనూ చర్చనీయాం శమైందని టీఆర్ఎస్‌పార్టీ వర్గాలు అంటున్నాయి. ప్రధానమంత్రి కార్యాలయం కూడా ఆరా తీసిందని తెలిసింది. దేశవ్యాప్తంగా ఉన్న పత్రికలకు యాడ్‌లు ఇవ్వడంతో 24 గంటల విద్యుత్‌పై అన్నిచోట్ల చర్చ జరిగిందని, దానిపై ఆ రాష్ట్రాల అధికారులు మెచ్చుకున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వరుసగా భూ ప్రక్షాళన కార్డులు అందజేయడం, మిషన్ భగీరథ నీటిని ప్రారంభించడం, కాళేశ్వరం నీటిని విడుదల చేయడం, రైతులకు ఎకరానికి రెండు విడతలుగా నాలుగు వేల చొప్పున ఎనిమిది వేలు అందించడం, డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వడం, మిషన్ కాకతీయను నాలుగో దశను ప్రారంభించడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై శాశ్వత నిర్ణయం వంటి వాటిపై నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని చెబుతున్నారు. వీటన్నింటినీ ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గరుండి పర్యవేక్షణ చేస్తారని తెలుస్తోంది.

మహా మంటలు

మొదటిపేజీ తరువాయి



ఆందోళనకు దిగారు. పలుచోట్ల దళితులు రాస్తా రోకో చేపట్టారు. ఈస్టర్న్ హైవే, హార్బర్ లైన్‌లపై ఆందోళనలు చేశారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామైంది.బస్సులు,రైళ్ల రాకపోకలపై నిరసన ప్రభావం పడింది. ఇదే అదనుగా చేసుకుని కొందరు సంఘ వ్యతిరేక శక్తులు వాహనాలకు నిప్పు పెట్టాయి. దళితుల ఆందోళనలను నిలువరించాలన్న అగ్రవర్ణాల ప్రయత్నంతోనే హింసాత్మక ఘటనలకు దారితీశాయని దళిత నేతలు ఆరోపిస్తున్నారు. అగ్రవర్ణాలను వదిలిపెట్టి ఔరంగాబాద్‌లో పోలీసులు దళితులపైనే ప్రతాపం చూపారు. తుపాకులు ఎక్కుపెట్టారు. పలువురికి గాయాలయ్యాయి. అదుపుతప్పిన శాంతి భద్రతలను పరిరక్షించడానికి భారీగా భద్రత బలగాలను రంగంలోకి దింపారు. పాఠశాలలు, కాలేజీలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

పుకార్లను నమ్మొద్దు : మహారాష్ట్ర సీఎం

భీమా-కోరెగావ్ యుద్ధం 200వ వార్షికోత్సవం సందర్భంగా పుణె జిల్లాలో చెలరేగిన హింసాత్మక ఘటనలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి జ్యుడిషియల్ దర్యాప్తుకు ఆదేశించారు. పుకార్లను నమ్మవద్దని ప్రజలు శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. దళితుడి హత్యకు దారితీసిన వాస్తవ పరిస్థితులపై దర్యాప్తుకు ఆదేశించామని చెప్పారు. 'కోరెగావ్ - భీమ్ యుద్ధం వార్షికత్సవాల సందర్భంగా దాదాపు మూడు లక్షల మంది గుమిగూడారు. భారీ భద్రతను ఏర్పాటుచేశాం. కానీ, ఆ ప్రాంతంలో ఘర్షణలు తలెత్తాయి. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. పుకార్లు నమ్మొద్దు, ఘటనపై హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తితో దర్యాప్తుకు ఆదేశించాం. బాధిత కుటుంబానికి రూ. 10 లక్షలు నష్టపరిహారాన్ని చెల్లిస్తాం' అని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ చెప్పారు.

హిందూత్వవాదుల హస్తం : ఎన్‌సీపీ

బయటి నుంచి వచ్చిన హిందూత్వవాదులు హింసను రెచ్చగొట్టారని ఎన్‌సీపీ నేత శరద్ పవర్ అన్నారు. తాను స్థానికులతో మాట్లాడాననీ ఆయన అన్నారు. కాగా, దాడులు ముందస్తు ప్రణాళిక ప్రకారం చేసినవేనని కాంగ్రెస్ ఆరోపించింది.

నేడు మహారాష్ట్ర బంద్

పథకం ప్రకారమే దాడి : ప్రకాశ్ అంబేద్కర్



దళితులపై దాడి ఘటనకు నిరసనగా బుధవారం మహారాష్ట్ర బంద్‌కు దళిత నేతలు పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు, దళిత నేత ప్రకాశ్ అంబేద్కర్ బంద్‌కు పిలుపునివ్వగా ఇతర దళిత సంఘాలు మద్దతు పలికాయి. మితవాద సంస్థలు ముందస్తు ప్రణాళిక ప్రకారమే ఈ దాడికి పాల్పడ్డాయని ప్రకాశ్ అంబేద్కర్ ఆరోపించారు. 'దళితులంతా శాంతియుతంగా ఉండాలి. బుధవారం బంద్ కూడా శాంతియుతంగా నిర్వహించాలి' అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బంద్‌కు డీఎస్ఎంఎం మద్దతు

మహారాష్ట్ర బంద్‌కు డీఎస్ఎంఎం మద్దతు పలికింది. బుధవారం జరిగే బంద్‌కు లౌకిక, ప్రజాతంత్ర శక్తులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.



ఆర్ఎస్ఎస్, శివసేన పరివార్ కాషాయ జెండాలను పట్టుకొని దళితుల ర్యాలీపై తెగబడటాన్ని డీఎస్ఎంఎం నేత వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. కాషాయమూకల దాడిలో రాహుల్ ఫతంగలే మృతిచెందగా, అనేకమంది గాయాలపాలయ్యారు. హింసకు కారకులైన వారందరినీ కఠినంగా శిక్షించాలని, మృతుడు రాహుల్ ఫతంగలే కుటుంబసభ్యులకు తక్షణమే, తగిన నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

సెన్సెక్స్ ▼ 0.49	నిఫ్టీ ▼ 07	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
33,812	10,442	63.48	రూ. 30,074	రూ. 42,000





కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



హీరో మోటో అమ్మకాల్లో 43% వృద్ధి



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటోకార్ప్ డిసెంబర్ నెలలో 43 శాతం వృద్ధితో 4,72,731 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో 3,30,202 వాహనాలను విక్రయించినట్టు కంపెనీ తెలిపింది. కాగా 2017లో రికార్డు స్థాయిలో 72,07,363 యూనిట్లు విక్రయించినట్లు ఆ కంపెనీ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-డిసెంబర్ కాలంలో 11 శాతం వృద్ధితో మొత్తం 55,85,558 యూనిట్లు అమ్మకాలు చేసింది. కేవలం భారత మార్కెట్‌లోనే కాక, విదేశీ మార్కెట్‌లోనూ మెరుగైన అమ్మకాలు సాధించామని హీరో మోటోకార్ప్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పవన్ ముంజల్ పేర్కొన్నారు.

పసిడికి పెరుగుతున్న డిమాండ్



ముంబయి : కొత్త ఏడాదిలో బంగారం ధరలు పెరుగుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో బంగారం ధర రూ.30 వేల స్థాయికి ఎగువన కొనసాగుతోంది. మంగళవారం బులియన్ మార్కెట్లో 10 గ్రాముల ధర రూ.50 లు పెరిగి రూ. 30,450 కొనసాగుతోంది. ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల ఫిబ్రవరి ఫ్యూచర్స్ రూ. 42 ఎగసి రూ. 29,165 వద్ద ఉంది.సింగపూర్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం 0.42 శాతం పెరిగి 1,308 డాలర్లకు చేరుకుంది. స్థానిక నగల విక్రయదారుల కొనుగోళ్లు, గ్లోబల్ మార్కెట్ల ధోరణితో బంగారం ధరలు పుంజుకున్నాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం రూ. 50 రూ. 30,450 వద్ద, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ. 30,300గా పలికింది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్ల పెంపు అంచనాలతో డాలర్ బలహీనపడడంతో బంగారం కొనుగోళ్లు కు డిమాండ్ పెరిగింది. మరోవైపు ఉత్తర కొరియా పరిణామాలు పసిడిపై పెట్టుబడులకు దోహదం చేస్తున్నాయి.

రెస్టారెంట్ల తప్పుడు జీఎస్టీ వసూళ్లు..



న్యూఢిల్లీ : హార్డ్‌క్యాసిల్ రెస్టారెంట్లు, వెస్ట్, సౌత్‌లోని మెక్‌డొనాల్డ్, రిటైల్ లైఫ్‌స్టయిల్, హోండా డీల్స్ సంస్థలు తప్పుడు వస్తు సేవల పన్ను (జీఎస్టీ)తో వినియోగదారులను మోసం చేస్తున్నాయి. జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయడం లేదు. మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నందున ఈ సంస్థలపై యాంటీ-ప్రాఫిటరింగ్ చర్యలకు ప్రభుత్వం దిగింది. ఇలాంటి ఐదు సంస్థలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సేఫ్‌గార్డ్స్ (డిజి సేఫ్‌గార్డ్స్) ఈ నోటీసులు జారీచేసింది. హార్డ్‌క్యాసిల్ రెస్టారెంట్లపై కూడా జీఎస్టీ రేటును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. కాని ఈ పన్ను ఫలితాలను ఆ సంస్థ వినియోగదారులకు బదిలీ చేయలేదు.

ఎస్‌బీఐకి రూ.1,771 కోట్లు!

'కనీస నిల్వ' కింద వసూల్



న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థ 'భారతీయ స్టేట్ బ్యాంక్' (ఎస్‌బీఐ) 2017 ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో కనీస నిల్వలేని ఖాతాలపై విధించిన పెనాల్టీ ద్వారా బ్యాంక్‌కు రూ.1,771 కోట్లు వచ్చాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదికను ఉటంకిస్తూ పలు మీడియా కథనాల ద్వారా వెల్లడైంది. దాదాపు ఐదేండ్ల విరామం తర్వాత ఎస్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కనీస నిల్వలేని ఖాతాలపై చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ ఖాతాల నుంచి వసూల్ చేసిన చార్జీలతో ఎస్‌బీఐకి భారీగా లబ్ది చేకూరింది. జులై-సెప్టెంబరు త్రైమాసికానికి బ్యాంకు నికర లాభం రూ.1,581.55 కోట్ల కన్నా ఇది అధికంగా ఉండడం, ఏప్రిల్-సెప్టెంబరు మధ్య వచ్చిన నికరలాభం రూ.3,586 కోట్లలో సగం రుసుముల ద్వారా వచ్చినట్టు తెలిసింది. మరోవైపు 2016-17 ఆర్థిక సంవత్సరంలో కనీస నగదు నిల్వపై ఎస్‌బీఐ ఎలాంటి చార్జీలను వసూలు చేయలేదు. అనంతరం ఈ చార్జీలు వసూల్ చేయాలని నిర్ణయించింది.

ఎస్‌బీఐలో మొత్తం 42కోట్ల సేవింగ్స్ ఖాతాలుండగా, వీటిలో 13కోట్లు సాధారణ పొదుపు ఖాతాలు, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలు ఉన్నాయి. అయితే వీటిపై ఎలాంటి చార్జీలను ఎస్‌బీఐ వసూలు చేయటం లేదు.

ఇదిలా ఉండగా కొత్త ఏడాది కానుకగా ఎస్‌బీఐ వడ్డీ రేట్లలో 30 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం విదితమే. మరోవైపు ఇదే బాటలో..కనీస నగదు నిల్వలేని ఖాతాలపై విధించిన రుసుముల ద్వారా.. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు ఈ ఏడాది ఏప్రిల్-నవంబర్ మధ్యలో 97.34 కోట్లు వచ్చాయి. సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.68.67 కోట్లు, కెనరా బ్యాంకు రూ.62.16 కోట్లు వచ్చినట్టు వెల్లడైంది.

ఈ ఏడాది 6.5% వృద్ధి : హెచ్‌ఎస్‌బీసీ



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ 6.5 శాతం వృద్ధితోనే సరిపెట్టుకునే అవకాశాలు ఉన్నాయని హెచ్‌ఎస్‌బీసీ అంచనా వేసింది. కాగా 2018-19లో ఇది 7.0 శాతానికి, 2019-20లో 7.6 శాతంగా చోటు చేసుకోవచ్చని విశ్లేషించింది. నోట్ల రద్దు, జీఎస్టీ సంక్లిష్టతలు తొలగి పోవడానికి కొంత సమయం పడుతుందని తెలిపింది. క్రమంగా భారత వృద్ధి రేటు పుంజుకోవచ్చని తన రిసెర్చ్ రిపోర్టులో పేర్కొంది. తిరిగి దేశంలో ద్రవ్యోల్బణం పుంజుకోవచ్చని హెచ్చరించింది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చని అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4 శాతంగా ఉండొచ్చని తెలిపింది.

జీఎస్టీపై ఎఫ్‌ట్యాప్సీ శిక్షణ

నవతెలంగాణ, బిజినెస్ డెస్క్: జీఎస్టీ కంప్లియన్స్ అంశంపై నాలుగు రోజుల సర్టిఫికెట్ కోర్సును అందిస్తున్నట్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక, ఆర్థిక మరియు వాణిజ్య సంఘాల సమాఖ్య (ఎఫ్‌ట్యాప్సీ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 5నుంచి దీన్ని నిర్వహించనున్నట్టు పేర్కొంది. ముఖ్యంగా గత జులై నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ అమలు, సందేహాల నివృత్తి, ఇప్పటికీ అర్థంకాని సాంకేతిక అంశాలు, జీఎస్టీ చెల్లింపు పట్ల ఎదురవుతున్న సాంకేతిక అంశాలు వ్యాపార సంస్థల సిబ్బంది పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్యల నివృత్తికోసం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో ఈ శిక్షణ అందించనున్నామన్నారు.

రూ.11వేల కోట్లకుపైగా ఆర్‌ఐఎన్‌ఎల్ టర్నోవర్

ఉత్పత్తిలో 13% వృద్ధి నమోదు



న్యూఢిల్లీ : రాష్ట్రీయా ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) టర్నోవర్ దూసుకుపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో ఈ ప్రభుత్వ రంగ సంస్థ టర్నోవర్ రూ.11,405 కోట్లకు చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం టర్నోవర్‌తో పోల్చితే 30 శాతం వృద్ధి సాధించింది. ఇదే సమయంలో 13 శాతం పెరుగుదలతో 36.5 లక్షల టన్నుల హాట్ స్టీల్ ఉత్పత్తిని సాధించింది. కాగా 15 శాతం వృద్ధితో పెరుగుదలతో 35.4 లక్షల మిలియన్ టన్నుల లిక్విడ్ స్టీల్ ఉత్పత్తిని నమోదు చేసింది. సీలేబుల్ స్టీల్ ఉత్పత్తి 15 శాతం పెరిగి 31.9 లక్షల టన్నులుగా నమోదు చేసింది. 2017లో విస్తరణ కూడా పూర్తి అయ్యిందని ఆర్ఐఎన్ఎల్ వీఎస్‌పీ స్టీల్ ప్లాంట్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) మధూసుధన్ తెలిపారు. విస్తరణ, ఆధునీకరణతో ఈ ప్లాంట్ సామర్థ్యం 73 లక్షల టన్నులకు చేరిందన్నారు.


ఆర్ఐఎన్ఎల్ ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా ప్రగతిని కనబర్చిందని మధుసూధన్ పేర్కొన్నారు. నవంబర్, డిసెంబర్ కాలంలో స్థూల మార్జిన్లు సాధించామని, ఇదే సమయంలో ఎలాంటి అప్పులు తీసుకోలేదన్నారు. నవంబర్, డిసెంబర్ మాసాల్లో మార్కెటింగ్ డిపార్టుమెంట్ 10 లక్షల టన్నుల అమ్మకాలు చేసిందన్నారు. చివరి నెలలో రూ.2,000 కోట్ల టర్నోవర్ వచ్చిందన్నారు. 2017-18లో 10 లక్షల మిలియన్ టన్నుల ప్రత్యేక స్టీల్‌ను ఉత్పత్తి చేయాలని గతేడాది అక్టోబర్‌లో ఆర్ఐఎన్ఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో ఈ రంగంలో అధిక మార్కెట్ వాటాను లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఆర్ఐఎన్ఎల్ ఇప్పటికే నూతన టెక్నలాజీని అందిపుచ్చుకుందని సిఎండి తెలిపారు. స్పెషల్ స్టీల్ సెగ్మెంట్‌లో మార్కెట్ వాటా పెంపునపై దృష్టి కేంద్రీకరించామన్నారు.

ఊగిసలాటలో మార్కెట్లు



ముంబయి: వివిధ పరిణామాల మధ్య మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఊగిసలాటకు గురై తుదకు యథాతథంగా ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 0.49 పాయింట్లు తగ్గి 33,812 వద్ద ముగిసింది. ఉదయం 33,914 వద్ద మొదలైన సూచీ ఓ దశలో 101 పాయింట్ల లాభాల్లో నమోదయ్యింది. ఇంట్రా ట్రేడింగ్‌లో 33,964-33,703 మధ్య ట్రేడింగ్ అయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 6.65 పాయింట్లు పెరిగి 10,442.20 వద్ద నమోదయ్యింది. రంగాల వారిగా బీఎస్ఈలో ఆయిల్ అండ్ గ్యాస్ 0.51 శాతం, ఎఫ్ఎంసీజీ 0.42 శాతం, పీఎస్‌యూ, మౌలిక వసతులు 0.34 శాతం చొప్పున నష్టపోయాయి. మరోవైపు ఆటో 0.15 శాతం, విద్యుత్ 0.13 శాతం, లోహ 0.05 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్‌లో టాటా మోటార్స్ 3.16 శాతం, ఓఎన్‌జీసీ 2.36 శాతం, కోల్ ఇండియా 1.46 శాతం, ఎన్‌టిపిసి 1.19 శాతం, ఇండస్ ఇండ్ బ్యాంకు 1.15 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ 2.24 శాతం, ఎస్‌బీఐ 1.35 శాతం, మారుతి సుజుకి 1.24 శాతం, ఎల్అండ్‌టీ 1.01 శాతం, హీరో మోటో కార్ప్ 0.92 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

రెండో రాజధాని ప్రణాళిక లేదు..



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

దక్షిణ భారతదేశంలోని హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేసే ప్రణాళిక లేదని కేంద్రం పేర్కొంది. ఈ మేరకు టీఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారం అహిర్ మంగళవారం రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. హైదరాబాద్‌ను రెండో రాజధానిగా ప్రకటించే ప్రణాళికలు ఏమైనా కేంద్రం వద్ద ఉన్నాయా అన్న ప్రశ్నకు.. కేంద్రమంత్రి 'లేదు' అని సమాధానంలో పేర్కొన్నారు. ఇటీవల దీపావళి సందర్భంగా ఢిల్లీలో ఆందోళనకరంగా కాలుష్య పరిమితి పెరగడంతో ప్రత్యామ్నాయ రాజధాని డిమాండ్ ప్రధానంగా వినిపించింది. పైగా గత వారం రాజ్యసభలో జరిగిన చర్చలోనూ అన్నాడీఎంకే ఎంపీ నవనీత్‌కృష్ణన్ సైతం ఇలాంటి డిమాండ్ చేశారు. ఢిల్లీ గ్యాస్ ఛాంబర్‌గా మారిందని, కాబట్టి పార్లమెంట్ సమావేశాలను దక్షిణ భారతదేశానికి మార్చాలని అన్నారు. ఢిల్లీలో ప్రతి ఒక్కరూ భయపడుతూ జీవిస్తున్నారని చెప్పారు.

సీపీఎస్‌ను విధానాన్ని రద్దు చేయాలి



సీఎస్‌ను కలిసిన కోదండరామ్ బృందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జేఏసీ ప్రతినిధులను పురుషోత్తం, గోపాల్‌శర్మతో కలిసి మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకా కాకుండా, ప్రభుత్వాలకు నష్టమని తెలిపారు. ఆ సొమ్ము ప్రభుత్వాల వద్ద ఉంటే సంక్షేమ పథకాలకు వాడుకోవచ్చని, బ్యాంకుల వద్ద ఎక్కువ రుణాలకు అప్పుతెచ్చుకోవాల్సిన అవసరం ఉండదన్నారు. పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాలు సీపీఎస్ విధానాన్ని అమలు చేయడంలేదని, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లు సీపీఎస్‌ను తొలగించడానికి అధ్యయనం చేస్తున్నాయని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ పొందడం ఉద్యోగి హక్కు అని, దశాబ్దాలపాటు సేవ చేసి రిటైరైన ఉద్యోగులకు, వారి కుటుంబాలకు సామాజిక భద్రతను కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని 1982లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. అందువల్ల రాష్ట్రంలో 1.2 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ భవిష్యత్తుకు భద్రతలేని సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తేవాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

వచ్చే వారం ఢిల్లీలో జిగ్నేష్ మేవానీ ర్యాలీ

న్యూఢిల్లీ : గుజరాత్‌లో ఎన్నికైన ఎమ్మెల్యే, దళిత నాయకుడు జిగ్నేష్ మేవానీ, అస్సాం రైతు నాయకుడు అఖిల్ గొగోయ్ లు వచ్చే వారం 'సామాజిక న్యాయం' అనే అంశం పై ర్యాలీ నిర్వహించనున్నారు. భీమ్ ఆర్మీ దళిత సంస్థ నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను విడుదల చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ ర్యాలీ జరుగుతుందని నిర్వాహకుడు ఒకరు తెలిపారు. విద్యాహక్కులు, ఉద్యోగం, జీవనోపాధి, లింగ సమానత్వం సాధనకోసం ఈ ర్యాలీ జరుగుతుందని జేఎన్‌యూ లీడర్ మోహిత్ పాండే తెలిపారు. ఈ ర్యాలీ జనవరి 9 న పార్లమెంట్ వీధి నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులతో సాగుతుందన్నారు.

ఇంటర్‌లో గ్రేడింగ్ విధానం

సమస్యలు నాకివ్వండి... బోధనపై దృష్టి పెట్టండి:

అధ్యాపకులకు కడియం సూచన

- ప్రయివేటు విద్యపై సర్కారుకు కక్ష లేదు
- ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడమే లక్ష్యం
- ఉద్యోగ బాధ్యతోపాటు సామాజిక బాధ్యత ఉండాలి
- ఇంటర్ విద్య జేఏసీ ఆధ్వర్యంలో విద్యాసదస్సు



మాట్లాడుతున్న మంత్రి కడియం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్‌లో మార్కుల పద్ధతిని తొలగించి గ్రేడింగ్ విధానం ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. మార్కుల విధానంతో అనేక సమస్యలొస్తున్నాయని అన్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడానికి, విద్యావ్యాపారాన్ని తగ్గించడానికి, ప్రమాణాలు పెంచడానికి గ్రేడింగ్ విధానం దోహదపడుతుందని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో ఇంటర్ విద్య జేఏసీ ఆధ్వర్యంలో 'ప్రగతిపథంలో ఇంటర్ ప్రభుత్వ విద్య'అనే అంశంపై విద్యాసదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇంటర్ బోర్డును దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఆ దిశగా అధికారులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ప్రయివేటు విద్య అంటే వ్యతిరేకత లేదని చెప్పారు. ప్రభుత్వానికి కక్ష లేదని స్పష్టం చేశారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయాలన్న ఆలోచన లేదన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ఆ దిశగా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ అధ్యాపకులు గతంలో కార్పొరేట్ విద్యాసంస్థలో బోధించే వారని గుర్తు చేశారు. అలాంటి వారు ఇప్పుడుంటే సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థి కేంద్రంగా మార్పులు తేవాలని సూచించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. అధ్యాపక సంఘాలు సమస్యలు తనకు ఇవ్వాలని, బోధనపై దృష్టి సారించాలని సూచించారు. ఇంటర్ విద్య కమిషనరేట్‌లో తర్వాత సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కళాశాలలు మూతపడితే ఉనికికే ప్రమాదమని గ్రహించిన అధ్యాపకులు, కాంట్రాక్టు లెక్చరర్లు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి కృషి చేశారని అన్నారు. ఎన్‌రోల్‌మెంట్ పెంచడమే కాకుండా వారంతా పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. చేరినప్పుడు ఉండే విద్యార్థుల సంఖ్య పరీక్షలకు హాజరయ్యేటపుడు లేదని అన్నారు. ఎక్కడో లోపముందని, దాన్ని సరిదిద్దాలని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 2.40 లక్షల ఇంటేక్ ఉంటే 2 లక్షల మంది విద్యార్థులూ లేరని అన్నారు. ప్రభుత్వ విద్యారంగంపై తల్లిదండ్రులు, విద్యార్థుల్లో నమ్మకం పెంచాలని, ఎక్కువ మంది చేరేలా కృషి చేయాలని సూచించారు. ఎంసెట్, జేఈఈ, నీట్ కోచింగ్ వేసవిలో ఇచ్చేందుకు అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చినందకు అభినందించారు. అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్‌కు ఉద్యోగ బాధ్యతతోపాటు సామాజిక బాధ్యత ఉండాలన్నారు. కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు ర్యాంకులు రావాలని ఆకాంక్షించారు. కాలేజీలు బాగుండాలంటే సొంత ఇల్లుగా భావించి కష్టపడాలని సూచించారు. అన్ని కాలేజీల్లోనూ ప్రాక్టికల్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. తెలంగాణలో ప్రభుత్వ కాలేజీల అభివృద్ధికి మరో రూ.350 కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

జీజేఎల్ఏ అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

ప్రభుత్వ కాలేజీల అధ్యాపకుల సంఘం (జీజేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా పి మధుసూదన్‌రెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. జీజేఎల్ఏ ప్రధాన కార్యదర్శిగా వి బాబురావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి రామానుజాచారి, జాయింట్ సెక్రెటరీగా కె కళ్యాణ్‌రావు, ఆర్థిక కార్యదర్శిగా ఎం కవితాకిరణ్, మహిళా విభాగం కార్యదర్శిగా టి సుధారాణితోపాటు 14 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఇంటర్‌లో గ్రేడింగ్‌పై కమిటీ

సాధ్యాసాధ్యాలు పరిశీలన : కడియం

ఇంటర్మీడియెట్‌లో గ్రేడింగ్ విధానం ప్రవేశపెట్టడంపై కమిటీ ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చెప్పారు. మంగళవారం సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రేడింగ్ విధానం అమలు సాధ్యాసాధ్యాలు పరిశీలించి నివేదిక ఇస్తుందని అన్నారు. ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ అమల్లో ఉందని చెప్పారు. జేఈఈకి దరఖాస్తు చేయాలంటే ఇంటర్‌లో 75 శాతం మార్కులు అంతకంటే ఎక్కువుండాలని అన్నారు. గ్రేడింగ్ విధానం అమల్లోకి వస్తే వెయిటేజీకి ఎలా పరిగణించాలి, జేఈఈకి దరఖాస్తు చేసే 75 శాతం మార్కులకంటే ఎక్కువున్న వారిని ఎలా గుర్తించాలన్నది కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. ఇంటర్‌లో 71 శాతం నుంచి 80 శాతం మార్కులున్న వారిని బీ1 గ్రేడ్‌గా పరిగణిస్తామని, 75 శాతం వచ్చిన వారిని గుర్తించడమే సమస్య అని అన్నారు. వీటన్నింటినీ తాము నియమించే కమిటీ పరిశీలించి ప్రతిపాదనలు రూపొందించి ఇస్తుందని చెప్పారు. వాటిని పరిశీలించి ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వర్తింపచేసే అంశాన్నీ పరిశీలిస్తామని చెప్పారు.

విద్యావైద్యం ప్రభుత్వరంగంలోనే ఉండాలి : పల్లా రాజేశ్వర్‌రెడ్డి

విద్యావైద్య రంగాలు ప్రభుత్వరంగంలోనే ఉండాలని శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రయివేటు రంగంలో ప్రపంచమంతా ముందుకెళ్తోందని చెప్పారు. ప్రభుత్వరంగంలోనే అందరికీ విద్యావైద్యం అందించడం కష్టమని అన్నారు. వృత్తివిద్యలో, ఇంజినీరింగ్‌లో, జూనియర్ కాలేజీల్లో ఎక్కువ మంది ప్రయివేటురంగంలో చదువుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయాలంటే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని చెప్పారు. కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇంటర్ విద్య కమిషనర్ అశోక్ మాట్లాడుతూ ఇంటర్ విద్య ప్రగతిపథంలో నడుస్తోందని చెప్పారు. అధ్యాపకులకు బదిలీలు చేపట్టాలని ఇంటర్ విద్య జేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో జీజేఎల్ఏ నాయకులు బాబురావు, భాస్కర్‌రెడ్డి, గోనారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంజన్‌గౌడ్, నర్సారెడ్డి, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘాల నేతలు కొప్పిశెట్టి సురేష్, కనకచంద్రం, గాదె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గంగిరెద్దులాడించే వారిపై వేధింపులు అరికట్టాలి

టీ మాస్, ఎంబీసీ సంఘాల డిమాండ్

నవతెలంగాణ - ముషీరాబాద్

గంగిరెద్దులను ఆడించే వారిపై పోలీసుల వేధింపులు అరికట్టాలని మంగళవారం హైదరాబాద్‌లోని ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తాలో టీమాస్, ఎంబీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీమాస్, ఎంబీసీ సంఘాల నేతలు ఎం.శ్రీనివాస్, గుమ్మడిరాజు నరేష్ మాట్లాడుతూ.. నగరంలో గంగిరెద్దులను ఆడించేవారు వృత్తిని నమ్ముకుని తరతరాలుగా జీవిస్తున్నారని, వీరిని బిక్షగాళ్లుగా పరిగణించి అరెస్టు చేయడం దారుణమని అన్నారు. వీరికి వృత్తి తప్ప వేరే ప్రత్యామ్నాయ పనులు లేవని, అటువంటి వారిని అడ్డుకుంటే ఏవిధంగా జీవిస్తారని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుని కుమార్తె ఇవాంకా ట్రంప్ వచ్చిన సందర్భంలో గంగిరెద్దులను ఆడించకుండా అడ్డుకున్నారని, ప్రస్తుతం సంక్రాంతి పండుగ సందర్భంగా ఇల్లిల్లూ తిరిగే వారిని అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో గంగిరెద్దుల సంఘం నాయకులు కోటయ్య, అశోక్, సమ్మయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో గంగిరెద్దులతో నిరసన ప్రదర్శన